www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సెకండ్ షోకు పిల్లల్ని అనుమతించొద్దు

16 ఏళ్లలోపు వారిని రాత్రి 11 తర్వాత రానివ్వొద్దు
పుష్ప-2 తొక్కిసలాట నేపథ్యంలో హైకోర్టు ఆదేశం
తల్లి మరణం, చిన్నారి ప్రాణాపాయ స్థితి దారుణం
ప్రభుత్వమే నిజాయితీగా నిర్ణయం తీసుకోవాలి
అప్పటిదాకా మా ఆదేశం వర్తిస్తుంది: హైకోర్టు 14



మంగళవారం | 28-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 300
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 7.36 తదుపరి అమావాస్య; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 8.45 తుదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: సా.4.45-6.18; దుర్ముహూర్తం: ఉ.9.06-9.51, రా.10.16-11.05; అమృతఘడియలు: రా.2.06-3.39; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.04
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తలల లెక్కతో వక్ఫ్ బిల్లుకు
జేపీసీ ఓకే

- విపక్షం అభ్యంతరాలు చెత్తబుట్టలోకి
- ఎన్డీఏ సభ్యుల సవరణలకు గ్రీన్ సిగ్నల్
- వివాదం లేని వక్ఫ్ ఆస్తుల్లో జోక్యం వద్దు
- తెలుగుదేశం కీలక సవరణకు ఆమోదం
- క్రూర చట్టం.. కాషాయీకరణ ప్రయత్నం
- ప్రజలే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- ప్రతిపక్షాల సభ్యుల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం సమావేశమైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సవరణలు అన్నింటినీ పూర్తిగా తిరస్కరించి, ఎన్డీఏ సభ్యులు ప్రవేశపెట్టిన ప్రతీ సవరణను పూర్తిగా అంగీకరించడంతో బిల్లుకు తుదిరూపం ఏర్పడింది. పదహారు మంది ఎన్డీయే సభ్యులు, పది మంది విపక్ష సభ్యులున్న జేపీసీ సంఖ్యాబలంతో పూర్తి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులను సర్వే కమిషనర్ బదులు కలెక్టర్ సర్వే చేసేందుకు వీలు కల్పించడం, వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయాలను హైకోర్టులో సవాలు చేసేందుకు అనుమతించడం వంటి కీలక మార్పులను బిల్లులో ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తుల్ని ప్రస్తుతం ఉపయోగిస్తున్న వారి విషయంలో జోక్యం చేసుకోకూడదని, ఆ ఆస్తులు

మిగతా 2వ పేజీలో...

టకీ టకీ భరోసా

రైతుల ఖాతాల్లో నగదు జమ.. 4.41 లక్షల మందికి 569 కోట్ల సాయం

రైతు కూలీలకు రూ.10 కోట్ల ఆత్మీయ భరోసా
ఒకే రోజు నాలుగు పథకాల అమలు ప్రారంభం
561 మండలాల్లో 577 గ్రామాల్లో లబ్ధిదారులు
15,414 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డుల జారీ
పాత కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది చేర్పు
72 వేల మందికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు
ఇండ్ల కోసం 80.50 లక్షల మంది దరఖాస్తులు
ఇప్పటికే 40 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి
ఇళ్ల స్థలాలున్న వారు 21.30 లక్షల మంది
స్థలాలు లేనివారు 18.7 లక్షల మందిగా నిర్ధారణ!
వారంలో పూర్తి కానున్న పరిశీలన ప్రక్రియ
ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం: తుమ్మల
అచ్చంపేట మార్కెట్ కమిటీ ఘటనపై మంత్రి ఆరా



మధ్యప్రదేశ్ ఇండోర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం నిధులు ఆదివారం (ఈ నెల 26) అర్ధరాత్రి నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో టకీ టకీమని పడతాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగానే సోమవారం ఆయా రైతులకు నగదు జమ అయింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకం కింద 561 మండలాల్లోని 577 గ్రామాలకు చెందిన 4,41,911 మందికి పెట్టుబడి సాయం అందింది. మొత్తం 9,48,333 ఎకరాలకు సంబంధించి రూ.569 కోట్లు ఖాతాల్లో జమయ్యాయి. వీరితోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు కూడా సాయం అందింది. మొదటి విడతగా తొలి రోజు 18,180 మంది వ్యవసాయ కూలీల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున జమ చేశారు. ఈ రెండు పథకాలకు కలిపి రూ.579 కోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఆదివారం ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించిన విషయం

మిగతా 13వ పేజీలో...

ఇది గాంధీ.. గాడ్సే పరివార్ మధ్య యుద్ధం

గాడ్సే వైపు మోదీ.. గాంధీ వైపు రాహుల్
రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలుద్దాం
రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ యత్నం
దానిని పరిరక్షించేందుకు పోరాడుదాం
మధ్యప్రదేశ్ ఇండోర్ సభలో సీఎం రేవంత్ 13

ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుకు
రూ.3 వేలు డిమాండ్

2500 తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వార్డు ఆఫీసర్
ఖమ్మం జిల్లా సత్తుపల్లి మునిసిపాలిటీలో ఘటన



మనది నమ్మకమైన
భాగస్వామ్యం

దానికి కట్టుబడి ఉన్నాం.. ట్రంప్‌నకు మోదీ ఫోన్
కలిసి పనిచేసేందుకు నిర్ణయం.. త్వరలో భేటీ!
అక్రమ వలసదారుల కోసం గురుద్వారాల్లో తనిఖీ
ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థల మండిపాటు

న్యూఢిల్లీ, జనవరి 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి మాట్లాడారు. 'రెండోసారి బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించిన ప్రియమిత్రు'నికి అభినందనలు తెలిపారు. ఆయన అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత ఫోన్ చేయడం ఇదే ప్రథమం కావడం విశేషం. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఘన విజయం సాధించిన గత ఏడాది నవంబరు 7న కూడా ఆయనకు ఫోన్ చేశారు. దీనిపై మోదీ ట్వీట్ చేస్తూ పరస్పర ప్రయోజనాలకు, విశ్వసనీయ భాగస్వామ్యానికి

మిగతా 2వ పేజీలో...

స్టాక్ మార్కెట్ల భారీ పతనం

ఈ నెలలో రూ.32 లక్షల కోట్లు గల్లంతు 11
అమెరికా మార్కెట్లకు చైనా డీప్‌సీక్ షాక్




ఆర్టీసీలో సమ్మె సైరన్!

21 డిమాండ్లతో ఈడీకి జేఏసీ నోటీసులు
సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి 14
డ్రైవర్లు, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి
బస్ భవన్ ముందు ధర్నాలో జేఏసీ నేతలు

మధ్యాహ్న భోజన ధరలను 12
50% పెంచాలి!

ఇంటర్ విద్యార్థులకూ భోజనం పెట్టాలి
గురుకులాలు, హాస్టళ్లలో శుభ్రతను పెంచాలి
సరుకుల కొనుగోలులో మార్పులు చేయాలి
నాణ్యతపై వంటవారు, టీచర్లకు శిక్షణ ఇవ్వాలి
రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ నివేదిక

ఏడాదిన్నరలో
80 సర్జరీలు



జననిలో 54, అరుణలో 6, అలకనందలో 20
దాత, గ్రహీత, వైద్యుడు.. ఎవరికెవరూ తెలియదు!
అక్రమ దందా వ్యవహారాలన్నీ వాట్సాప్ ద్వారానే..!
కిడ్నీ రాకెట్‌లో వెలుగులోకి కీలక విషయాలు
అరెస్టులతో బయటకొస్తున్న విస్తుగొలిపే అంశాలు
సూత్రధారి పవన్‌ను విచారిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ/దిల్‌సుఖ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ దాత ఎవరో గ్రహీతకు తెలియదు.. వీరిద్దరూ ఎవరో ఆపరేషన్ చేసే వైద్యుడికి తెలియదు..!! కిడ్నీ మార్పిడి దందాలో అసలేం జరుగుతోందో ఎవరికీ అర్థం తెలియదు! ఈ ముఠాలో ఎవరి పాత్ర వారు పోషించడమే తప్ప.. ఒకరికొకరు కనీస ముఖ పరిచయం కూడా ఉండదు! కిడ్నీ మార్పిడి ముఠా దందాలో వెలుగుచూసిన విషయాలివి!! నాలుగు రోజుల క్రితం 9 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. ఈ దందాలో ప్రధాన సూత్రధారి పవన్, కీలక డాక్టర్ రాజశేఖర్ పెరుమాళ్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో విస్తుగొలిపే విషయాలెన్నో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన సిద్దంశెట్టి అవినాష్ సైదాబాద్‌లో జనని

మిగతా 14వ పేజీలో...



గద్దర్‌కు 'పద్మ' అవార్డు..
పక్కా ఇయ్యం

మా కార్యకర్తలను చంపితే పాటలు పాడాడు.. పోలీసులను మర్డర్ చేసిండు
ఆయన పేరెలా పంపుతారు?.. నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తికి ఎలా ఇస్తాం?
రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సంక్షేమ పథకాల పేర్లు మార్చితే ఊర్కోం: బండి సంజయ్
కావాలంటే రాష్ట్ర పథకాలకు ఇందిర, లాడెన్, దావూద్ పేర్లు పెట్టుకోవాలని వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నక్సల్ భావజాలం ఉన్న గద్దర్‌కు పద్మ పురస్కారం ఎలా ఇస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ ప్రశ్నించారు. అనేక మంది పోలీసులను ఎన్‌కౌంటర్ పేరుతో మర్డర్ జేసిన ఆయనకు పద్మ అవార్డు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సోమవారం ఇక్కడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సంజయ్.. గద్దర్‌కు పద్మ పురస్కారం ప్రకటించకపోవడంపై ఒక విలేకరి ప్రశ్నించినప్పుడు తీవ్రంగా స్పందించారు. "ఎట్లిస్తామన్నా.. గద్దర్‌కు ఎట్లిస్తాం చెప్పండి? ఆయన భావజాలమేంది? ఎంత మంది భారతీయ జనతాపార్టీ కార్యకర్తలను మర్డర్‌జేయించిన వ్యక్తి ఆయన? ఎట్లిస్తాం? పక్కా ఇయ్యం. మా కార్యకర్తలను చంపితే పాటలుపాడిన వ్యక్తి గద్దర్. మీరు పంపితే ఇస్తామా ఏంది అవార్డ్? భయపడే ప్రసక్తే లేదు. వెనక్కిపోయే ప్రసక్తే లేదు. వందలమంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం 'భారత్ మాతాకీ జై' అంటూ ఆందోళన చేస్తుంటే.. నక్సల్స్ భావజాలం ఉన్న గద్దర్ మా కార్యకర్తలను హత్య చేయించిండు. ఎన్ఐఏ వచ్చి

మిగతా 12వ పేజీలో...

ఆలింగనం చేసుకున్నప్పుడు
గద్దర్ భావజాలం గుర్తుకు రాలేదా?

బీజేపీ వారికే అవార్డులివ్వాలని రాజ్యాంగంలో ఉందా?
బండి సంజయ్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్ 12
గద్దర్‌ను కేసీఆర్, బండి అవమానించారు: విప్ ఆది



3

సూర్యాపేటలో యువకుడి
పరువు హత్య?

రాయితో తలపై మోది హతమార్చిన వైనం
తమ అమ్మాయిని ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నాడని యువతి కుటుంబీకుల కోపం

జగన్ అక్రమాస్తుల కేసుల్లో..
రోజువారీ విచారణ



సీబీఐ కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం
తెలంగాణ హైకోర్టు పర్యవేక్షించాలని సూచన
ఎమ్మెల్యే, ఎంపీల కేసులపై సుప్రీంకోర్టు తీర్పు
ఈ కేసులకూ వర్తిస్తుందని స్పష్టీకరణ
వేరే రాష్ట్రానికి బదిలీ చేయక్కర్లేదని వెల్లడి
జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌ను ఉపసంహరించుకున్న రఘురామ కృష్ణంరాజు

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టు (సీబీఐ ప్రత్యేక కోర్టు)ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసుల విచారణ తీరును పర్యవేక్షించాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. జగన్ బెయిల్ రద్దు చేయాలని 2023 అక్టోబరు 6న, ఆయన అక్రమాస్తుల కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని అదే ఏడాది నవంబరు 1న అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ రెండు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ వాదనలు వినిపించారు. కేసుల విచారణ జరగకుండా జగన్ అడ్డుపడుతున్నారని తెలిపారు. బెయిల్ మంజూరైన తర్వాత కోర్టుకు హాజరు కావడం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జగన్ మాజీ ముఖ్యమంత్రి అని, ఆయన బెయిల్‌పై బయట ఉండడంతో

మిగతా 12వ పేజీలో...



బ్రహ్మపుత్రపై భారీ రిజర్వాయర్

325 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న భారత
దానిపైన అతిపెద్ద జల విద్యుత్తు కేంద్రం ఏర్పాటు
అరుణాచల్ ప్రదేశ్‌లోని చైనా సరిహద్దుల్లో నిర్మాణం
డ్రాగన్ 'వాటర్ బాంబ్' రిజర్వాయర్‌కు అడ్డుకట్ట
చైనా భారీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా కాచుకోవడమే లక్ష్యం 2

మహారాష్ట్రలో 'జీబీఎస్'తో తొలి మరణం

గీలన్ బా సిండ్రోమ్ లక్షణాలతో సోలాపూర్‌లో వ్యక్తి మృతి
పుణెలో 110 కేసులు.. 16 మందికి వెంటిలేటర్‌పై చికిత్స
కలుషిత నీరే కారణం!.. ఏడుగురు వైద్యులతో కేంద్ర బృందం 2

మళ్లీ కైలాశ్, మానస సరోవర్ యాత్రలు

నేరుగా తిరిగే విమానాల పునరుద్ధరణ.. భారత్, చైనా అంగీకారం

కాంగ్రెస్‌లో
ఎమ్మెల్సీ వేడి!

మార్చి 29న ఖాళీ కానున్న ఎనిమిది సీట్లు
పట్టభద్రుల స్థానంలో జీవన్‌రెడ్డి పోటీపై అస్పష్టత
ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసే అంశంపై పరిశీలన
జీవన్‌రెడ్డినే పోటీకి దింపాలని అధిష్ఠానం సూచన
రేసులో మస్కు రమణారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు
5 ఎమ్మెల్యే కోటా సీట్లలో కాంగ్రెస్‌కు 3 దక్కే చాన్స్
టికెట్ల కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు



హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. వచ్చే మార్చి నెలలో 8 సీట్లు ఖాళీ కానున్న నేపథ్యంలో టికెట్లు దక్కించుకోవడానికి ఆశావహులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ అధిష్ఠానం, ముఖ్య నాయకుల ప్రసన్నం కోసం చక్కర్లు కొడుతున్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుతోపాటు కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. అలాగే ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఒక ఎంఐఎం ఎమ్మెల్సీ

మిగతా 13వ పేజీలో...



10

ఫోన్ ట్యాపింగ్ కేసు..
తిరుపతన్నకు బెయిల్

పది నెలల తర్వాత సుప్రీం కోర్టులో ఊరట
విచారణకు సహకరించాలన్న ధర్మాసనం

బ్రహ్మపుత్రపై భారత్ భారీ రిజర్వాయర్

చైనా 'వాటర్ బాంబ్' రిజర్వాయర్‌కు చెక్

న్యూఢిల్లీ, జనవరి 27: భారత ప్రభుత్వం దేశంలోకెల్లా పెద్దదైన జల విద్యుత్ కేంద్రాన్ని అరుణాచల్ ప్రదేశ్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించ తలపెట్టింది. చైనా సరిహద్దులకు కాస్త దిగువన నిర్మించే దీని ఖర్చు అక్షరాలా లక్షన్నర కోట్ల రూపాయలు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏకంగా 325 టీఎంసీల నీటిని నిల్వచేసే రిజర్వాయర్‌ను కట్టబోతున్నారు. నిజానికి పర్యావరణ పరంగా ఆలోచిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో అంతపెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. కానీ, ఎగువన చైనా నిర్మిస్తున్న మరో అతి పెద్ద జల విద్యుత్ కేంద్రం నుంచి దిగువన బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతాల్లో ఎదురయ్యే ముప్పు నుంచి కాచుకోవాలంటే ఈ జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించక తప్పడం లేదు. చైనా సరిగ్గా భారత్ సరిహద్దుల్లో తలపెట్టిన రిజర్వాయర్‌ను ఈశాన్య రాష్ట్రాలపై సంధించిన వాటర్ బాంబుగా పరిగణిస్తున్నారు. చైనా జలాశయంలో 194 టీఎంసీలను నిలువ చేయవచ్చు. దీనిపై 60 వేల మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. చైనా చెబుతున్న కారణం జల విద్యుత్తే అయినా.. ఇరు దేశాల మధ్య యుద్ధం వచ్చినపుడు చైనా ప్రతీకార చర్యల్లో భాగంగా ఈ డ్యాం గేట్లు ఎత్తేస్తే అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో వేల ఊళ్లు కొట్టుకుపోతాయి. దాన్ని ఎదుర్కోవడానికే దిగువన పరాంగ్ అనే ప్రాంతంలో భారత్ ఏకంగా 325 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తోంది. దీని వల్ల చైనా ఒకేసారి తన డ్యామ్‌ను ఖాళీ చేసినా దిగువన భారత్ నిర్మిస్తున్న జలాశయం మొత్తం వరదను కాచుకోగలదు.


మేలో జనం ముందుకు ఎల్టీటీఈ ప్రభాకరన్?

తమిళ మీడియాలో కథనాలు


(ఫైల్)

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో ప్రత్యేక తమిళ ఈలమ్ కోసం పోరాడిన...నిషేధిత తీవ్రవాద సంస్థ ఎల్టీటీఈ అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ జీవించేవున్నారా? త్వరలోనే జనం ముందుకు రానున్నారా?.. అవునంటోంది తమిళ మీడియా. మే నెలలో ఆయన జనం ముందుకు రానున్నారంటూ సోమవారం కొన్ని తమిళ పత్రికలు కథనాలు ప్రచురించాయి. శ్రీలంక సైన్యంతో జరిగిన పోరులో 2009 మే మాసంలో ప్రభాకరన్ మృతి చెందినట్టు సింహళ సైన్యం ఫోటోలను కూడా విడుదల చేసింది. ప్రభాకరన్ మృతి చెందినట్టు ప్రపంచమంతా భావిస్తున్నా.. ఎల్టీటీఈ సానుభూతిపరులైన తమిళ విమోచనోద్యమ నేత పి.నెడుమారన్ వంటి తమిళ రాజకీయ నేతలు మాత్రం ఆయన బతికే ఉన్నాడంటూ అడపాదడపా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే... ప్రభాకరన్, అతడి కుడిభుజంగా వ్యవహరించిన పొట్టు అమ్మన్‌కూడా మే నెలలో జనం ఎదుటకు రానున్నారంటూ తాజాగా కథనాలు వెలువడ్డాయి.

లోకం తీరు



తలల లెక్కతో వక్ఫ్ బిల్లుకు జేపీసీ ఓకే

(మొదటి పేజీ తరువాయి)

వివాదంలో ఉన్నపుడు, లేదా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నపుడు మాత్రమే కలుగజేసుకోవాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు ప్రవేశపెట్టిన కీలకమైన సవరణను జేపీసీ ఆమోదించింది. నిజానికి వాడుకలో ఉన్నంత మాత్రాన వక్ఫ్ ఆస్తి(వక్ఫ్ బై యూజర్) కాదని చెప్పడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం తెస్తుండగా దీనికి టీడీపీ ప్రవేశ పెట్టిన ప్రధాన సడలింపునకు జేపీసీ అంగీకరించింది. ఇప్పుడు వివాదమో, ప్రభుత్వ కార్యాలయమో ఉంటే తప్ప 'వక్ఫ్ బై యూజర్' అనేది ఎప్పటిలాగే వర్తిస్తుంది. అయితే కొత్త చట్టం అమల్లోకి వచ్చే నాటికి సదరు ఆస్తి రిజిస్టర్ అయి ఉండాల్సి ఉంటుంది. టీడీపీ తరఫున కృష్ణదేవరాయలు ప్రతిపాదించిన మూడు సవరణలనూ జేపీసీ ఆమోదించడం గమనార్హం. ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా ప్రకటిస్తే దానిపై కలెక్టర్ ద్వారా విచారణ జరపాలని బిల్లు ముసాయిదాలో ఉంటే, కలెక్టర్ కంటే ఉన్నత స్థాయి అధికారితో విచారణ జరిపించాలని లావు కృష్ణ దేవరాయలు మరో సవరణను ప్రవేశపెట్టారు. కలెక్టర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి అధిపతి అయినందున ఆ అధికారి రెవెన్యూ వాదన వైపే మొగ్గుచూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో టీడీపీ ఈ ప్రతిపాదనను చేర్చింది. చట్టం అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రతీ వక్ఫ్ తన ఆస్తుల వివరాలను వెబ్ పోర్టల్‌లో ప్రకటించాలనే నిబంధన ప్రతిపాదిత బిల్లులో ఉండగా, వక్ఫ్ వివరాలు ఇవ్వకపోయేందుకు సరైన కారణాలు ఉంటే తనకు మరింత సమయం కావాలని ముతావలి ట్రిబ్యునల్‌కు దరఖాస్తు పెట్టుకుంటే సుముఖంగా పరిశీలించాలని, అందుకు కనీసం ఆరు నెలల సమయం ఇవ్వాలని కూడా కృష్ణదేవరాయలు మూడో సవరణను ప్రవేశపెట్టారు. తెలుగుదేశం ప్రవేశపెట్టిన సవరణలతో పాటు అధికార పార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. జేడీ(యు) ఎంపీ దిలేశ్వర్ కమయిత్, బీజేపీ ఎంపీ, హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ తదితరులు సవరణలను ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తులను మత పరమైన ప్రయోజనాలకు మాత్రమే పరిమితం చేయాలని జేపీసీ నిర్ణయించింది. కాంగ్రెస్, తృణమూల్, ఎంఐఎం, డీఎంకేతో సహా ప్రతిపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన సవరణలు అన్నింటినీ జేపీసీ చైర్మన్ జగదంబికా పాల్ మూజువాణీ ఓటుతో తిరస్కరించేలా చేశారు.



క్లాజుల వారీగా తిరస్కరించాం

ప్రతిపక్ష సభ్యులు మొత్తం 44 క్లాజ్‌లకు ప్రతిపాదించిన అన్ని సవరణలను జేపీసీ సమావేశంలో ప్రవేశపెట్టి ప్రజాస్వామ్యయుతంగా తిరస్కరించామని చైర్మన్ జగదంబికా పాల్ అన్నారు. 6నెలలుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. చైర్మన్ స్వయంగా తమ క్లాజులను ప్రవేశపెట్టి, తలలను లెక్కించి, వాటిని తిరస్కరించినట్లు ప్రకటించారని, తమను నోరెత్తనివ్వలేదని టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ చెప్పారు. జేపీసీలో 16 మంది ఎన్డీఏ సభ్యులుండగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు పది మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ నుంచి బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సభ్యురాలిగా ఓటింగ్ లో పాల్గొన్నారు.

క్లాజుల వారీగా చర్చించలేదు

జేపీసీ చైర్మన్ అప్రజాస్వామికంగా వ్యవహరించారని, జేపీసీ విచారణలు జరిపినపుడు అభిప్రాయాలు చెప్పడానికి వచ్చిన వారిలో 95 శాతం మంది బిల్లును వ్యతిరేకించారని, సమర్థించిన ఐదు శాతం మంది కూడా మత నేపథ్యం ఉన్నవారేనని విపక్షాలు ఆరోపించాయి. ఎ.రాజా(డీఎంకే), కల్యాణ్ బెనర్జీ(తృణమూల్), గౌరవ్ గొగోయ్(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం), అరవింద్ సావంత్(శివసేన-యుబిటి) తదితరులు జేపీసీ వైఖరిని విమర్శిస్తూ సంయుక్త ప్రకటన జారీ చేశారు. సవరణలపై తాము చెప్పే అభిప్రాయాలను వినకుండా అడ్డుకున్నారని చెప్పారు. ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో జరిగిన సమావేశాల మినిట్స్‌ను తమకు సరఫరా చేయలేదని, క్లాజుల వారీగా చర్చకు అనుమతించలేదని వారు ఆరోపించారు. తమకు డాక్యుమెంట్లను ఇవ్వకుండా చైర్మన్ నియంతలా వ్యవహరించారని, క్రూరమైన మెజారిటీతో ఈ దేశాన్ని కాషాయమయంగా మార్చేందుకు ప్రభుత్వానికి జేపీసీ వీలు కల్పించిందని విమర్శించారు. గాంధీ, నెహ్రూ, పటేల్ వంటి జాతి నిర్మాతలు రూపొందించిన రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రజలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. విపక్ష సభ్యులు విడిగా తన అభ్యంతర ప్రకటనను(డిసెంట్ నోట్) జేపీసీ నివేదికలో చేర్చేందుకు అందజేసే అవకాశం ఉంది.

మహారాష్ట్రలో 'జీబీఎస్'తో తొలి మరణం!

- గీలన్ బా సిండ్రోమ్ లక్షణాలతో లాపూర్‌లో 40ఏళ్ల వ్యక్తి మృతి
- పుణెలో ఇప్పటివరకు 110 కేసులు

పుణె, జనవరి 27: గీలన్ బా సిండ్రోమ్(జీబీఎస్).. అత్యంత అరుదైన ఈ వ్యాధి ఇప్పుడు మహారాష్ట్రను భయపెడుతోంది. జీబీఎస్ లక్షణాలతో ఆదివారం సోలాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి(40) చనిపోయాడు. మహారాష్ట్రలో ఈ వ్యాధి కారణంగా నమోదైన తొలి మరణం ఇదేనని భావిస్తున్నారు. ఇటీవల పుణెకు వెళ్లి వచ్చిన తర్వాత ఈ వ్యక్తి అనారోగ్యం పాలయ్యాడు. విపరీతమైన తిమ్మిరి, కండరాల బలహీనత, డయేరియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జలుబు తదితర లక్షణాలతో ఈ నెల 18న సోలాహూర్‌లోనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఆదివారం చనిపోయాడు. మరోవైపు, పుణెలో జీబీఎస్ వ్యాప్తి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ ఇప్పటివరకు 110మందికి ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. వీరిలో 16మంది వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. జీబీఎస్ చాలా అరుదైన వ్యాధి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ సోకినప్పుడు రోగనిరోధక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని నరాల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. కొన్ని సందర్భాల్లో వ్యాక్సిన్లు వేసుకున్నప్పుడు వచ్చే ఇమ్యూనిటీ వ్యాధి కారకాలపై కాకుండా నరాలపై దుష్ప్రభావం చూపుతుంది. ఈ స్థితినే జీబీఎస్ వ్యాధి అంటారు. పుణెలో జీబీఎస్ కేసులు పెరగడానికి కలుషిత నీరే కారణం అని భావిస్తున్నారు. మహారాష్ట్రలో జీబీఎస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం కూడా ఏడుగురితో కూడిన ఓ ప్రత్యేక వైద్య బృందాన్ని పుణెకు పంపించింది. బీజీఎస్ వ్యాధి చికిత్సకు రూ.2లక్షల వరకు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రకటించారు. కాగా, జీబీఎస్ అంటువ్యాధి కాదని, నయం చేయవచ్చని వైద్యులు తెలిపారు.



మహాకుంభమేళా.. సనాతన సంస్కృతికి ఐక్యతా చిహ్నం!

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. సంగమంలో పుణ్య స్నానం

మహాకుంభ్‌నగర్(యూపీ), జనవరి 27: సనాతన సంస్కృతి, జీవన తత్వానికి మహాకుంభమేళా ఐక్యతా చిహ్నమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. సామరస్యమే సనాతన సంస్కృతికి జీవనాడిగా పేర్కొన్నారు. మహాకుంభమేళాలో సోమవారం ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో త్రివేణీ సంగమంలో సంప్రదాయ బద్ధంగా పుణ్యస్నానం ఆచరించారు. పుణ్యస్నానాల అనంతరం సంగమానికి హారతి ఇచ్చి, అక్షయవట(మర్రిచెట్టు) వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, పవిత్ర సంగమ స్నానానికి ముందు అమిత్ షా.. జునా పీఠాధిపతి అవధేశానంద గిరీజీ మహరాజ్ సహా పలువురు సాధువులతో సంగమ ప్రాంతంలోనే భేటీ అయ్యారు. ఇక, కేంద్ర హోం మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కనీవినీ ఎరుగని భద్రతను ఏర్పాటు చేశారు. ప్రయాగ్‌రాజ్ నగరంలో ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు సహా భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 13న ప్రారంభమైన మహాకుంభమేళాకు సోమవారం నాటికి 13.21 కోట్ల మంది భక్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

గంగలో మునిగితే పేదరికం పోతుందా: ఖర్గే


ఇండోర్/న్యూఢిల్లీ, జనవరి 27: గంగానదిలో మునిగితే పేదరికం పోతుందా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా మహూ(అంబేడ్కర్ జన్మస్థలం)లో కాంగ్రెస్ 'జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్' ర్యాలీ నిర్వహించింది. ఖర్గేతో పాటు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఖర్గే ప్రసంగిస్తూ.. తాను ఎవరి విశ్వాసాన్నీ ప్రశ్నించడం లేదన్నారు. తన మాటలకు ఎవరైనా బాధపడితే క్షమాపణ కూడా చెబుతున్నట్లు తెలిపారు. 'ప్రధాని మోదీ తప్పుడు హామీల వలలో ప్రజలు చిక్కుకోవద్దు. గంగలో మునిగితే పేదరికం అంతమవుతుందా? మీ కడుపు నిండుతుందా? ఓపక్క పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. వీళ్లు (బీజేపీ ప్రభుత్వం) రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్నారు. గంగలో మునకలకు పోటీపడుతున్నారు. ఇలాంటి వారితో దేశానికి మేలు జరుగదు. మాకూ దేవుడిపై విశ్వాసం ఉంది. అయితే మతం పేరిట పేదలను వాడుకోవడంపైనే మాకు అభ్యంతరం' అని తెలిపారు. మోదీ, షా చాలా పాపాలు చేశారని.. వంద జన్మలెత్తినా వారు స్వర్గానికి వెళ్లరని చెప్పారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని.. దశాబ్దాలుగా సనాతన ధర్మాన్ని అవమానిస్తూ వస్తోందని.. ఇతర మతస్థుల మనోభావాలను పురాతన పార్టీ ఇలా దెబ్బతీయగలదా అని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా నిలదీశారు. 'ఖర్గే వ్యాఖ్యలు కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయి. ఇఫ్తార్ పార్టీకి వెళ్తే ఉద్యోగాలు వస్తాయా.. పేదరికం పోతుందా అని సోనియా, రాహుల్ అడుగగలరా' అని సవాల్ విసిరారు.

నడిరోడ్డుపై ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కాల్పులు

రూర్కీ, జనవరి 27: ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఓ ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యే పట్టపగలే తుపాకీలతో కాల్పులు జరుపుకోవడం సంచలనం కలిగించింది. ఖాన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ (ఇండిపెండెంట్), మాజీ ఎమ్మెల్యే లస్కర్ కన్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్ (బీజేపీ)ల మధ్య ఈ కాల్పులు జరిగాయి. ఆదివారం గ్యాంగ్‌వార్‌లా తలపించిన ఈ ఘటన వీడియోలు వైరల్ అయ్యాయి. వీరిద్దరి మధ్య 2022 నుంచి తీవ్రమైన వైరం నెలకొంది. ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో వారు చేసుకున్న కామెంట్లు వివాదాన్ని రాజేసింది. తనను దూషించారన్న కారణంతో మాజీ ఎమ్మెల్యే ఛాంపియన్, ఆయన అనుచరులు ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ నివాసం వద్దకు వెళ్లి అక్కడివారితో ఘర్షణకు దిగారు. రాళ్లు విసరడంతోపాటు కాల్పులు జరిపారు. విషయం తెలుసుకొని ఎమ్మెల్యే కుమార్, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అనుచరులు అక్కడికి 300 మీటర్ల దూరంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి రాళ్లు విసరడంతో పాటు కాల్పులు జరిపారు. తుపాకీ పట్టుకొని వచ్చిన ఎమ్మెల్యేను పోలీసులు బలవంతంగా నిలువరించారు. సుమోటోగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ఇద్దరు నాయకులను అరెస్టు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరు పరచగా ఎమ్మెల్యేకు బెయిల్ లభించింది. మాజీ ఎమ్మెల్యేను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది.

గ్రహశకలాన్ని గుర్తించిన భారత విద్యార్థి

- దానికి పేరు పెట్టే అవకాశమిచ్చిన నాసా
- 14 ఏళ్ల దక్ష్ మాలిక్‌కు అరుదైన గౌరవం



న్యూఢిల్లీ, జనవరి 27: భారత్‌కు చెందిన 14 ఏళ్ల విద్యార్థి దక్ష్ మాలిక్ అరుదైన ఘనత సాధించాడు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఒక గ్రహశకలాన్ని గుర్తించిన మాలిక్‌కు... దానికి తనే పేరు పెట్టే అద్భుత అవకాశాన్ని అమెరికాకు చెందిన నాసా అతనికి కల్పించింది. దక్ష్ మాలిక్ నోయిడాలోని శివ నాదార్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 2022లో మాలిక్, అతని స్నేహితులకు నాసాతో భాగస్వామి అయిన ఇంటర్నేషనల్ ఆస్ట్రాయిడ్ డిస్కవరీ ప్రాజెక్టు (ఐఏడీపీ)లో చేరే అవకాశం లభించింది. తన స్నేహితులతో కలిసి ఏడాదిన్నరపాటు అంతరిక్షాన్ని శోధించిన మాలిక్.. 2023లో ఒక గ్రహశకలాన్ని గుర్తించాడు. అప్పటి నుంచి దాని పేరు '2023 ఓజీ40'గా కొనసాగుతోంది. అయితే నాసా ఇప్పుడు దీనికి శాశ్వత పేరు పెట్టే అవకాశాన్ని దక్ష్ మాలిక్‌కు కల్పించింది.

అన్నా వర్సిటీ రేప్ కేసు ఎఫ్ఐఆర్ ఎలా లీకైంది?

- బాధ్యుల నుంచి బాధితురాలికి రూ.25 లక్షలు: సుప్రీం

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్నా వర్సిటీ ప్రాంగణంలో జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించిన ఎఫ్ఐఆర్ లీకవ్వడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల పట్ల కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎఫ్ఐఆర్‌లో బాధితురాలి ప్రవర్తనే అత్యాచారానికి కారణమైందంటూ తప్పుడు సమాచారం నమోదు చేయడం సహించరాని విషయమని, ఈ వివరాలు వెల్లడి కావడం వల్ల బాధితురాలినే నేరస్థురాలిగా సామాజిక మాధ్యమాల్లో చిత్రీకరించడం గర్హనీయమని పేర్కొంది. ఈ ఎఫ్ఐఆర్ వివరాలు బహిర్గతం కావడానికి కారకులైన పోలీసు ఉన్నతాధికారుల నుంచి రూ.25 లక్షలు వసూలు చేసి, బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

మనది నమ్మకమైన భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమం, ప్రపంచశాంతి, సౌభాగ్యం, భద్రత కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతిక రంగాలను కేంద్రీకృతం చేసుకొని ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ప్రతిపాదించారు. ప్రపంచ సమస్యలైన ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమ ఆసియా సమస్యలపైనా చర్చలు జరిపారు. త్వరలో భేటీ కావాలని కూడా ఇరువురు నేతలు నిర్ణయించారు. అక్రమ వలసదారుల సమస్యపై మాట్లాడిందీ లేనిదీ వెంటనే తెలియరాలేదు. ట్రంప్ అధికారం చేపట్టిన రోజున అక్రమ వలసదార్లను తిప్పిపంపించి వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అమెరికాకు చాలా మంది భారతీయులు చట్టబద్ధంగానే వలస వెళ్లారు. అయితే కొందరు కెనడా, మెక్సికో సరిహద్దుల మీదుగా అక్రమ మార్గాల ద్వారా వెళ్లడంతో వారికి మాత్రం ముప్పు ఏర్పడింది. దీనిపై ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లిన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ మాట్లాడుతూ భారతీయులు ఎవరైనా అక్రమంగా ఉన్నారని అమెరికా భావిస్తే అలాంటి వారిని తిరిగి తీసుకువెళ్తామని చెప్పారు. సరైన పత్రాలు లేని సుమారు 18వేల మంది భారతీయులను తిప్పి పంపించే అవకాశం ఉండడంతో ఈ సమస్యను ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేదానిపై ఆసక్తి నెలకొంది.

ఉత్తరాఖండ్‌లో అమల్లోకి యూసీసీ

న్యూఢిల్లీ, జనవరి 27: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) విధానం అమలులోకి వచ్చింది. దేశంలోనే యూసీసీని అమలుచేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. యూసీసీ పోర్టల్, నోటిఫికేషన్‌లను ఆ రాష్ట్ర సీఎం పుష్కర్ సింగ్ ధామీ సోమవారం ఆవిష్కరించారు. "యూసీసీ అమలు రాజ్యాంగబద్ధ చర్య. ఇది వివక్షను అంతం చేస్తుంది. నిజమైన అర్థంలో మహిళా సాధికారికత సాకారం కానుంది. నిఖా హలాల్, బహు భార్యత్వం, బాల్య వివాహాలు, ట్రిపుల్ తలాక్ వంటి దుష్ట విధానాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. రాజ్యాంగంలోని 342 అధికరణ కింద రక్షణ పొందుతున్న ఆదివాసీలకు యూసీసీ నుంచి మినహాయింపు ఉంటుంది. యూసీసీ ఏ ఒక్క మతానికీ, తెగకూ వ్యతిరేకం కాదని మళ్లీ స్పష్టం చేస్తున్నాం" అని ధామీ అన్నారు.

18 ఆధ్యాత్మిక క్షేత్రాల్లో రోప్ వేలు

న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలోని 18 ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో రోప్ వే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో శబరిమల లోని అయ్యప్ప ఆలయం కూడా ఉంది. పంబ నుంచి శబరిమల లోని సన్నిధానం వరకు 2.62 కిలోమీటర్ల పొడవున రోప్‌వే నిర్మిస్తారు. అలాగే జమ్మూకశ్మీర్ లోని బాల్తాల్ నుంచి అమర్‌నాథ్ వరకు 11.6 కిలో మీటర్ల మేర రోప్ వే నిర్మిస్తారు. తమిళనాడులోని పర్వాద్ మలై ఆలయం వద్ద 3.21 కిలోమీటర్లు, హిమాచల్ ప్రదేశ్‌లోని చాముండిదేవి క్షేత్రం వద్ద 6.5 కిలోమీటర్ల రోప్‌వే నిర్మిస్తారు. మొత్తం 18 రోప్‌వే ప్రాజెక్టులకు సంబంధించి తగిన డిజైన్లతో రావాలని కేంద్రం కన్సల్టెంట్లను ఆహ్వానించింది.

అక్రమ వలసదారుల కోసం.. గురుద్వారాల్లోనూ తనిఖీలు

న్యూయార్క్, న్యూజెర్సీల్లో అధికారుల వేట.. ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థల మండిపాటు




న్యూయార్క్, జనవరి 27: అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమేస్తున్న అమెరికా.. ఆ వేటలో భాగంగా న్యూయార్క్, న్యూజెర్సీల్లోని గురుద్వారాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. సిక్కు వేర్పాటువాదులు, అక్రమ వలసదారులు, సరైన పత్రాలు లేనివారు ఆ గురుద్వారాలను తమ హబ్‌గా మార్చుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో అమెరికా అంతర్గత భద్రత శాఖ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. నిజానికి.. ప్రార్థనామందిరాలు, పాఠశాలల వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ), కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకుండా బైడెన్ హయాంలో నియంత్రణలు విధించారు. కానీ, ట్రంప్ సర్కారు ఆ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఆయా విభాగాల అధికారులు ప్రార్థనా మందిరాలనూ వదలకుండా సోదాలు చేస్తున్నారు. "ఇకపై నేరగాళ్లు పోలీసులకు దొరక్కుండా ఉండడానికి అమెరికాలోని పాఠశాలలు, చర్చిల్లో దాక్కోలేరు" అని ఆ విభాగం అధికార ప్రతినిధి ఒకరు హెచ్చరించారు. కాగా.. గురుద్వారాల్లోకి అధికారులను పంపిస్తున్న ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థలు మండిపడుతున్నాయి. ఈ తరహా చర్యలు తమ మత విశ్వాసానికి, గురుద్వారాల పవిత్రతకు ముప్పుగా పరిణమిస్తాయని 'సిఖ్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్' ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా గురుద్వారాల్లో సోదాలు చేస్తున్నట్టు తెలిస్తే వచ్చేవారి సంఖ్య తగ్గిపోతుందని, దానివల్ల తమ మతవిశ్వాసాలకు సంబంధించిన ప్రక్రియలను అర్థవంతంగా నిర్వహించుకోలేని పరిస్థితి వస్తుందని ఆగ్రహం వెలిబుచ్చింది.

వాణిజ్య యుద్ధానికి భయపడి..

"మా దేశానికి చెందినవారిని అమెరికా నుంచి అక్రమ వలసదారుల పేరుతో సైనిక విమానాల్లో పంపిస్తారా.." అంటూ అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేసి, రెండు విమానాలను తిరస్కరించిన కొలంబియా దేశం ఒక్కరోజు కూడా గడవక ముందే మాట మార్చింది. అగ్రరాజ్యం తమ దేశంపై వాణిజ్య యుద్ధానికి దిగేందుకు సిద్ధం కావడంతో.. అమెరికా చెప్పినట్టు నడుచుకోవడానికి సిద్ధమైంది. మాస్‌డీపోర్టేషన్‌లో భాగంగా అమెరికా ఆదివారం ఉదయం రెండు సైనిక విమానాల్లో అక్రమ వలసదారులను కొలంబియాకు పంపించింది. ఆ విమానాలు రావడానికి తొలుత అన్ని అనుమతులూ ఇచ్చిన కొలంబియా.. అవి దారిలో ఉండగా ఆ అనుమతులను ఉపసంహరించుకుంది. దీంతో ట్రంప్.. కొలంబియా దిగుమతులపై 25% సుంకాలు విధిస్తామని.. మరో వారంలో ఆ సుంకాలను 50 శాతానికి పెంచేస్తానని హెచ్చరించారు. కొలంబియా నుంచి అమెరికాకు ఎవరూ రాకుండా ప్రయాణ నిషేధాన్ని విధిస్తానన్నారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న కొలంబియన్ ప్రభుత్వ అధికారులు, వారి కుటుంబసభ్యులు, మద్దతుదారుల వీసాలను రద్దు చేస్తానని హెచ్చరించారు. దీంతో, కొలంబియా సర్కారు వెనక్కి తగ్గింది. అమెరికా నుంచి సైనిక విమానాల రాకకు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగ మంత్రి లూయిస్ గిల్బెర్టో అధికారికంగా వెల్లడించారు. దీన్ని ట్రంప్ విజయంగా వైట్‌హౌస్ అభివర్ణించింది.

మహిళలకు ప్రతినెలా రూ. 2,100

- హామీ పత్రంపై కేజ్రీవాల్ సంతకం
- ఢిల్లీ ఓటర్లకు 15 హామీలిచ్చిన ఆప్



న్యూఢిల్లీ, జనవరి 27: "కేజ్రీవాల్ కా గ్యారెంటీ" పేరుతో రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సోమవారం విడుదల చేశారు. "ఆప్ అధికారంలోకి వచ్చిన వెంటనే అరవింద్ కేజ్రీవాల్ అనే నేను నా తల్లులు, సోదరీమణుల కోసం మహిళా సమ్మాన్ రాశి యోజన పథకం ప్రారంభిస్తానని హామీ ఇస్తున్నాను" అని ముద్రించిన గ్యారెంటీ కార్డుపై సంతకం చేశారు. ఆ మ్యానిఫెస్టోలో మహిళలకు నెలానెలా రూ. 2,100 ఆర్థిక సాయం, 24 గంటలూ మంచి నీళ్లు, వృద్ధుల కోసం ఉచిత ఆరోగ్య పథకం, విద్యార్థులకు మెట్రోలో 50 శాతం రాయితీ తదితర 15 ముఖ్యమైన హామీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆరు ఉచిత పథకాలు కూడా కొనసాగిస్తామని కేజ్రీవాల్ చెప్పారు. అర్చకులకు, గురుద్వారా గ్రంథీలకు నెలకు రూ.18 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లు, రిక్షావాలాలకు ఆర్థిక సహాయం చేస్తామని, వారి కుమార్తెల వివాహానికి రూ.లక్ష ఇస్తామని, రూ.10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామన్నారు. ఇప్పటికే తామిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం నెలనెలా రూ.25 వేలు వరకు లబ్ధిపొందుతోందని, ఉచితాలను ఆపేస్తామని బీజేపీ ఇప్పటికే చెప్పినందున ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఇదంతా కోల్పోతారని ఆయన హెచ్చరించారు.

ఢిల్లీకి వచ్చే నీటిలో విషం!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్ సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీకి వచ్చే నీటిలో విషం (అధిక అమ్మోనియా స్థాయి) కలుపుతోందని ఆరోపణలు చేశారు. ఢిల్లీ ప్రజలు బీజేపీకి ఓటేయకుంటే.. వారికి విషం కలిపిన నీరు ఇచ్చి చంపుతారా? అని ప్రశ్నించారు. 'ఈ కలుషిత నీరు ఇక్కడి తాగు నీటిలో కలిస్తే.. ఎంత మంది ఢిల్లీ ప్రజలు చనిపోయారో చెప్పలేం! ఒక సామూహిక నరమేధం అయ్యేది!!' అని వ్యాఖ్యానించారు.

మళ్లీ కైలాశ్, మానస సరోవర్ యాత్రలు

భారత్-చైనా మధ్య నేరుగా నడిచే విమాన సర్వీసుల పునరుద్ధరణ కూడా

న్యూఢిల్లీ, జనవరి 27: భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల విషయంలో సోమవారం మరో ముందడుగు పడింది. రానున్న వేసవిలో కైలాశ్, మానస సరోవర్ యాత్రలను పునరుద్ధరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. టిబెట్‌లో ఉన్న ఈ పవిత్ర క్షేత్రాల సందర్శన కరోనా కారణంగా 2020 నుంచి నిలిచిపోయాయి. అనంతరం గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో ఒప్పందాలను పునరుద్ధరించుకోలేదు. తాజాగా రెండు రోజుల పర్యటన నిమిత్తం చైనా వెళ్లిన భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ బీజింగ్‌లో చైనా ఉప విదేశాంగ మంత్రితో జరిపిన చర్చల్లో ఈ విషయమై అంగీకారం కుదిరింది. మరోవైపు, రెండు దేశాల మధ్య నేరుగా తిరిగే విమాన సర్వీసులను కూడా పునరుద్ధరించాలని ఇరు దేశాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించేందుకు రెండు దేశాల అధికారులు త్వరలోనే భేటీ కానున్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..
ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

» సంగారెడ్డి జిల్లా పల్వనూర్‌లో ఘటన.. నిందితుల అరెస్టు


నారాయణ(ఫైల్)

హత్నూర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. కట్టుకున్న భర్తను కడతేర్చిందో భార్య. ప్రియుడు, అతని మిత్రులతో కలిసి గొంతు కోసి, కర్రతో తలపై బాది కిరాతకంగా చంపేసింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్వనూర్‌లో ఈ నెల 24న ఈ ఘటన జరిగింది. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం మల్లుపల్లికి చెందిన మాలే నారాయణ (45) స్వగ్రామం లో భార్య, పిల్లలను వదిలి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం రెడ్డిఖానాపూర్‌లో ఓ వ్యవసాయ అనుబంధ సంస్థలో పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి నారాయణ భార్య అతనుండే చోటుకే వచ్చి ఉంటోంది. భార్యకు మరో వ్యక్తితో వివాహేతర బంధం ఉన్న విషయం తెలుసుకున్న నారాయణ ఆమెను నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని భావించిన ఆమె పథకం ప్రకారం ఈ నెల 24న పల్వనూర్ గ్రామ శివారుకు భర్త నారాయణను తీసుకెళ్లింది. అక్కడ కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రియుడితో పాటు అతని మిత్రులతో కలిసి భర్తను ముళ్ల పొదల్లోకి లాక్కెళ్లి గొంతు కోసి, కర్రతో బాది దారుణంగా హత్య చేసింది. మరుసటి రోజు తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానంతో ఆమెను తమదైన శైలిలో విచారించగా విషయం బయటపడింది. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఫీజులు మేమే చెల్లిస్తున్నాం

» సీసీఎల్‌ఏ కేసుల్లో అధికారుల ఆవేదన

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో భూ పరిపాలనా ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల సర్వీసు, ఇతర కేసులకు సంబంధించిన కోర్టు ఖర్చులు ప్రభుత్వం నుంచి అందకపోవడంతో తమ జేబు నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. సీసీఎల్‌ఏలో ఒక్కో విభాగానికి వారానికి కనీసం నాలుగు కేసులు పడుతున్నాయని, కౌంటర్ ఫైల్ చేయడానికి రూ.2 వేల నుంచి రూ.3వేల వరకు, కోర్టు ధిక్కరణ కేసుల్లో రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఫీజు చెల్లిస్తేనే వకాలత్ ఫైల్ చేస్తారని, లేదంటే వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసులు వస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి బడ్జెట్ లేకపోయినా సొంత డబ్బుతోనే కోర్టు కేసులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేటలో యువకుడి పరువు హత్య..?

రాయితో తలపై మోది దారుణంగా ఖూనీ.. తమ అమ్మాయిని ప్రేమించి, కులాంతర పెళ్లి చేసుకున్నాడని యువతి కుటుంబం కోపం

» వివాహమైన ఆరు నెలలకే విషాదం


భార్గవితో వడకోండ్ల కృష్ణ (ఫైల్)

సూర్యాపేట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి సమీపంలో ఓ యువకుడు దారుణంగా హతమయ్యాడు. ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నందుకు యువతి కుటుంబ సభ్యు లే ఇలా చేశారని మృతుడి తండ్రి ఆరోపిస్తున్నారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన వడకోండ్ల కృష్ణ అలియాస్ మాల బంటి(32) కుటుంబం కొన్నేళ్ల క్రితం సూర్యాపేటలోని బాషా నాయక్ తండాకు వలస వచ్చిం ది. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన కోట్ల నవీన్, బంటి ప్రాణ స్నేహితులు. నవీన్ ఇంటికి బంటి తర చూ వస్తుండేవాడు. ఈ క్రమంలో నవీన్ చెల్లెలు భార్గవితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. బంటి ఎస్సీ మాల, భార్గవి బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. ప్రేమ విషయం తెలియడంతో బంటిపై నవీన్ కుటుంబ సభ్యులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు భార్గవికి కౌన్సెలింగ్ చేసినా ఆమె వినలేదు. ఆరు నెలల క్రితం భార్గవిని బంటి పెళ్లి చేసుకుని సూర్యాపేటలోని మామిళ్లగడ్డలో కాపురం పెట్టాడు. దీంతో బంటిపై నవీన్, అతడి కుటుంబ సభ్యులు కోపం పెంచుకున్నారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న బంటిని నవీన్, తన బంధువైన సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డకు చెందిన మహేశ్‌తో ఫోన్ చేయించి పిలిపించాడు. తాను బయటకు వెళ్లి వస్తానని భార్య భార్గవితో చెప్పిన బంటి.. తన ఫోన్‌ను ఆమెకు ఇచ్చి వెళ్లాడు. రాత్రి 11 గంటలు దాటినా భర్త ఇంటికి రాకపోవడంతో భార్గవి మహేశ్‌కు ఫోన్ చేసింది. అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో.. భర్త వస్తాడనుకుని ఆమె నిద్ర పోయింది.

మూసీ కాల్వ వద్ద మృతదేహమై..

పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వ వద్ద మృతదేహం ఉందని స్థానికులు సోమవారం ఉదయం పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతుడిని బంటిగా గుర్తించారు. తలపై రాయితో మోదటంతో చనిపోయినట్లు నిర్ధారించారు. తన కుమారుడిని నవీన్ చంపాడని అనుమానం ఉందని బంటి తం డ్రి డేవిడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకున్నందుకు తన భర్తను కుటుంబ సభ్యు లే చంపారని భార్గవి విలపించింది. నవీన్, మహేశ్ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ రవి తెలిపారు. బంటి, నవీన్‌పై రెండు హత్యాయత్నం కేసులు, కొట్లాట కేసులున్నాయి. మహేశ్‌పై రెండు హత్యాయ త్నం, గొడవ కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉంది. ముగ్గురూ రియల్ ఎస్టేట్ చేస్తుంటారు.

మంత్రి సీతక్క కారు పాస్ ఫోర్జరీ

» కరీంనగర్‌కు చెందిన వ్యక్తి కారుపై గుర్తింపు

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



కారు అద్దంపై అంటించిన స్టిక్కర్, కారులోపల బీజేపీ కండువా

ములుగు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కకు ప్రభుత్వం జారీచేసిన కారు పాస్ ఫోర్జరీ అయింది. సీతక్క పేరిట అసెంబ్లీ సెక్రటరీ జారీచేసిన పాస్‌ను కరీంనగర్ జిల్లా చింతకుంటకు చెందిన దాసరి రవి టీఎస్-02 ఈబీ 8239 నెంబర్‌గల కారుకు అంటించుకొని తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు గుర్తించారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ తదితరులు ములుగు ఎస్పై వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఫొటోలు, ఇతర ఆధారాలు అందజేశారు. కారు లోపల బీజేపీ కండువా కనిపించిందని పోలీసులకు తెలిపారు.

స్నేహితుడి మరణాన్ని తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

» పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఘటన


శ్రీనాధీశ్వర్(ఫైల్)

కోల్‌సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణ స్నేహితుడి మరణాన్ని తట్టుకోలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగింది. గోదావరిఖనికి చెందిన శ్రీనాధీశ్వర్ (18)ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తనతో పాటు అదే కళాశాలలో చదువుతున్న అతని ప్రాణ స్నేహితుడు ముక్క రోహక్ తల్లి మందలించిందని గత నెల 29న ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి స్నేహితుడిని తలుచుకుంటూ దిగాలుగా ఉన్న శ్రీనాధీశ్వర్ ఆదివారం రోహక్ నెల మాసికానికి వెళ్లొచ్చిన అనంతరం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉదయనిధికి సుప్రీంకోర్టులో ఊరట

» 'సనాతనం'పై ఆయన చేసిన వ్యాఖ్యలపై విచారణకు నిరాకరణ

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ దాఖలైన మూడు పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వాటికి విచారణార్హత లేదని పేర్కొంటూ కొట్టివేసింది. అయితే పిటిషనర్లు చట్టప్రకారం ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకునేందుకు వీలు కల్పించింది. ఈ మేరకు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 సెప్టెంబరులో డెంగ్యూ, మలేరియా తరహాలోనే సనాతనాన్ని కూడా నిర్మూలించాలంటూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. పలు హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సనాతనంలోని కులతత్వాన్ని మాత్రమే తాను వ్యతిరేకించానంటూ ఉదయనిధి వివరణ ఇచ్చినా వివాదం సమసిపోలేదు. ఈ నేపథ్యంలో తమ మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యానించిన ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ ఉత్తరప్రదేశ్, బీహార్, జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో సుప్రీంకోర్టులోనూ మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని సుప్రీంకోర్టు తిరస్కరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రమాదాలు-పాఠాలు

రైలు మండిపోతోందన్న వదంతి కారణంగా ఇటీవల పన్నెండు మంది ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైనది. లఖ్‌నవూ–ముంబై పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు రేగాయని, వ్యాపిస్తున్నాయని ఓ గాలి వార్త ప్రచారంలోకి రావడంతో అందులో ప్రయాణిస్తున్నవారంతా తీవ్ర భయాందోళనలకు గురైనారు. మంటలు తమవరకూ వస్తాయని భయపడిన ప్రయణీకులు అలారం చెయిన్ లాగి రైలును నిలిపివేసి హడావుడిగా దిగిపోయారు. ఈ క్రమంలో వారు పక్కన ఉన్న మరో ట్రాకుమీదకు చేరడం వారి పాలిట శాపమైంది. ఆ ట్రాక్‌మీద గంటకు నూటనలభై కిలోమీటర్ల వేగంతో వచ్చిన బెంగుళూరు–న్యూఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వారిని ఢీకొనడంతో దేహాలన్నీ నుజ్జునుజ్జయినాయి. అగ్నిప్రమాదం నుంచి తమను తాము రక్షించుకున్నామని అనుకున్నవారు ఇలా క్షణాల్లో మరో విధంగా ప్రాణాలు కోల్పోవలసి రావడం విచిత్రం. అది మలుపు ప్రాంతం కావడంతో జనం ట్రాకులమీద ఉన్న విషయం కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ ముందుగా గుర్తించలేకపోయాడని, గమనించిన వెంటనే బ్రేకులు అదిమినా ఈ ఘోరం జరిగిపోయిందని అంటారు. బ్రేకులు వేయనిపక్షంలో ప్రమాద తీవ్రత మరింత హెచ్చుగా ఉండేదన్నది నిజం. చెయిన్‌లాగడంతో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ ఆగిందన్న విషయాన్ని ఎదురుగా వస్తున్న రైళ్ళకు తెలిసేలా ఫ్లాష్‌లైట్ కూడా వేశారట. అయితే, ఈ మొత్తం గందరగోళానికీ, ఘోరానికీ మూల కారణం పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు రేగాయన్న దుష్ప్రచారం. బాధ్యులు ఎవ్వరో దర్యాప్తులో తేలవచ్చును కానీ, వదంతి పూర్తిగా నిరాధారమైనదైతే కాదు. జనరల్ కంపార్ట్‌మెంట్ బ్రేకులు సరిగా లేకపోవడంతో ఆరంభంనుంచి ప్రయాణీకులు ఆందోళనచెందుతూనే ఉన్నారు. బ్రేకులు పడినప్పుడల్లా అవి చక్రాలను గట్టిగాపట్టుకొని మళ్ళీవదలకపోవడం, విపరీతంగా వేడెక్కి నిప్పులు వెదజల్లడం, పొగలు, కాలినవాసన రావడం వంటివి ప్రయాణీకులను భయపెట్టినమాట నిజం.

మృతులకు, బాధితులకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం ప్రకటించాయి, గాయపడినవారికి వైద్యచికిత్స కూడా అందుతోంది. ఖరీదైన రైళ్ళకు ఉండే ఆటోమేటిక్ డోర్లు ఇటువంటి సాదాసీదా రైళ్ళకు ఉండవు కనుక గ్రామీణ ప్రయాణీకులు చెయిన్ లాగి దిగిపోవడం వంటి ప్రమాదకర విన్యాసాలు కూడా సులువుగా చేయగలుగుతున్నారు. రైలు ఆగిన తరువాతే డోర్లు లాక్ తెరుచుకోగలిగే వ్యవస్థ జనరల్ రైళ్ళకు కూడా ఉంటే, భారతదేశంలో తరచుగా సంభవించే ఈ తరహా ప్రమాదాలను నివారించవచ్చు. తాము ప్రయాణిస్తున్న రైళ్ళు భద్రంగా ఉన్నాయన్న నమ్మకం ఈ దేశ ప్రజల్లో ఇప్పటికీ ఏర్పడినట్టు లేదు. క్షేమంగా ఇంటికి చేరతామన్న భరోసా కానీ, ఎక్కిన రైలుమీద నమ్మకంకానీ లేకపోవడంతో వదంతులు అగ్గిరాజేస్తున్నాయి. ఎవరో పూలమ్ముకొనే ఓ కుర్రాడు అరిచిన అరుపును తప్పుగా అర్థంచేసుకున్నందువల్ల 2017లో ముంబై ఎల్ఫిన్‌స్టోన్ బ్రిడ్జి ప్రమాదం జరిగి, పాతికమంది ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని అంటారు. రైలుప్రమాదాలు వరుసగా జరుగుతూ అవే వార్తలు వింటూ ప్రజల్లో ఒక రకమైన భయం ఆవహించివున్న నేపథ్యం కూడా తాము స్వయంగా ప్రయాణిస్తున్న సందర్భాల్లో తప్పటడుగులకు దారితీస్తుంది. చాలా రైలు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణమని అధికారులు తేల్చేయడం జరుగుతున్నప్పటికీ, నిర్వహణ లోపం కూడా అందుకు దోహదపడుతున్న మాట నిజం. ఈ రైలులో బ్రేకింగ్ వ్యవస్థ నిర్వహణ అధమంగా ఉండటంతో విపరీతమైన శబ్దాలతో, చక్రాలు ఊగుతూ, నిప్పులు చిమ్ముతూ ప్రయాణీకులు భయభ్రాంతులు కావడం అంతిమంగా ఈ ప్రమాదానికి దారితీసింది. వదంతిని నమ్మినందుకు ప్రయాణీకులను తప్పుబట్టి, ఈ ఘోరానికి దారితీసిన మిగతా అంశాలను వెనక్కునెట్టేయడం సరికాదు. రైల్లో ఉన్న ప్రతీ ప్రయాణీకుడినీ భద్రంగా ఒడ్డుకు చేర్చాల్సిన బాధ్యత రైల్వేశాఖమీద ఉంది. ఎనౌన్స్‌మెంట్ వ్యవస్థ గనుక ఈ రైలులో ఉండివుంటే, అగ్గిఅంటుకుందన్న వదంతి మరింత వ్యాపించకుండా ఆపగలిగేవారేమో. దేశంలో ఇటీవల వరుసగా జరుగుతున్న రైలు దుర్ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతీ ప్రమాదం నుంచి పాఠాలు నేర్చుకోవాలి, పరిష్కారాలు అన్వేషించాలి.

జనాభావృద్ధితో రాజకీయ అంతరాలు

సంతానం లేకపోతే వంశం అంతరించి పోతుందని గతంలో కొందరు ఆందోళన చెందేవారు. సంతానోత్పత్తి ఆగిపోతే దేశాలే అంతరించి పోతాయనే ఆందోళన ఇటీవల వినిపిస్తోంది. సంతానోత్పత్తి లేమితో అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న దేశాల్లో దక్షిణ కొరియా ముందు పీఠిన ఉంది. ఆ తరువాత తైవాన్, జపాన్, ఇటలీ, స్పెయిన్ దేశాలున్నాయి. ప్రపంచంలో మరెన్నో దేశాలకూ ఇలాంటి ముప్పు పొంచి ఉందని జనాభా శాస్త్రవేత్తలు గణాంకాలు తీసి హెచ్చరిస్తున్నారు.

జనాభా పెరుగుదల మీద మనలో అనేక తప్పుడు అభిప్రాయాలు కొనసాగుతున్నాయి. వీటికి పునాది థామస్ రాబర్ట్ మాల్థూస్ 1798లో 'జనాభా సూత్రం' అనే శీర్షికతో రాసిన ఒక వ్యాసం. మాల్థూస్‌ను జనాభా శాస్త్రవేత్తగా, ఆర్థికవేత్తగా పేర్కొంటారు గానీ ఆయన ప్రధానంగా మతగురువు. కొన్ని లక్షల మంది చనిపోయే విపత్తులు ఎందుకు సంభవిస్తున్నాయని అడిగే సందేహపరులను ధార్మికంగా సమాధానపరచడానికి ఆయనొక సిద్ధాంతాన్ని కనిపెట్టారు. ఆహారోత్పత్తి నిదానంగానూ, జనాభా వేగంగానూ పెరుగుతాయనేది ఆ సిద్ధాంత సారం అని అర్థశాస్త్రం విద్యార్థులు తొలి పాఠాల్లోనే చదివి ఉంటారు. భూమికి ఉన్న ఆహారోత్పత్తి సామర్థ్యం కన్నా మనుషుల సంతానోత్పత్తి సామర్థ్యం పెరిగిపోయినపుడు ఏర్పడే 'అదనపు జనాభా'ను తొలగించడానికి విపత్తులు సంభవిస్తాయి అన్నాడాయన. దీనినే మాల్థూస్ మహావిపత్తు సిద్ధాంతం అంటారు.

మాల్థూస్ ఈ సూత్రీకరణ చేసే నాటికే ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం పుంజుకుంటోంది. ఆ పరిణామాల్ని ఆయన పట్టించుకోలేదు. కమ్యూనిస్టు సిద్ధాంతకర్త లయిన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ మాత్రమేగాక, పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించిన ఉపయోగితా వాదులు, ఫలితవాదులు అయిన జాన్ స్టూవర్ట్ మిల్, విలియం గాడ్విన్ వంటి వారు సహితం మాల్థూస్ సిద్ధాంతాన్ని గట్టిగానే విమర్శించారు. కొన్ని వాస్తవాలను గమనించి మాల్థూస్ ఒక తర్కాన్ని రూపొందించాడు. కానీ, అవి సంపూర్ణ వాస్తవాలు కావని కొందరు తప్పు పట్టారు. మనిషికి జ్ఞానం, విజ్ఞానం రెండూ ఉంటాయి. జ్ఞానంతో సంతానోత్పత్తిని అదుపు చేసుకోగలడు; విజ్ఞానంతో ఆహారోత్పత్తిని పెంచగలడు అన్నవారూ ఉన్నారు. అవసరం ఆవిష్కరణకు తల్లి వంటిది కనుక, ఆహార అవసరాల్ని కొత్త ఆవిష్కరణలతో మనిషి అధిగమిస్తాడని ఆశాభావాన్ని వ్యక్తం చేసినవారున్నారు. మానవజాతికి ఉన్న ఉత్పాదకశక్తి అపారమైనది. అవసరాన్ని బట్టి అది విజృంభిస్తుందన్నాడు ఏంగిల్స్. సమస్య, ఆహారోత్పత్తి జరక్కపోవడం కాదు; ఉత్పత్తి అయిన ఆహారాన్ని సమంగా పంపిణీ చేయకపోవడం అన్నాడు మార్క్స్. ఆయన అంతటితో ఆగలేదు. సంపద ఒకచోట పోగుపడడానికి మిగులు జనాభా ఒక అవసరమైన ఉత్పత్తి అవుతుందన్నాడు.



> ఇప్పటికే లోక్‌సభలో ఉత్తర భారతావని ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. రేపు నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరిగితే ఉత్తరాది రాష్ట్రాల్లో మరిన్ని ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పడతాయి. అప్పుడు దక్షిణాది ఓటర్ల మనోభావాలకు పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఉండదు.

145 కోట్ల జనాభా అనేది ప్రపంచంలోనే అతి పెద్దది కావచ్చుగాక, మనందరికీ మూడు పూటలా తిండి పెట్టగల సామర్థ్యమున్న భూమి మనది. మన దేశంలో నిర్వహణ లోపం కారణంగా ఉత్పత్తి అయిన ఆహారధాన్యాల్లో 25 నుంచి 30 శాతం వృథా అయిపోతున్నాయి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తిలో 50 శాతం కుళ్లిపోతున్నాయి. మన దేశం నుంచి ఆహారధాన్యాలు ఎన్ని లక్షల టన్నులు అక్రమంగా రవాణా అవుతున్నాయో ఇటీవల కొన్ని కేసులు బయటపడి కళ్ళు తెరిపించాయి. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఆఫ్రికాకు బియ్యాన్ని దొంగరవాణా చేస్తున్న ఓడను అడ్డుకోవడం వాటిల్లో ఒకటి మాత్రమే. ఇంతటి అదనపు ఆహారోత్పత్తి ఉన్నప్పటికీ ప్రపంచంలో పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్న ప్రజలు భారత దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ నివేదికలు చెపుతున్నాయంటే లోపం ఎవరిదీ? పంటలదా? పంపిణీలదా?

నిల్వ ఉంచడానికి తగిన గిడ్డంగులు లేక దేశమంతటా ఆహారధాన్యాలు ముక్కిపోతున్నాయని 2010లో అనేక వార్తలు వచ్చాయి. వాటి మీద స్పందించిన సుప్రీంకోర్టు ఆ ఏడాది ఆగస్టు 12న ఆ ఆహారధాన్యాలను అవసరమైన వారికి ఉచితంగా పంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఆగస్టు 19న కోర్టు ముందు హాజరైన అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్, ప్రభుత్వం అనేక పథకాల ద్వారా పేదలకు సబ్సిడీ ధరకు ఆహారధాన్యాలను పంపిణీ చేస్తున్నదని విన్నవించుకున్నారు. దానితో సంతృప్తి చెందని కోర్టు ఆగస్టు 12 నాటి ఆదేశాలను పాటించి తీరాలని స్పష్టం చేసింది.

జనాభాను నియంత్రించాలని ఐక్యరాజ్యసమితి 1968 మే 13 నాటి టెహ్రాన్ ప్రకటనలో తొలిసారిగా పేర్కొంది. అంతకు 16 ఏళ్ల ముందే 1952లో భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పథకాన్ని రూపొందించింది. ఏ కొత్త పథకానికి అయినా సరే మతం రంగు పులిమేయడానికి కొందరు సిద్ధంగా ఉంటారు. వాళ్ళు మనదేశానికి ప్రత్యేకం కావచ్చు. 'మనం ఇద్దరం; మనకు ఇద్దరు' అనే నినాదాన్ని వాళ్లు 'హమ్ పాంచ్, హమారే పచ్చీస్'గా మార్చి ముస్లిం విద్వేషాన్ని ప్రచారం చేశారు. మాల్థూస్ మాటల్ని దేశంలో హిందూ జనాభా నిదానంగానూ, ముస్లిం జనాభా వేగంగానూ పెరుగుతున్నాయన్నట్లు మార్చారు. సమీప భవిష్యత్తులో భారతదేశం ముస్లిం దేశంగా మారిపోతుందని భయపెట్టారు. ఈ పని చేసింది చిన్నాచితక వాళ్ళు కాదు. సాక్షాత్తు దేశాధినేతలు అయినవారే ఈ రకం ప్రచారానికి సారథ్యం వహించారు.

ప్రపంచ గణాంకాల ప్రకారం జనాభాలో సగటున రెండు శాతం మంది ప్రతి ఏటా చనిపోతారు. ఆ లోటును భర్తీ చేయడానికి కనీసం 2.1 శాతం పిల్లలు ప్రతి ఏటా పుట్టాలి. అలా జరక్కపోతే ఏ దేశంలో అయినా సరే అనేక అనర్థాలు జరిగిపోతాయి. ఉత్పత్తి విరమణ చేసిన వృద్ధుల శాతం పెరిగిపోతుంది; ఉత్పత్తి చేయడానికి రంగప్రవేశం చేయాల్సిన కొత్త తరం పుటుక తగ్గిపోతుంది. దేశ జనాభా పెరుగుదలను స్త్రీల స్థూల సంతానోత్పత్తి సామర్థ్యంతో అంచనా వేస్తారు. స్త్రీలు జీవితకాలంలో సగటున ఎంతమందికి జన్మనిస్తున్నారు అనేది కొలమానం. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఈ నివేదికల్ని రూపొందిస్తుంటుంది. ఈ సంస్థ 2019–21లలో నిర్వహించిన సర్వేల్లో భారత సగటు టిఎఫ్ఆర్ 2 అని తేల్చింది. అంటే కనీస స్థాయి కన్నా తక్కువగా ఉందని అర్థం. ఇందులో హిందూ స్త్రీల టిఎఫ్ఆర్ 1.94 ఉండగా, ముస్లిం స్త్రీల సామర్థ్యం 2.36 ఉందని తేల్చారు. క్రైస్తవ, బౌద్ధ, జైన స్త్రీల టిఎఫ్ఆర్ వరుసగా 1.88, 1.61, 1.39 ఉందట.

ఆర్థిక స్తోమతకు సంతానోత్పత్తికి విలోమ నిష్పత్తి ఉంటుందని గణాంకాలు చెపుతున్నాయి. సాధారణంగా మధ్యతరగతి ఆపైన ఉండే ఆర్థిక సమూహాలు ప్రణాళికబద్ధ కుటుంబాలను రూపొందించుకుంటాయి. పేద వర్గాలకు అలాంటి ఆలోచనలు ఉండవు. ఆ సమూహాల్లో సంతానోత్పత్తి అధికంగా ఉంటుంది. ప్రపంచంలో అత్యంత పేద దేశం అయిన సోమాలియలో టిఎఫ్ఆర్ 6.12. ఇది ప్రపంచంలోనే అత్యధికం. విచిత్రం ఏమంటే ముస్లిం ఛాందస దేశాలనిపించే ఇరాన్, సౌదీ అరేబియాల్లో టిఎఫ్ఆర్ 2, 2.31 మాత్రమే ఉంది.

లాభాల వేటలో పడిన పెట్టుబడిదారులు నిరంతరం అధికోత్పత్తిని చేసే యంత్రాలను ప్రవేశపెడుతుంటారు. ఆ కొత్త యంత్రాలు తమను సృష్టించిన కార్మికుల్నే స్థానభ్రంశానికి గురిచేస్తాయి. అప్పటి వరకు ఉపాధి గలవారు మరునాడు నిరుద్యోగులుగా మారిపోతారు. ఈ పాపం పెట్టుబడిదారుల అత్యాశది. కానీ వాళ్ళు దాన్ని ఒప్పుకోరు. జనాభా పెరిగిపోతున్నదని రోడ్డెక్కి గావుకేకలు పెడతారు. బయట నిరుద్యోగుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే అంత చవకగా వాళ్ళకు శ్రామికులు రిజర్వు సైన్యంగా అందుబాటులో ఉంటారు. ఇదొక పెద్ద వలయం. పేదరికాన్ని సృష్టించే వారే పేదల్ని విమర్శిస్తుంటారు.

దేశంలో ముస్లిం పురుషులు తలా పాతిక మంది పిల్లల్ని కంటున్నారనడం ఒక అభూత కల్పన. టిఎఫ్ఆర్‌లో 1.94–2.36ల మధ్య ఉన్న ఆ కొద్దిపాటి అధిక్యత కూడా భారత ముస్లిం సమాజపు పేదరికాన్ని సూచిస్తోంది. టిఎఫ్ఆర్ తేడాలు ప్రాంతీయ విబేధాలను కూడా సృష్టిస్తాయి. దక్షిణాదివారు కుటుంబ నియంత్రణను పాటించినట్టు ఉత్తరాదివారు పాటించలేదు. దక్షిణాదికి చెందిన తమిళనాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో టిఎఫ్ఆర్ 1.7గానూ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 1.8గానూ ఉంది. మరోవైపు, ఉత్తరాదికి చెందిన బిహార్‌లో 2.9గానూ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా 2.4, 2.3, 2.2గానూ ఉంది. దీనర్థం ఏమంటే, దక్షిణాది జనాభా నిదానంగా పెరుగుతుంటే, ఉత్తరాది జనాభా వేగంగా పెరుగుతోంది. ఇప్పటికే లోక్‌సభలో ఉత్తరాది ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. రేపు నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరిగితే ఉత్తరాది రాష్ట్రాల్లో మరిన్ని ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పడతాయి. అప్పుడు దక్షిణాది ఓటర్ల మనోభావాలకు పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఉండదు.

కుటుంబ నియంత్రణను చైనా చాలాకాలం బలవంతంగా అమలు చేసింది. 2022లో సగటు టిఎఫ్ఆర్ 1.18కు పడిపోవడంతో చైనా పాలకులు బెంబెలెత్తిపోయారు. ఇప్పుడు ఎక్కువమంది పిల్లల్ని కనండి అని బతిమాలుతున్నారు. ఆ పరిస్థితి రాకముందే మనం కళ్ళు తెరవాలి.

■ డానీ
సమాజ విశ్లేషకులు

డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త ఆంక్షలు, సుంకాలకు ప్రతిస్పందనగా కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో చేసిన ఆగ్రహ ప్రకటన ఇది.

కొలంబియా ధిక్కారం

ట్రంప్,

అమెరికా రావడం నాకేమంత సంతోషాన్నిచ్చే విషయంకాదు. నిజానికి, కొంత విసుగు కూడా వస్తుంది. అయితే, కొన్ని నచ్చిన విషయాలు కూడా లేకపోలేదు. వాషింగ్టన్ నగరంలో నల్లజాతి ప్రజలు నివసించే ప్రాంతాలని సందర్శించడం నాకు అక్కడ ఇష్టం. అమెరికా రాజధాని నగరంలో బారికేడ్లతో నల్లజాతి ప్రజలు, లాటినో ప్రజల మధ్య ఘర్షణని నేను చూశాను. వారూ వీరూ ఏకం కావాల్సి ఉంది కాబట్టి, ఆ ఘర్షణ అర్థంలేనిది.

కవి వాల్ట్ విట్మన్, వాగ్గేయకారుడు పాల్ సైమన్, మేధావి నోమ్ చామ్‌స్కీ, నవలా రచయిత హెన్రీ మిల్లర్ అభిమానిని నేను. నా రక్త సంబంధీకులైన శాకో, వాంజెట్టిలు అమెరికా చరిత్రలో చిరస్మరణీయులు. వాళ్ళ వారసత్వాన్ని నేను అనుసరిస్తాను. కార్మిక నాయకులు అయినందుకు వాళ్ళని అమెరికాలోని ఫాసిస్టులు మరణశిక్ష విధించి చంపేశారు. అలాంటి ఫాసిస్టులే మా దేశంలోనూ ఉన్నారు.

ట్రంప్, మీ దేశపు చమురు అంటే నాకు అసహ్యం. అది దురాశతో మానవాళికి చేటు కలిగిస్తుంది. నాకు జీర్ణాశయవ్యాధి ఉంది గనక తాగకూడదు. అయినా, ఏదో ఒకరోజు విస్కీ తాగుతూ, మనం దీని గురించి సూటిగా మాట్లాడుకోవచ్చు. అయినా, అది సాధ్యం కాదేమో. మీరు కొలంబియన్లని హీనజాతికి చెందినవాళ్ళని అనుకుంటూ ఉంటారు. మేము హీనులం కాదు. కొలంబియన్లు ఎవరూ హీనజాతీయులు కాదు.

మీరు ఒక మొండి ఘటం కోసం చూస్తుంటే, ఆ వ్యక్తిని నేనే. ఇందులో వేరే మాట లేదు. మీ ఆర్థిక బలిమితోటి, మీ దురహంకారంతోనూ అల్లెండీ ప్రభుత్వాన్ని కూల్చినట్లు, నా ప్రభుత్వాన్ని కూడా కూల్చే కుట్రకి తెరదీయవచ్చు. కానీ, నేను నా విశ్వాసాలకి దృఢంగా కట్టుబడతాను. నేను చిత్రహింసలని ప్రతిఘటించాను. మిమ్మల్ని కూడా ఎదిరిస్తాను. మేము చాలామందిని భరించాం, మా స్వేచ్ఛని సాధించుకున్నాం. కొలంబియాలో స్వేచ్ఛాప్రియులు ఉండాలని నేను కోరుకుంటాను. మీరు కలిసిరాకపోతే, నేను ఇతర దేశాలవైపు చూస్తాను. కొలంబియా ప్రపంచం మధ్యలో ఉంది. ఇది పసుపుపచ్చ సీతాకోకచిలుకల దేశం, ఔరెలియానో బెండియా వంటి సేనానాయకుల దేశం. ఆ పరంపరకు చెందివాడినే నేను. బహుశా ఆఖరువాడినేమో.



ట్రంప్, మీరు కొలంబియన్లని ఒక హీనజాతికి చెందినవాళ్ళని అనుకుంటూ ఉంటారు. మేము హీనులం కాదు. నేను ధిక్కార పతాకాన్ని ఎగరవేస్తున్నాను. నేను ఒంటరిగానే నిలబడినా, మా పూర్వీకుడు గైటాన్ చెప్పినట్లు ఈ జెండా లాటిన్ అమెరికన్ ఆత్మగౌరవంతో తలెత్తుకుని సగర్వంగా నిలబడుతుంది. అమెరికా దేశాధిపతీ, మీ పూర్వీకులు అమెరికాకి వలస వచ్చిన మనుషులు. మీ దిగ్బంధం మమ్మల్ని భయపెట్టబోదు.

మీరు నన్ను హత్య చేయవచ్చు. కానీ, నేను నా జనంలో జీవించి ఉంటాను. మేము అమెరికా దేశాలలో మీకంటే ముందునుంచే జీవిస్తూ ఉండిన జనాలం. గాలీ, పర్వతాలూ, కరీబియన్ సముద్రమూ, స్వేచ్ఛా కలగలిసి ఊపిరిపోసుకున్న ప్రజలం మేము. మీకు మా స్వేచ్ఛ అంటే నచ్చదు. సరే. నేను శ్వేతజాతికి చెందిన బానిస యజమానులతో కరచాలనం చేయబోను. శ్వేతజాతికి చెందిన స్వేచ్ఛాప్రియులతోటీ, అబ్రహాం లింకన్ వారసులతోటీ, అమెరికాలోని నల్ల రైతులు, శ్వేతజాతి రైతులతోటీ చేయి కలుపుతాను. కోవిడ్ నుంచి బతికి బట్టకట్టాక, ఇటలీ టుస్కనీ పర్వతాల అవతల యుద్ధరంగాన్ని చేరుకున్న తర్వాత వాళ్ళ సమాధుల దగ్గర నేను కన్నీరు కార్చాను, ప్రార్థనలు చేశాను. అమెరికా అంటే, నా దృష్టిలో వాళ్ళు మాత్రమే. వాళ్ళకే నేను తల వంచుతాను. మరెవ్వరికీ కాదు. దేశాధిపతీ, నన్ను పడగొట్టు. అమెరికా దేశాల ప్రజలూ, మానవాళీ స్పందిస్తారు.

కొలంబియా ఇక ఉత్తర దిశవైపు చూడదు. ప్రపంచం వైపు చూస్తుంది. కొర్డోబా ఖలీఫా నాగరికతలో మా మూలాలు ఉన్నాయి. రిపబ్లిక్‌ని ఏర్పాటుచేసిన మధ్యధరా ప్రాంత రోమన్ లాటిన్ జనాలలోనూ, ప్రజాస్వామ్యాన్ని స్థాపించిన ఏథెన్స్ జనాలలోనూ మా మూలాలు ఉన్నాయి. మీరు ఇక్కడికి బానిసలుగా కొనితెచ్చిన నల్ల జాతీయుల ప్రతిఘటనా స్ఫూర్తి మా రక్తంలో ప్రవహిస్తుంది. వాషింగ్టన్ నగరం నిర్మాణమయినదానికంటే ముందే, అమెరికా దేశాలన్నిటిలో స్వేచ్ఛాయుతంగా పరిఢవిల్లిన ప్రాంతం కొలంబియా. అక్కడ, ఆ నల్లజాతి ప్రజల ఆఫ్రికా గీతాలలో నేను సేదదీరుతూ ఉంటాను.

ఈజిప్షియన్ ఫారోల కాలంలోనే హస్తకళలు వికసించి, చిరిబికెట్ తొలి చిత్రకారులు నడయాడిన నేల మాది. మీరు మమ్మల్ని ఎప్పటికీ శాసించలేరు. స్వేచ్ఛ కోసం గర్జించి, సైమన్ బొలివర్ నాయకుడై కాపాడిన సీమ మాది. మా ప్రజలు కొంచెం భయస్థులు, సిగ్గరులు, అమాయకులు, దయగల మనుషులు. మా నుంచి మీరు దౌర్జన్యంగా లాక్కున్న పనామా కాలువని తిరిగి ఎలా స్వాధీనం చేసుకోవాలో మా జనాలకు తెలుసు. ఒకనాడు కొలంబియాగా, ఇప్పుడు పనామాలో భాగంగా కొనసాగుతున్న బొకాస్ డెల్ టోరో ప్రాంతంలో మీరు హతమార్చిన రెండువందల మంది లాటిన్ అమెరికా యోధులు అక్కడే విశ్రమిస్తున్నారు.


నేను ధిక్కార పతాకాన్ని ఎగరవేస్తున్నాను. నేను ఒంటరిగానే నిలబడినా, మా పూర్వీకుడు గైటాన్ చెప్పినట్లు ఈ జెండా లాటిన్ అమెరికన్ ఆత్మగౌరవంతో తలెత్తుకుని సగర్వంగా నిలబడుతుంది. అమెరికా దేశాధిపతీ, మీ పూర్వీకులు అమెరికాకి వలస వచ్చిన మనుషులు. మీ దిగ్బంధం మమ్మల్ని భయపెట్టబోదు. కొలంబియా అందమైన దేశం మాత్రమే కాదు, అది భూమికి మధ్యలో, ప్రపంచపు హృదయమై వుంది.

ఈ రోజు నుంచి కొలంబియా ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. చేతులు చాచి అందరినీ ఆహ్వానిస్తున్నది. మేము స్వేచ్ఛ, జీవితం, మానవతా నిర్మాతలం. మా శ్రమ ఫలితంగా అమెరికాలో ప్రవేశించే వస్తువుల పైన మీరు 50శాతం సుంకం విధించబోతున్నారని తెలిసింది. మేమూ అదే పని చేస్తాము. మా ప్రజలు ఇక మొక్కజొన్న పండిస్తారు. మొక్కజొన్న పంటని కనిపెట్టింది కొలంబియాలోనే. మా ప్రజలు మొక్కజొన్నతో ప్రపంచం కడుపునింపుతారు.

అనువాదం: సుధాకిరణ్

సుప్రీంకోర్టుకు 75 ఏళ్లు

1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజునే సుప్రీంకోర్టు ఏర్పడినా, దాని కార్యకలాపాలు మాత్రం జనవరి 28న ప్రారంభమయ్యాయి. అంటే ఇప్పటికి 75 సంవత్సరాల క్రితం. ఈ కాలాన్ని ఇంగ్లీషులో 'డైమండ్ జూబ్లీ'గా పిలుస్తారు. ఇంగ్లీషులో 60 సంవత్సరాల కాలాన్ని కూడా ఇలాగే పిలుస్తారు. తెలుగులో వజ్రోత్సవాలు అన్నా, ఇటీవల ఈ కాలాన్ని 'అమృతోత్సవాలు'గా కూడా పిలుస్తున్నారు. 1950లో సుప్రీంకోర్టు ఏర్పడక ముందు 1937 నుండి 1950 వరకు ఫెడరల్ కోర్టుగా దీన్ని వ్యవహరించేవారు. ఇంకా ముందు దేశంలోని వివిధ హైకోర్టు తీర్పులపై అప్పీళ్లకు లండన్‌లోని ప్రివీ కౌన్సిల్‌కి ఎంతో వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. దాంతో మహమ్మద్ అలిజిన్నా, హరిసింగ్ గౌర్‌లు భారతదేశంలోనే సర్వోన్నత న్యాయస్థానం ఉండాలనే ఆలోచనకు బీజం వేశారు. న్యాయవాదులంతా సహజంగానే సానుకూలంగా స్పందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఫెడరల్ కోర్టు ఆవిర్భవించింది.



సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హెచ్.జె. కనియా, న్యాయమూర్తులుగా జస్టిస్ ఫజల్ ఆలి, జస్టిస్ పతంజలి శాస్త్రి, జస్టిస్ మెహర్‌చంద్ మహాజన్, జస్టిస్ బిజన్ కుమార్ ముఖర్జీ, జస్టిస్ యస్.ఆర్‌లు వ్యవహరించారు. అంతకుముందు 1937–47ల మధ్యకాలంలో కేవలం ముగ్గురు న్యాయమూర్తులకు మించి ఎప్పుడూ లేరు. పైగా ప్రధాన న్యాయమూర్తి ఖచ్చితంగా ఆంగ్లేయుడే ఉండేవాడు. 1950 జనవరి 28న పార్లమెంటు భవనంలోని ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్‌లో తొలి విచారణ జరిగింది. ఏడాదికి మొదట 28 రోజులు పనిచేసిన కోర్టు, క్రమంగా 190 పనిదినాల స్థాయికి చేరింది. ఏడుగురు న్యాయమూర్తులతో ప్రారంభమై ప్రస్తుతం 34కు చేరింది. ఆవిర్భవించిన 39 సంవత్సరాలకు తొలి మహిళా న్యాయమూర్తిగా ఫాతిమా బీవీ 1989లో నియమితులయ్యారు. ఇంతవరకు మహిళ ఎవరూ ప్రధాన న్యాయమూర్తి కాలేదు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2027 సెప్టెంబర్‌లో జస్టిస్ నాగరత్న ప్రధాన న్యాయమూర్తి అవుతారు. ప్రస్తుతం ముగ్గురు మహిళలు న్యాయమూర్తులుగా ఉన్నారు.

ప్రస్తుతం తిలక్‌మార్గ్‌లో ఉన్న సుప్రీంకోర్టు భవనాన్ని 1954 అక్టోబర్ 29న శంకుస్థాపన చేసి, 1958 ఆగస్టు 4న తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. సారనాథ్‌లోని అశోకుడి ధర్మచక్రాన్ని లోగోగా స్వీకరించారు. 'యత ధర్మః తతో జయః' అన్న సూక్తి ఈ చిహ్నంలో ఉంటుంది. న్యాయం ఎక్కడ ఉంటే విజయం అక్కడే ఉంటుంది అని దాని అర్థం. మన తెలుగు వారైన కోకా సుబ్బారావు, నూతలపాటి వెంకటరమణలు ప్రధాన న్యాయమూర్తులుగా పని చేశారు. ఈ డెబ్బయి ఐదేళ్ల కాలంలో కోకా సుబ్బారావు, పతంజలి శాస్త్రి వి.ఎస్. బోస్, కపాడియా, కృష్ణయ్యర్, చిన్నపురెడ్డి, వశిష్ట భార్గవ, గజేంద్ర గడ్కర్, హెచ్.ఆర్. ఖన్నా లాంటి నీతివంతమైన మహామహుల్ని చూసిన సుప్రీంకోర్టు, తమ స్థాయికి సరిపోని పదవుల్ని ఆశించే అధముల్ని కూడా చూసింది. రాజ్యాంగ మౌలిక సూత్రాల్ని విస్మరించి, మార్చే అధికారం పార్లమెంటుకు లేదని కేశవానంద భారతి కేసు సాక్షిగా కత్తి ఝుళిపించిన సుప్రీంకోర్టు, దేశ లౌకికత్వాన్ని దెబ్బతీసే కేసుల్లో 'భట్టిప్రోలు పంచాయితీ' చేసే స్థాయికి జారిపోయింది. మున్ముందు సర్వ స్వతంత్ర వ్యవస్థగా క్రియాశీలక న్యాయవ్యవస్థను తీర్చిదిద్దే ఆలయంగా సర్వోన్నత న్యాయస్థానం మారాలని ఈ శుభసందర్భంలో కోరుకుందాం.

– చెరుకూరి సత్యనారాయణ

గవర్నర్ల వైఖరితో ప్రజలకే నష్టం!

'మరుసటి విచారణ తేదీ లోపు ఈ విషయాన్ని పరిష్కరిస్తే సరేసరి, లేదంటే మేమే పరిష్కరిస్తాం' – గౌరవ సుప్రీంకోర్ట్ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవికి ఇచ్చిన ఘాటైన సూచన ఇది. గవర్నర్ బిల్లుల విషయంలో స్పందించట్లేదని, సుదీర్ఘ కాలయాపనతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నారని తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం కోర్టుకెక్కిన విషయంలో పరిణమించిన సందర్భం ఇది. ఇటువంటి పరిస్థితులే కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లోనూ నెలకొని ఉన్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు తెలంగాణ గవర్నర్‌గా తమిళిసై సౌందరరాజన్ వ్యవహారశైలి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టిన సందర్భాలు అనేకం.

> **గవర్నర్లు కీలకమైన బిల్లులను ఆమోదించకపోవడం, సుదీర్ఘ కాలం ఎటూ తేల్చకపోవడం, మరీ ఒత్తిడి తెస్తే రాష్ట్రపతి పరిశీలనకు పంపడం సర్వసాధారణమైంది. గవర్నర్లు పరిధి దాటి ప్రవర్తిస్తున్నారనీ, ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేస్తూ ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల అస్తిత్వాన్నే ప్రశ్నిస్తున్నారనీ రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం కోసం కోర్టు మెట్లెక్కడమూ పరిపాటిగా మారింది. ఇవి ప్రజాస్వామ్యంలో అనుసరింపదగ్గ పద్ధతులు కావు.**

నాడూ నేడూ కూడా తెలంగాణ మొదలుకొని, కేరళ, పంజాబ్, తమిళనాడు, బెంగాల్, హిమాచల్ రాష్ట్రాల్లో బీజేపీయేతర పార్టీలు ప్రభుత్వాల్లో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో గవర్నర్లు కీలకమైన బిల్లులను ఆమోదించకపోవడం, సుదీర్ఘ కాలం ఎటూ తేల్చకపోవడం, మరీ ఒత్తిడి తెస్తే రాష్ట్రపతి పరిశీలనకు పంపడం సర్వసాధారణమైంది. గవర్నర్లు పరిధి దాటి ప్రవర్తిస్తున్నారనీ, ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేస్తూ ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల అస్తిత్వాన్నే ప్రశ్నిస్తున్నారనీ రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం కోసం కోర్టు మెట్లెక్కడమూ పరిపాటిగా మారింది. ఇవి ప్రజాస్వామ్యంలో అనుసరింపదగ్గ పద్ధతులు కావు.

తెలంగాణాలో అప్పటి గవర్నర్ తమిళిసై కీలకమైన బిల్లులు అనేకం సుదీర్ఘ కాలం ఎటూ తేల్చకుండా ఉన్నారు. ఎమ్మెల్సీల నియామకం విషయంలో ప్రభుత్వ నిర్ణయాలను తిరస్కరించారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం లేకుండా, నేరుగా అధికారులను పిలుచుకొని వివరణలు కోరడం, దర్బార్లు నిర్వహించడం, సాధారణ పరిశీలనల పేరిట వెళ్లి ప్రభుత్వానికి ఇబ్బంది కలిగేలా రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారాయి. వ్యవహారం వ్యక్తిగత విమర్శల వరకూ వెళ్ళింది. ప్రభుత్వం కోర్టుకు ఎక్కాల్సి వచ్చింది. తమిళనాడులో కొన్ని బిల్లులు 2020 నుంచి ఆమోదం పొందలేకపోవటం ఆశ్చర్యమే! గవర్నరు కార్యాలయం వెనక్కి పంపిన బిల్లులను, శాసనసభ తిరిగి ఆమోదించి పంపితే, నేరుగా ఆమోదించకుండా వాటిని రాష్ట్రపతి ఆమోదానికి పంపడం కూడా చర్చనీయాంశమైంది. అందుకే బిల్లులను, గవర్నర్ రాష్ట్రపతి ఆమోదానికి పంపాలంటే ప్రత్యేకమైన గైడ్‌లైన్స్ ఉండాలనే డిమాండ్ ఊపందుకొంది.

తమిళనాడు గవర్నర్ ప్రభుత్వం తయారు చేసిన అసెంబ్లీ ప్రసంగంలో పొందుపరచిన, డా.బి.ఆర్ అంబేడ్కర్, అన్నాదురై, పెరియార్ వంటి వార్ల పేర్లను విస్మరించడం ఉద్దేశ్యపూర్వకమేనని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఏకంగా తమిళనాడు పేరునే మార్చాలని గవర్నర్ చేసిన ప్రస్తావన కూడా అత్యంత వివాదాస్పదమైంది. కేరళ, పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ఇంచుమించు ఇలాంటి వివాదాలే ఉన్నాయి. నరేంద్ర మోదీ ప్రధానిగా రెండవ పర్యాయం పగ్గాలు చేపట్టిన తర్వాత గవర్నర్ల ఈ తరహా వ్యవహారం మరింత తీవ్రమైందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పంజాబ్‌లో అతి ముఖ్యమైన ఆర్థిక నిర్వహణకు, విద్యకు సంబంధించిన బిల్లుల విషయంలో గవర్నర్ వ్యవహారశైలిని తప్పు పడుతూ సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కేరళ గవర్నర్‌గా పదవీకాలం ముగించుకొని రాష్ట్రాన్ని వీడుతున్న సందర్భంలో కనీస వీడ్కోలుకు నోచుకోలేదంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. బెంగాల్‌లో ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి, నాటి గవర్నర్ జగదీప్ ధన్‌ఖడ్, మమత బెనర్జీ ప్రభుత్వాల మధ్య ఉప్పు నిప్పుగా ఉన్న సంబంధాల విషయం అందరికీ తెలిసిందే.



గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలకు అనుకూలంగా ఉంటూ ఇతర పక్షాల రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేసిన దృష్టాంతాలు గతంలో కూడా అనేకం ఉన్నాయి. రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసిన సందర్భాలు మొదలుకొని, రాష్ట్రపతి పాలన విధింపు వరకు ఎన్నోసార్లు గవర్నర్ల పాత్ర వివాదాస్పదమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి, నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించడంలో నాటి గవర్నర్ రాంలాల్ పాత్ర ఎంత వివాదాస్పదమో విదితమే. ఆ సందర్భంగా జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ప్రజల మనస్సులో ఇంకా ఉంది. ఇలా చెప్పుకుంటే పోతే ఉదాహరణలు అనేకం. అందుకే అసలు గవర్నర్ల వ్యవస్థ అవసరమా అనే చర్చ ఉత్పన్నమైంది. అది సమాధానం లేని ప్రశ్నలా కొనసాగుతూనే ఉంది.

'ప్రజాస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు పెట్టాలంటే కోర్టులనెందుకు ఆశ్రయించాలి? మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారు, పార్లమెంటరీ పద్ధతిలోని ప్రభుత్వాలను ప్రమాదంలోకి నెడుతున్నారు' ఇది పంజాబ్ గవర్నర్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య. సాధారణ వ్యక్తులు కూడా వారి విధుల విషయంలో ఆచరణనో, ఉద్దేశ్యాన్నో తప్పు పడితే, ఆక్షేపిస్తే అవమానంగా భావిస్తారు. మరి అత్యంత బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న గవర్నర్లు వారి వ్యవహారశైలిని, అధికార బాధ్యతల నిర్వహణను కోర్టులు తప్పు పట్టినా అవమానంగా ఎందుకు భావించటం లేదు? వ్యవస్థల్లో లోపించిన సున్నితత్వానికి ఉదాహరణగా భావించాలా? లేక మమ్మల్ని ఎవ్వరూ ఏమీ చేయలేరన్న భావనా? కర్తవ్యలేమి కూడా రాజకీయ వ్యూహమనుకోవాలా? కానీ తమను నియమించిన రాజకీయ పెద్దల అజెండాను అమలుపరచే క్రమంలో వ్యవస్థలను బలహీనపరచడం అధికార దుర్వినియోగం కదా? అధికారిక నిర్ణయాలలో విభేదాల కారణంగా జనిస్తున్న వివాదాలకు పరిష్కార కేంద్రాలు కోర్టులేనా? విచక్షణాధికారాలంటే పరిధులు లేని అధికారాలని అర్థమా? ఈ ప్రశ్నలను చర్చలోకి తీసుకురావాల్సిన అవసరం ఇప్పుడు ఉన్నది.

ఒకే రాష్ట్ర ప్రయోజనాల కోసం నియమితులైన గవర్నర్, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాల మధ్య పరస్పరం కేసులే అభ్యంతరం అనుకొంటే, వాటి వాదనల కోసం ప్రజా ధనాన్ని ఖర్చు చేసి ఖరీదైన న్యాయవాదులను నియమించుకోవడం వృథా ఖర్చు కాదా? ఇది ఏ రకమైన జవాబుదారీతనం? ఇరు పక్షాలూ గమనించాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, వెసులుబాట్లు ఇరు పక్షాలకూ ఈ రకంగా వ్యవహరించడానికి అవకాశం కల్పించి ఉండవచ్చు. కానీ నిజమేదో అబద్ధమేదో తెలియని అమాయకులెవరూ లేరు. ప్రజా ప్రయోజనాలే అంతిమ లక్ష్యం కావాలి కానీ, ఎవరు గొప్ప అనే తర్కం పనికి రాదు. నిర్ణయాల్లో ఆలస్యం, హేతుబద్ధత లేకపోవడం ప్రజా ధనాన్ని నష్టపర్చడమే గాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని కుంటుపరుస్తుంది. ప్రభుత్వాల లక్ష్యాల్ని నీరుగారుస్తుంది. తద్వారా ప్రజలకు నష్టం కలగజేస్తుంది. కాబట్టి వ్యవస్థల్లో ఇటువంటి లోపాల పట్ల ప్రజలు, మేధావులు ప్రశ్నించాలి. ఇటువంటి సందర్భాలు తలెత్తకుండా సంబంధిత వ్యవస్థల్లో ముఖ్యులు ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా పనిచేయాలి. ఈ సందర్భంగా గౌరవ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన మరొక నిర్దేశిత అభిప్రాయాన్ని ప్రస్తావిస్తాను: 'భారతదేశం సుదీర్ఘకాలంగా అందరూ గౌరవిస్తున్న కొన్ని సంప్రదాయాలు, పద్ధతులు, అనుసరణల ఆచరణ ప్రకారం నడుస్తోంది. వాటిని మనం గుర్తించి, గౌరవించాలి.'

◆ రావుల శ్రీధర్ రెడ్డి
బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీకాలం 26వతేదీతో పూర్తవడంతో.. సోమవారం నుంచి పాలనాపగ్గాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. ఈ పురపాలికలకు అదనపు కలెక్టర్లను (స్థానిక సంస్థలు) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో పరకాలకు హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, భూపాలపల్లికి విజయలక్ష్మి ప్రత్యేకాధికారులుగా నియమితులుకాగా, మహబూబాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు పురపాలక సంఘాలైన మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరులకు లెనిన్ వత్సల్ టొప్పో, నర్సంపేట, వర్ధన్నపేటలకు సంధ్యారాణి, జనగామకు పింకేష్ కుమార్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. వీరంతా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

2020లో ఎన్నికలు

ఈ తొమ్మిది మునిసిపాలిటీలకు 2020లో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈనెల 26న పురపాలక సభ్యుల పదవీకాలం ముగిసింది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల సభ్యుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగిన తర్వాతే మునిసిపాలిటీలకు నిర్వహిస్తారు. దీనికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశముండటంతో అప్పటి వరకు పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి అయింది. రాష్ట్రంలో 2019 జులై 9న గత పాలకవర్గాల పదవీకాలం ముగిసినా అప్పటి ప్రభుత్వం కొత్త మునిసిపల్ చట్టం తీసుకురావడం, ఓటర్ల గణన, వార్డుల విభజన, రిజర్వేషన్ల అమలు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించింది. అప్పుడు కూడా ప్రత్యేకాధికారులను నియమించి ఆరు నెలల పాటు పాలన కొనసాగించింది.

విలీన గ్రామాలు విలవిల..

2020లో చట్టుపక్కల ఉన్న గ్రామాలను కలిపి మేజర్ పంచాయతీలను మునిసిపాలిటీలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. డోర్నకల్, తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, భూపాలపల్లి అలా ఏర్పడిన మునిసిపాలిటీలే. పేరుకే ఇవి మునిసిపాలిటీలు అయ్యాయి కానీ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. విలీన గ్రామాల పరిస్థితీ మారలేదు. మునిసిపాలిటీల్లో బినామీ పేర్లతో పనులు చేసిన కౌన్సిలర్లు, చైర్మెన్లకు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో విలీన గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. టెండర్లు పిలిచినా ముందుకు రాలేదు. ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది.





పురపాలకాల్లో.. ప్రత్యేక పాలన

- 26తో ముగిసిన పాలకవర్గాల గడువు
- బాధ్యతలు స్వీకరించిన స్పెషల్ ఆఫీసర్లు
- ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు
- అధికారులకు అదనపు బాధ్యతలతో కొరవడనున్న పర్యవేక్షణ
- పూర్తిస్థాయిలో కమిషనర్లూ లేని వైనం
- గత అయిదేళ్లలో అభివృద్ధిలో వెనక్కు
- నిధులు రాక నిలిచిన పలు పనులు
- బిల్లుల కోసం తిరుగుతున్న కౌన్సిలర్లు, చైర్మన్లు

గాడి తప్పిన పాలన...

ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీల్లో దాదాపు అన్ని స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకున్నా ఆ అయిదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదు. 2020లో కరోనా కారణంగా ఏడాదిన్నర కాలం అభివృద్ధి నిలిచిపోయింది. అనంతరం పురపాలికల్లో సమీకృత భవనాలు, డంపింగ్ యార్డులు, మురికికాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా పూర్తి స్థాయిలో రాష్ట్ర ఆర్థిక సంస్థల నుంచి నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా మిగిలాయి. పట్టణ ప్రగతి కింద ప్రతినెల నిధులు రావడంతో త్వరిత గతిన బిల్లులు విడుదలవుతాయని భావించి కౌన్సిలర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేశారు. కొందరు చైర్మన్లు బినామీ పేర్లతో పనులు చేశారు. 2024 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పట్టణ ప్రగతి పట్టాలు ఎక్కలేదు. నిధులూ విడుదల కాలేదు. ఏడాది నుంచి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

ప్రత్యేకాధికారులైనా దృష్టి పెడతారా?

ప్రత్యేకాధికారుల పాలనలో అయినా ఈ మునిసిపాలిటీల పరిస్థితి మారేనా? ఎన్నికలు జరగడానికి ఆరునెలల కన్నా ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోపు ప్రత్యేకాధికారులు మునిసిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారిస్తారా ? అన్న సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిధులిస్తే తప్ప పనులు జరగవు. ఇప్పటికీ కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయాల బిల్లులను చెలించాల్సి ఉంది. బకాయిలను చెల్లిస్తే తప్పా నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభం కావు. అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) ఇప్పటికే అధిక పని భారంతో సతమతమవుతున్నారు. త్వరలో జరగే పంచాయతీ ఎన్నికలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అటువంటప్పుడు ఇక పురపాలనకు సమయం ఎక్కడ కేటాయిస్తారు. పైగా ఒక్కో అధికారికి రెండు కంటే ఎక్కువ పురపాలక సంఘాలను అప్పగించారు.

మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు నాలుగు పురపాలక సంఘాలు, వరంగల్ అదనపు కలెక్టర్‌కు రెండు మునిసిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. కొన్ని మునిసిపాలిటీలకు పూర్తి స్థాయి కమిషనర్లు కూడా లేరు. ఒక్కో కమిషనర్‌కు రెండు అంతకన్నా ఎక్కువ పురపాలక సంఘాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. నర్సంపేట మునిసిపాలిటీకి గత ఎనిమిది నెలలుగా పూర్తి స్థాయి కమిషనర్ లేదు. ఇంతకు ముందు వర్ధన్నపేటకు పూర్తిస్థాయి నర్సంపేటకు ఇంచార్జి కమిషనర్‌గా ఉన్న జోనా వరంగల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వర్ధన్నపేట మునిసిపాలిటీకి ఇమ్మడి సుధీర్ కుమార్‌ను పూర్తి స్థాయి కమిషర్‌గా నియమించినా నర్సంపేటకు మాత్రం జోనానే ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పరకాల మునిసిపాలిటీకి మూడు నెలలుగా పూర్తికాలపు కమిషనర్ లేరు. పట్టణ ప్రణాళిక అధికారి (టీపీవో)నే ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు కమిషనర్‌గా ఉన్న నర్సింహా గతేడాది అక్టోబరు 30న బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయనకు ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. ఒక మిషనర్‌కు ఒకటి కన్నా ఎక్కువ పురపాలక సంఘాలను అప్పగించడంతో కూడా పురపాలనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టే పరిస్థితి లేదు. దీంతో అటు కమిషనర్లు లేక ఇటు స్పెషల్ ఆఫీసర్లు చూడక మునిసిపాలిటీల పాలన గాడితప్పే పరిస్థితులున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ నగర పాలక సంస్థ పాలక వర్గం పదవీ కాలపరిమితి మరో ఏడాది ఉంది. 2021 ఫిబ్రవరి 1న పాలక వర్గం కొలువుదీరింది. దీనితో పదవీ కాలం ఉన్న వాటిని పక్కన బెట్టి పదవీ కాలం పూర్తయిన మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

కూలీల కుటుంబాల్లో విషాదం

- ట్రాలీ ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ
- అంబాల వద్ద ఘటన.. ఓ మహిళ మృతి
- ఆటో డ్రైవర్ సహా నలుగురికి తీవ్రగాయాలు
- ఎంజీఎంకు తరలింపు

కమలాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఒకే గ్రామానికి చెందిన వారు.. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు. ఇంటిల్లిపాది కూలి పనులు చేయనిదే వారి జీవనం గడవని పరిస్థితి. రోజూ ఉదయాన్నే సద్దులు కట్టుకుని కిలోమీటర్ల దూరం వెళ్లి వ్యవసాయ పనులు చేసి సాయంత్రానికి ఇళ్లకు తిరిగొస్తుంటారు. అలా వ్యవసాయ పనుల కోసం ఓ ట్రాలీ ఆటోలో వచ్చి.. సాయంత్రం అదే ట్రాలీ ఆటోలో తిరుగుపయనమైన క్రమంలో రోడ్డుప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సుని ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఆటో డ్రైవర్ సహా మరో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడిన ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరు-అంబాల రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. కమలాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన 22 మంది కూలీలు ఓ ట్రాలీఆటోలో కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి వచ్చి రోజంతా వ్యవసాయ పనులు చేశారు. సాయంత్రం పని ముగిసిన తర్వాత అదే ట్రాలీ ఆటోలో స్వగ్రామానికి బయల్దేరారు. అయితే వారు ప్రయాణిస్తున్న వాహనం కమలాపూర్ మండలంలోని గూడూరు-అంబాల మార్గం మధ్య ఎదురుగా వస్తున్న బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాలీ ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న వారంతా చెల్లాచెదురుగా పడ్డారు. దీంతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు 108కి సమాచారమివ్వగా.. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ఐదు 108అంబులెన్సులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హుస్సేన్ బీ (50)మృతి చెందగా, ఆటో డ్రైవర్ అబ్దుల్ తో పాటు కూలీలు మౌలానా బీ, యాకూబ్ బీ, కరీబా, ముంతాజ్ బీ తీవ్రంగా గాయపడ్డారని వైద్యులు తెలిపారు. ఇక మిగతా 16 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కాజీపేట్ ఏసీపీ తిరుమల్ పరిశీలించి వివరాలు సేకరించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ట్రాలీ ఆటోలో 22 మందిని ఎక్కించుకోవడమే కాకుండా డ్రైవర్ అబ్దుల్ అజాగ్రత్త, అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని సీఐ హరికృష్ణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆర్టీసీ డ్రైవర్ బొట్ల మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు.



హుస్సేన్ బీ మృతదేహం



గాయపడిన కూలీలు | బస్సును ఢీ కొట్టిన ట్రాలీ ఆటో

క్షతగాత్రులకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని పరామర్శ

వరంగల్ మెడికల్ : అంబాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఎంజీఎం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గాయపడిన వారంతా పేద కుటుంబాలకు చెందిన వారని ప్రభుత్వం కూడా తగిన విధంగా చర్యలు తీసుకొని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విజ్ఞప్తులు సత్వరమే పరిష్కరించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం
- 85 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులు చొరవ చూపాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 85 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్ లింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేష్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. ఇంజనీరింగ్ - 22, హెల్త్, శానిటేషన్-13, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ-4, టౌన్‌ప్లానింగ్-42, తాగునీటి సరఫరా - 4 మొత్తం 85 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.



మడికొండ డంపింగ్ యార్డును తరలించాలని విజ్ఞప్తి చేస్తున్న స్థానికులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- మడికొండ డంపింగ్ యార్డును వెంటనే అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలని స్థానిక ప్రజలు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. డంపింగ్ యార్డ్ నుంచి నిత్యం నిప్పు రాజుకుని వచ్చే పొగతో చుట్టుపక్కల సుమారు నాలుగు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.
- హనుమకొండ 9వ డివిజన్‌లోని సుధానగర్‌లో కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి కట్టడాలు నిర్మించడం వల్ల అటుగా ప్రయాణించడం వల్ల చాలా ఇబ్బందిగా మారుతుందని కాలనీ ప్రజలు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ గోపాలపురం ప్రగతినగర్ కాలనీలో మూడు బాటలు కలుపుకుని ఉన్న 25 ఫీట్ల రోడ్డును ఆక్రమించి కొందరు వ్యక్తులు అర్చి నిర్మాణం చేస్తున్నారు. ఈ కట్టడాల వల్ల అటుగా ప్రయాణించే వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు కమిషనర్‌కు విన్నవించారు.
- వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో గత కొద్ది రోజులుగా ఇండ్ల మధ్యలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీకి చెందిన న్యాయవాది కమల్ కిశోర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా కాలనీలలో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ఎట్టకేలకు..

కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి ముందడుగు

- నేడు కలెక్టర్, రైల్వే అధికారుల సంయుక్త పరిశీలన
- ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య ప్రత్యేక చొరవ
- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర

6



రైల్వే జీఎంకు వినతిపత్రం అంజేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, కడియం, ఎమ్మెల్సీ సారయ్య



పథకాలపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాల కోసం ప్రజాపాలన గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ నాలుగు పథకాలపై సోమవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. రైతు భరోసాలో వ్యవసాయేతర భూములను గుర్తించకుండా ఏమైనా మిగిలి ఉన్నట్లయితే వాటిని త్వరగా నమోదు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలాగే రేషన్‌కార్డుల కోసం, కార్డులలో చేర్చడానికి, తీసివేయడానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, గృహనిర్మాణ శాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, పౌరసరఫరాల శాఖ అధికారి కొమురయ్య, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసు

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేసిన జేఏసీ నాయకులు

ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికుల డిమాండ్

హనుమకొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికుల జేఏసీ నాయకులు సోమవారం ఆర్టీసీ ఎండి సజ్జనార్‌కు వినతిపత్రం అందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2021వ సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆర్టీసీ కార్మికులకు పే-స్కేలు ఇవ్వాలని, రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వకుండా ఆర్టీసీనే బస్సులను కొనుగోలు చేయాలని, కార్మికుల కో-ఆపరేటివ్ సొసైటీ నిధులు విడుదల చేసి పీఎఫ్ ఫండ్‌ను కార్మికులకు వెంటనే చెల్లించాలని సమ్మె నోటీసులో డిమాండ్ చేశారు.

వరంగల్ రీజినల్ పరిధిలో పోరాటాలకు సిద్ధమైన కార్మికులు

వరంగల్ రీజనల్ పరిధిలో 9 ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి అధికారుల ఒత్తిడి తగ్గించాలని డిమాండుతో వరంగల్ రీజనల్ పరిధిలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ప్రభుత్వంతో తాడో-పేడో తేల్చుకుంటామని విధులు నిర్వర్తిస్తూనే పోరాడతామన్నారు.

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- పలు సమస్యలపై 127 దరఖాస్తుల స్వీకరణ

హనుమకొండ కలెక్టరేట్, జనవరి27(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజల నుంచి విచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్న 1:30 గంట వరకు నిర్వహించిన ప్రజవాణికి జిల్లా నుండి వివిధ సమస్యలపై 127 దరఖాస్తులు రాగా కలెక్టర్ ప్రావీణ్య బాధితుల నుంచి ఓపికగా సమస్యలు విని సంబంధిత అధికారులను పిలిచి సమస్యలు ఎంక్వైరీ చేసి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవి గణేష్, డీఆర్‌డీఏ పీడీ మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు పాల్గొన్నారు.



బాధితుల సమస్య వింటున్న కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద

మడికొండను డంపింగ్ యార్డు నుంచి కాపాడండి

మడికొండలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు మడికొండ గ్రామ ప్రజలు సోమవారం వినతిపత్రం అందజేశారు. వరంగల్, హనుమకొండ పట్టణాల్లోని 66డివిజన్‌లలో ఉన్న చెత్తను మొత్తం తీసుకొచ్చి మడికొండలోని డంపింగ్ యార్డులో వేయడంవల్ల తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని, కలెక్టర్ స్పందించి ఇక్కడి నుండి డంపింగ్ యార్డు వేరే చోటికి తరలించాలని మడికొండ గ్రామ ప్రజలు కలెక్టర్ ప్రావీణ్యను వేడుకున్నారు.

వీఎంసీ కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా హనుమకొండలో నడిపిస్తున్న వీఎంసీ ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లాలోని దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో దళిత రైతు చిలువేరు భిక్షపతికి చెందిన భూమి కబ్జా చేసిన పిల్లలమర్రి సతీష్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు.

దరఖాస్తులపై సత్వరమే స్పందించాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో అందించిన వినతులపై సత్వరమే స్పందించాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులే మళ్లీ మళ్లీ వస్తున్నాయని, సాధ్యమైనంత మేరకు వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 156 వినతులు అందగా శాఖల వారీగా ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు 48, డీఆర్‌డీఏ 15, సివిల్ సప్లై 7, జీడబ్ల్యూఎంసీ 13, పోలీసు శాఖ 7, డీఎంహెచ్‌వో 5, జిల్లా సంక్షేమ శాఖ 3, అగ్రికల్చర్ ఆఫీసర్ 5, విద్యాశాఖ 2, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 8, జడ్పీ సీఈవో 8, ఎంజీఎం 2, ఎల్‌డీఎం 6, డీపీవో 2, సర్వే ల్యాండ్ 2, మెప్మా 2, ఎన్‌పీడీసీఎల్ 2 వినతులు అందినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆయుర్వేద మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు

ఆయుర్వేద మందుల కంపెనీపై కేసు నమోదు

జనగామ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అభ్యంతరకర ప్రకటనలు చేసిన ఆయుర్వేద మందుల కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ జిల్లా అధికారి ఏలె బాలకృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఆయుర్వేద మందుల దుకాణంలో అభ్యంతరకర ప్రకటన ముద్రించారనే పక్కా సమాచారంతో సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గుజరాత్‌కు చెందిన ధన్వాంతరి ఆయుర్వేదిక్ డ్రగ్స్ కంపెనీ తయారు చేసిన అరీ సిరప్ కిడ్నీ స్టోన్స్‌కు వాడాలని విక్రయిస్తూ అభ్యంతరకర ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. సిరాప్ వాడటం వలన ప్రజల ఆరోగ్యానికి హాని జరుగే అవకాశం ఉన్నందున కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి మెరిట్ అభ్యర్థుల జాబితా విడుదల

జనగామ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకున్న ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సోమవారం డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయం నోటీసు బోర్డుపై అంటించడం జరిగిందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

పదోన్నతి అర్హత పరీక్ష.. పరిశీలించిన సీపీ

మడికొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు ఎస్సై పదోన్నతి కోసం మడికొండలోని సిటి పోలీస్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన అర్హత పరీక్షను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం పరిశీలించారు. భద్రాద్రి, కాళేశ్వరం జోన్ల పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు ఎస్సై పదోన్నతి కోసం సిటీపోలీస్ శిక్షణా కేంద్రంలో అర్హత పరీక్షలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తామని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణార్థుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ బోధన బోర్డులను సీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో నాల్గో పటాలం కమాండెంట్ రాంప్రకాశ్, అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, రవికుమార్ పాల్గొన్నారు.

మడికొండ పీఎస్ సందర్శన

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం మడికొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు వచ్చి వెళ్తూ స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్లు, వాహనాల పార్కింగ్, చెట్లు, గార్డెనింగ్ వంటి సుందరీకరణ పనులను పరిశీలించి స్థానిక ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

కేఎంసీకి శరీరదానం

- ఆదర్శంగా నిలిచిన పాల కుమారస్వామి
- అభినందించిన మంత్రి కొండా సురేఖ

కరీమాబాద్, జనవరి27(ఆంధ్రజ్యోతి): వరంగల్ 40వ డివిజన్‌కు చెందిన పాల కుమారస్వామి తన శరీరాన్ని కేఎంసీకి దానం చేశారు. వృత్తిరీత్యా ప్రైవేటు టీచర్ అయిన కుమారస్వామి ప్రవృత్తి రీత్యా అంబేద్కరిస్టు, జనవిజ్ఞాన వేదికలో సోషల్ జస్టిస్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా కుమారస్వామిని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. కేఎంసీ అందించిన శరీర అవయవదాన పత్రాన్ని సోమవారం ఉర్సు ప్రాంతంలో అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవయవాలను కోల్పోయి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న వారికి ఇలాంటి మహత్తర కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల సంఖ్య పెరిగినందున భవిష్యత్తులో పార్థీవ దేహాల అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన సదాశయ ఫౌండేషన్‌ను అభినందించారు. పాల కుమారస్వామి శరీరదానం చేయడం ప్రశంసనీయమని, ఆయనను ఆదర్శంగా తీసుకొని మరింత మంది అవయవ దానానికి ముందుకు రావాలని పిలుప నిచ్చారు. ఈ కార్యక్రమంలో చిలువేరు శ్రీనివాస్, టి.శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాలకుమారస్వామికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మంత్రి కొండా సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 27: (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగు విడతల్లో నిర్వహించే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1496 మంది ప్రథమ, 3484 మంది ద్వితీయ సంవత్సరం మొత్తం 4980 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, విద్య, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహించే పరీక్షలలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఇన్‌చార్జి డీఐఈవో మాధవరావు, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

- కంటైనర్ లారీ సీజ్
- స్వగ్రామాలకు మృతదేహాల తరలింపు
- గాయపడినవారికి హైదరాబాద్‌లో మెరుగైన చికిత్స

మామునూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మామునూరు పెట్రోల్‌బంకు సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడగా, మరో నలుగురికి తీవ్రగాయాలైన విషయం విధితమే. మద్యం మత్తులో వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ యోగేందర్ సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. కంటైనర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ ఓ.రమేష్ తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంతోష్ చౌహాన్, ఆర్తి చౌహాన్, కిరణ్ చౌహాన్, కన్నా చౌహాన్‌ల మృతదేహాలను వారి స్వగ్రామమైన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ ప్రాంతానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చామబాయిచౌహాన్, ముఖేష్ చౌహాన్‌లను సైతం పంపించారు. ఇందుకోసం మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద, పోలీస్ కమీషనర్ అంబర్‌కిశోర్ ఝా ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనం, అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఏసీపీ తిరుపతి, సీఐ ఓ.రమేష్ చొరవ తీసుకొని వారి స్వగ్రామానికి వెళ్లే వరకు ఫోన్‌లో మాట్లాడుతూ వారి బాగోగులు తెలుసుకున్నారు. కాగా మృతదేహాలు తరలించేందుకు, క్షతగాత్రులకు వైద్య ఖర్చులకు మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా తీవ్రంగా గాయపడిన వరంగల్‌కు చెందిన ఇద్దరు ఆటోడ్రైవర్లు రాపర్తి సాగర్, మహమ్మద్ షకిల్‌లను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

రేపు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలంలో అంత రాయాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ఈ నెల 29న ఆయా సర్కిళ్ల నోడల్ అధికారులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయా సర్కిళ్ల ఎస్ఈలు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నోడల్ అధికారులు తమ పరిధిలోని ట్రాన్స్ కో అధికారి, సర్కిల్ అధికారి, విద్యుత్ సిబ్బందితో సమావేశమై పురోగతిలో ఉన్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై మార్గ నిర్దేశం చేయనున్నారు. హనుమకొండ సర్కిల్‌లో నోడల్ అధికారి టి. మధుసూదన్ (సీ.ఈ), వరంగల్ సర్కిల్‌లో నోడల్ అధికారి రాజు చౌహాన్ (సీ.ఈ) సమీక్షలో పాల్గొన్న సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై దిశానిర్దేశనం చేయనున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదన్ తెలిపారు.

ఎట్టకేలకు..

కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి ముందడుగు

నేడు కలెక్టర్, రైల్వే అధికారుల సంయుక్త పరిశీలన
- ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య ప్రత్యేక చొరవ
- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- పలు మార్లు 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు

కాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన బస్టాండ్ నిర్మాణం కల త్వరలో నెరవేరబోతుంది. గతంలో పలు దఫాలుగా ఆంధ్రజ్యోతిలో వెల్లడించిన కథనాలతో కదలిక వచ్చింది. దీంతో కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి ముందడుగు పడింది. సోమవారం సికింద్రాబాద్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి కాజీపేటలో బస్టాండ్ లేక తలెత్తే సమస్యలపై జీఎంకు వివరించారు. వెంటనే స్థల పరిశీలన కోసం మంగళవారం కలెక్టర్, రైల్వే అధికారులు బృందం జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయనున్నారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి బస్టాండ్ నిర్మాణ స్థలం కోసం పలు మార్లు రైల్వే జీఎం, డీఆర్ఎం, ఇతర అధికారులను కలిశారు. బస్టాండ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కృషిని పలువురు అభినందిస్తున్నారు.

మూడు దశాబ్దాల ఉద్యమ ఫలితం

కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఉద్యమిస్తూనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల నినాదంగా మారింది. అధికారం చేపట్టిన అన్ని పార్టీలు తరువాత అటకెక్కించాయి. 1990లో పీపుల్స్ వార్ పార్టీ కూడా ఉద్యమించారు. నిజానికి కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం అత్యవసరం. ప్రస్తుత బస్టాండ్ ప్రధాన రహదారిపై ఒక చిన్న రేకుల షెడ్డులో నడుస్తోంది. సుమారు కాజీపేట చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల వారు వివిధ ప్రదేశాలకు వెళ్తుంటారు. పైగా కాజీపేట జంక్షన్ మీదుగా సుమారు 100 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే ప్రయాణికులు, వివిధ ప్రాంతాల ప్రయాణికులతో బస్టాండ్ కిక్కిరిసి పోతోంది.



ప్రధాన రహదారి పక్కన తాత్కాలికంగా బస్‌స్టాప్

హామీని నెరవేరుస్తాం..

ఎన్నికల ముందు కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతామన్నాను.. ఇచ్చిన మాట ప్రకారం బస్టాండ్ నిర్మిస్తాం. కాంగ్రెస్ పార్టీ మాటిచ్చిందంటే నెరవేర్చుతుంది. కలెక్టర్, రైల్వే అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ తర్వాత రైల్వే స్థలానికి రేటు కట్టించడమా, లేక భూమికి బదులు రాష్ట్ర ప్రభుత్వం మరో భూమి రైల్వేకు ఇవ్వడమా అని తేల్చిన వెంటనే నిర్మాణ పనులు చేపడుతాం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా బస్టాండ్ నిర్మించి తీరుతాం.

\- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

బస్టాండ్, రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

రైల్వే జీఎంకు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు వినతి

కాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్ సమీపంలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వాలని, కాజీపేట జంక్షన్‌కు డివిజన్ హోదా కల్పించాలని కోరుతూ సోమవారం సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, డీజీఎం ఉదయ్ నాథ్ కోట్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి వినతి పత్రం సమర్పించారు. రైల్వే ప్రధాన రహదారి వెంట ఉన్న రైల్వే స్థలాన్ని ఆర్టీసీకి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణానికి సిద్ధంగా ఉందని తెలిపారు. కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ అంశాలపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	5150	4600
పల్లికాయ (పచ్చిది)	6200	3100
కందులు	6512	4460
పెసళ్లు	7073	2800
పత్తి	7020	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్ 341 కొత్తది	15000	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

\- వరంగల్ వ్యవసాయం



ఆలయంలో రుద్రేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా రుద్రేశ్వర కల్యాణం

హనుమకొండ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తం భాల రుద్రేశ్వరాలయంలో శివప్రీతికర సోమవారం మాస శివరాత్రి కలిసి రావడంతో నేత్రపర్వంగా రుద్రేశ్వర కళ్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ,మణికంఠశర్మల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రానుసారం కళ్యాణ క్రతువు నిర్వహించారు. గణపతి ఆరాధన, మంట పారాధన, కంకణధారణ, మంగళసూత్రధారణ, తలంబ్రాలు, నాగవెల్లి, పుష్పార్చణ అనంతరం నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. పెద్ద సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి పర్వది నం సందర్భంగా జీఎంఆర్ గ్రూప్స్ అధినేత శివరాత్రి ఉత్సవాలకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అదేవిధంగా వెండితో కూడిన 108 రుద్రాక్షలను రుద్రేశ్వరునికి అలంకరించేందుకు అందజేశారు. అంతకుముందు రుద్రేశ్వరునికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు.

మీ టికెట్ యాప్‌లో వరంగల్ టూరిజం








పర్యాటకం

ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు చోటు

- త్వరలోనే యాప్‌లో అందుబాటులోకి..
- వివరాలను పంపిన జిల్లా పర్యాటక శాఖ
- ఇప్పటికే కొన్ని ప్రదేశాల చేర్పు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనుకునే వారికి ఇకపై మొబైల్ ద్వారానే సమాచారమంతా అందనుంది. కోరుకున్న పర్యాటక ప్రాంతానికి వెళ్లడానికి మీ టికెట్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆర్టీసీ హైదరాబాద్ మెట్రో టికెట్లు సహా తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ఇతర సేవలకు సంబంధించిన టికెట్లన్నీ సులభంగా ఈ యాప్ ద్వారా పొందొచ్చు. ఇందు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ మీ టికెట్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇటీవలే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ యాప్‌ను ప్రారంభించారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పర్యాటక ప్రదేశాలు, ప్రముఖ దేవాలయాల సమాచారాన్ని మీ టికెట్ యాప్‌లో జోడించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాల గురించిన సమాచారాన్ని ప్రభుత్వం ఇప్పటికే తెప్పించుకుంది. మీ టికెట్ యాప్‌లో పొందుపరచాల్సిన దర్శనీయ స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా పర్యాటక శాఖ పంపించింది. ఇప్పటికే కొన్ని ప్రదేశాలను ఈ యాప్‌లో చేర్చారు. త్వరలో మిగతావాటిని పొందుపరిచేందుకు కసరత్తు జరుగుతోంది. యాప్‌లో ఉమ్మడి జిల్లా పర్యాటక ప్రాంతాలను చేర్చేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని జిల్లాలోని నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) అందిస్తోంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

మీ టికెట్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబర్, పాస్‌వర్డ్‌ను నమోదు చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. మీ టికెట్ యాప్‌లో ఇప్పటికే రాష్ట్రంలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 51 బోటింగ్ ప్రదేశాలు, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌జోన్స్, కమ్యూనిటీ హాల్స్ తదితర వాటి కోసం టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా యూపీఐ ద్వారా చెల్లింపు చేయొచ్చు. ఇదే కాకుండా వినియోగదారులు ఎంచుకున్న లోకేషన్‌కు సమీపంలోని చూడదగ్గ ప్రదేశాలుంటే ఆ సమాచారం కూడా యాప్‌లో కనిపించేలా మీ టికెట్ యాప్‌ను రూపొందించారు. హైదరాబాద్ నగరానికి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు, వ్యాపారం, వైద్యం, ఇతర అవసరాల కోసం ప్రయాణం సాగిస్తుంటారు. ఇలాంటి వారు నగరంలోని ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లాలంటే తక్కువ ధర, తక్కువ సమయంలో వెళ్లేందుకు మెట్రోను ఎంచుకుంటారు. సంబంధిత స్టేషన్‌కు వెళ్లి టికెట్ బుక్ చేసుకోవడానికి ఆపసోపాలు పడాల్సిన పని లేకుండా మీ టికెట్ యాప్‌లో టికెట్ సులభంగా బుక్ చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలోని దర్శనీయ స్థలాలను చేర్చుతున్నాం

ఇతర రాష్ట్రాలు, జిల్లాలవారు, స్థానికులు ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఇంటి వద్దే తమ మొబైల్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడానికి అక్కడ ఒకటీ రెండు రోజులు బస చేయడానికి వీలుగా అవసరమైన వసతి కల్పనకూ ముందస్తు బుకింగ్ చేసుకోవడానికి మీ టికెట్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లాలోని చూడదగ్గ ముఖ్యమైన అన్ని దర్శనీయ స్థలాలను ఎంపిక చేసి వాటిని యాప్‌లో జోడించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో ఇది అందుబాటులోకి వస్తుంది. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను యాప్‌లో చేర్చడానికి ఎన్ఐసీ సాంకేతిక సహకారం అందిస్తోంది.

- శివాజీ, జిల్లా పర్యాటక శాఖ అధికారి

పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ

హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు బస్సులు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఏర్పాట్లు చేసిన టూరిజం శాఖ అధికారులు

వరంగల్ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నివసించేవారు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించే విధంగా పర్యాటకశాఖ ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ప్రత్యేక బస్సులను కేటాయించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. నాగసంధ్యారాణి తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని భద్రకాళి దేవస్థానం, పద్మాక్షి అమ్మవారి దేవాలయం, వేయిస్తంభాల గుడి, ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాలను సందర్శించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం టూరిజం వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఒక డేట్ ఇస్తారు. ఆరోజు హైదరాబాద్‌లో ఉదయం 6 గంటలకు బస్సు బయల్దేరి ఈ ఆలయాల సందర్శన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు రాత్రి 8 గంటలకు చేరుకుంటుంది. టికెట్ రేట్లు పెద్దలకు రూ.2197, చిన్నారులకు రూ.1758గా నిర్ణయించారు. మరో ప్యాకేజీ కింద రెండు రోజుల పాటు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు సందర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు ఖమ్మం జిల్లా పాల్వంచలోని పెద్దమ్మ దేవాలయం, భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, పర్ణశాల ఆశ్రమం సందర్శన రాత్రి అక్కడే బస ఉంటుంది. మర్నాడు ఉదయం బయల్దేరి కురివి వీరభద్రస్వామి దేవాలయం, మేడారం సమ్మక్క- సారలమ్మ దేవాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయం, శ్రీపద్మాక్షి అమ్మవారి దేవాలయం, శ్రీరుద్రేశ్వర వేయిస్తంభాల దేవాలయం, రామప్ప శ్రీరామలింగేశ్వర దేవాలయం దర్శనం అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ రెండు రోజులకు పెద్దలకు రూ.6173, చిన్నారులకు రూ.4938 చార్జీ నిర్ణయించారు. వివరాలకు టూరిజం శాఖ వారిని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా నమోదు..

ఉమ్మడి జిల్లాలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే దేవాలయాల సందర్శనలో భాగంగా పర్యాటకులు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న అనంతరం వారికి ప్రయాణించే తేదీ, బస్సు బయల్దేరే సమయం, పలు సూచనలతో కూడిన సమాచారాన్ని మొబైల్ ఫోన్ ద్వారా తెలియజేస్తారు.

స్పౌజ్ బదిలీల్లో గందరగోళం

- తప్పులతడకగా 2002 అన్ ట్రెయిన్డ్ డీఎస్సీ ఉపాధ్యాయుల ర్యాంకులు, అపాయిమెంట్ డేట్లు
- వివరాలు లేకుండానే జాబితాలు
- పోస్టులున్నా చూపడం లేదంటూ ఆవేదన
- అధికారుల తప్పిదం.. టీచర్లకు సంకటం..



వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన స్పౌజ్ బదిలీల్లో అధికారుల తప్పిదం ఉపాధ్యాయులకు సంకటంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పౌజ్ బదిలీల ప్రక్రియలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఉపాధ్యాయులను గందరగోళంగా తయారైందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనలు, స్పౌజ్ బదిలీల ఉత్తర్వుల మేరకు స్పౌజ్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సిన విద్యాశాఖాధికారులు వారి వారి ఇష్టానుసారం చేయడం వల్ల మూడేళ్లుగా ఎదురుచూస్తున్న స్పౌజ్ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు వెల్లడించకుండానే స్పౌజ్ జాబితాలు ప్రకటించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఖాళీలున్నా ఖాళీలు లేవంటూ కొంత మందికి స్పౌజ్ బదిలీలను దక్కకుండా అధికారులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. మొత్తంగా మూడేళ్లుగా ఎదురుచూస్తున్న స్పౌజ్ బదిలీలల్లో కొంత మందికి నిరాశే మిగలనుంది.

స్పౌజ్‌ల వివరాలు వెల్లడించకుండానే..

హనుమకొండ జిల్లాలో స్పౌజ్‌ల పూర్తి వివరాలు వెల్లడించకుండానే జాబితాలను సిద్ధం చేసి వాటి ప్రకారమే స్పౌజ్‌ల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు సిద్ధమైనట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. వరంగల్ జిల్లాలో స్పౌజ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలతో జాబితాలను రూపొందించినప్పటికీ హనుమకొండ జిల్లాలో మాత్రం అలా రూపొందించకుండా కేవలం స్పౌజ్‌లలో ఒక్కరి వివరాలు మాత్రమే పొందుపరిచి జాబితాలను రూపొందించినట్లు బాధిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో వివరాలు లేకపోవడంతో అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అధికారులు రూపొందించిన జాబితాలో ఒక ఉపాధ్యాయురాలు హనుమకొండకు స్పౌజ్ బదిలీపై వస్తుండగా ఆమె భర్త డాక్టర్ మాత్రం ఆదిలాబాద్‌లో ఉన్నారు. భర్త ఆదిలాబాద్‌లో ఉంటే ఆ ఉపాధ్యాయురాలును హనుమకొండకు స్పౌజ్‌పై ఎలా బదిలీచేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

తప్పులుగా వివరాలు

హనుమకొండ జిల్లాలో రూపొందించిన స్పౌజ్ బదిలీల్లో 2002 అన్‌ట్రైన్డ్ డీఎస్సీకి చెందిన ఉపాధ్యాయుల వివరాలు తప్పుగా నమోదైనట్లు సదరు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రూపొందించిన జాబితాల్లో వారి అపాయిమెంట్ల తేదీలతో పాటు డీఎస్సీ ర్యాంకులను తప్పులుగా చూపించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో, సర్వీస్ బుక్కుల్లో సరిగ్గానే ఉన్నా జాబితాల్లో మాత్రం తప్పులుగా రావడం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయంలో ఉపాధ్యాయులు

మూడేళ్ల కిందట స్పౌజ్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు గతేడాది నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో కొందరు పదోన్నతులు పొందారు. ఇప్పుడు పాత కేటగిరిలో స్పౌజ్ బదిలీల చేస్తుండగా వారి కేటగిరీ మారిపోవడంతో వారి బదిలీల్లో చిక్కుముడి పడినట్లయ్యింది. వారిని బదిలీ చేయాలో లేదో తెలియని సంకటస్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ఏమీ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పోస్టులున్నా... బదిలీలు లేవు..

వరంగల్, హనుమకొండ జిల్లాలో పోస్టులున్నా, లేవంటూ అధికారులు కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు బాధిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. హనుమకొండ జిల్లాలో ఉర్దూ మీడియంలో రెండు గణితం పోస్టులున్నా లేవంటూ అధికారులు తప్పుడు సమాచారమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బయోసైన్స్‌లోనూ ఇద్దరికి పోస్టులు లేవంటూ ఎగనామం పెడుతున్నారని, ఇక వరంగల్ జిల్లాలోనూ రెండు ఉర్దూ పోస్టులున్నా లేవంటూ అధికారులు మూడేళ్ల ఆశలను నీరుగారుస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు.



స్పౌజ్ బదిలీలు ఇలా..

స్పౌజ్ బదిలీల ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లాకు మొత్తం 72 మందిని కేటాయించగా 72 మంది రిపోర్టు చేశారు. అందులో నలుగురు ఉపాధ్యాయులు అర్హత లేదని అధికారులు గుర్తించగా రెండు పోస్టులు ఖాళీలు లేవని జాబితాలు సిద్ధం చేశారు. కాగా, ప్రస్తుతం 66 మందికి రెండుమూడు రోజుల్లో జిల్లాలో పోస్టులు కేటాయించనున్నారు. ఇక హనుమకొండ జిల్లాకు 134మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇందులో ముగ్గురు ఉపాధ్యాయులు రిపోర్టు చేయలేదు. ముగ్గురు ఉపాధ్యాయుల కేటగిరీలు తప్పుగా వచ్చాయి. మరో ఇద్దరు ఉపాధ్యాయులు స్పౌజ్‌లు హనుమకొండలో పనిచేయడం లేదు. ఒక్కరి స్పౌజ్ మృతి చెందారు. ఒక 5 పోస్టులు ఖాళీలు లేవని, సోమవారం నాడు మిగిలిన 120 మంది ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీలో పోస్టులు కేటాయించనున్నారు.

త్రిశంకు స్వర్గంలో స్పౌజ్ బదిలీలు

స్పౌజ్ బదిలీల విషయంలో త్రిశంకుస్వర్గంలో ఉన్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న జిల్లా నుంచి అక్కడి డీఈవోలో తమను రిలీవ్ చేశారని, రెండు రోజులైనా పోస్టులు కేటాయించకపోవడంతో తాము ఎక్కడ పనిచేస్తున్నామో తెలియని పరిస్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిలీవ్ అయిన తెల్లవారే వారు పోస్టులు కేటాయించాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాలున్నా జిల్లా విద్యాశాఖాధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టులు కేటాయించే వరకు రెండు మూడు రోజుల సీనియారిటీ కోల్పోవాల్సి వస్తుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే సమర్థ పాలన

- బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను పెంచుకోవాలి
- కలెక్టర్ ప్రావీణ్య



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగులు ప్రజలకు సమర్థవంతమైన పాలనను అందించగలుగుతారని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్సులోని బోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'సాధికారిక నైపుణ్యత- బోధనేతర సిబ్బందికి సమగ్ర శిక్షణ' అనే అంశంపై 5 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. వరంగల్‌లోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ఈనెల 31 వరకు సాగుతుంది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రావీణ్య మాట్లాడుతూ ఏ సంస్థ అభివృద్ధిలో అయిన పరిపాలన కీలక పాత్రపోషిస్తుందన్నారు. ఉద్యోగులు సానుకూల దృక్పథంతో ఉండి, పరస్పరం చర్చించుకొని ఉత్తమమైన విధానాలను అర్థం చేసుకుంటూ విధులు నిర్వహించినట్లయితే అద్భుతమైన ఫలితాలు వస్తాయని అన్నారు. అవి వారు పని చేసే సంస్థ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిట్‌లోని బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిట్ అభివృద్ధి, పరిపాలనకు ఎంతో దోహదపడగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రతీ ఉద్యోగి సంస్థ సంక్షేమ, అభివృద్ధి కోసం పని చేయాలని ఉద్బోదించారు. వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ విద్యా సంస్థల్లో బలమైన పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. ఎంఎంటీటీసీ-యూజీసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ టి కిశోర్ కుమార్ బోధనేతర సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచడంలో ఈ శిక్షణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.

వైవిధ్య సాహిత్య ప్రక్రియల్లో మెరుగు

- రచనల్లోనే కాదు సామాజిక సేవల్లోనూ మేటిగా అనురాధ
- సినారే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక




గవర్నర్ తమిళి సై ప్రసంసలు అందుకుంటున్న అనురాధ (ఫైల్)



ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకుంటూ..

స్ఫూర్తి

హనుమకొండ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మోదుగు పూవ మెరుపుల తో విచ్చుకున్న తెలంగాణ.. తంగేడుల పచ్చదనం పూసుకున్న తెలంగాణ.. బోనమెత్తి భావితరపు కాంక్షలన్ని నెరవేర్చేను సాంప్రదాయ సంస్కృతులను కూర్చుకున్న తెలంగాణ' అంటూ తెలంగాణపై తన ఆర్తిని ప్రకటిస్తూ అనేక కవితా వస్తువులతో వైవిధ్య సాహిత్య ప్రక్రియలను సునాయసంగా సృజిస్తున్నారు కవయిత్రి మెరుగు అనురాధ. వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ కవయిత్రిగా, రచయితగా రాణిస్తున్న ఆమె తాజాగా రాష్ట్రస్థాయిలో సినారే వాగ్భూషణ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెలాఖరున కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. తెలంగాణ కళావేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఏటా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి సినారే వాగ్భూషణ పురస్కారానికి ఈసారి అనురాధను ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ ఛైర్మన్ దాస్యం సేనాపతి ప్రకటించారు. హనుమకొండ రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న అనురాధ వృత్తిరీత్యా హిందీ భాషోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె సాహిత్య రచన వ్యాసాంగం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, విద్యా ఆధ్యాత్మిక సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తూ మాతృభాష తెలుగుతో పాటు జాతీయ భాష హిందీని పరిరక్షించేందుకు ఉద్యమిస్తున్నారు. వీణప్రియా కృతి కలం పేరుతో ఆమె ఇటీవల అనురాగ వీచికలు అనే సాహిత్య సంకలనాన్ని విడుదల చేశారు. అనేక సాహిత్య పుస్తకాల్లో ఆమె కవితలు ప్రచురితమయ్యాయి. కథలు, వ్యాసాలు, హైకులు, గజల్స్, నానిలు లాంటివి అనేకం ఆమె కలంనుంచి జాలువారాయి. ఈ క్రమంలో ఆమె బాల్‌గీత్ పురస్కారాన్ని అందుకున్నారు. గతంలో సరోజినినాయుడు ఎక్స్‌లెన్సీ పురస్కారం, విజ్ఞాన జ్యోతి పురస్కారం, సాహితీ బృందావన జాతీయ వేదిక పురస్కారం, ఎస్‌టీవీ ఉగాది పురస్కారం, పర్యావరణ మిత్ర అవార్డు, వే ఫౌండేషన్ ద్వారా గురుబ్రహ్మ పురస్కారం, దీపారాధన పురస్కారం లాంటివి కూడా అందుకున్నాయి. త్వరంలో కరీంనగర్‌లోని ఉదయ సాహితీ ఆధ్వర్యంలో సినారే పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సినారె పురస్కారం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, దీని ద్వారా తన బాధ్యత మరింత పెరిగినట్లయిందన్నారు. ఇక అనురాధ నృత్య రవళి కళాక్షేత్రం ద్వారా అనేక నృత్య ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా కూడా వ్యవహరిస్తూ ప్రశంసలందుకుంటున్నారు.



పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ప్రొఫెసర్ రాజేశం



నూతనంగా ఎన్నికైన రాజేశం

కేయూ క్యాంపస్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ రెవెన్యూ కాలనీ పద్మశాలీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌సీపీడ్బ్యూఏ) నూతన అధ్యక్షుడిగా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ చింతకింది రాజేశం ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆర్‌సీపీడ్బ్యూఏ 19వ వార్షికోత్సవం జరిగింది. ఈసందర్భంగా రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న పాత కార్యవర్గం స్థానంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పత్తిపాక వెంకటయ్య, కూరపాటి వెంకటేశ్వర్లు, చిలగాని సత్యనారాయణలు వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ఉపాధ్యక్షులుగా కోట రవీందర్, జనరల్ సెక్రటరీగా దేవులపల్లి మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా కనుకుంట్ల శ్యాంప్రసాద్, కోశాధికారిగా కోట రమేశ్‌లు ఎంపికైయ్యారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గం ఆర్‌సీపీడ్బ్యూఏ వ్యవస్థాపకులు, సీనియర్ సభ్యులు కోట అంతయ్య, సిరికొండ జగన్నాథంలను శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు.

టీజీవోల డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



టీజీవోల డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవోస్)-2025 డైరీని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కలెక్టరేట్‌లోని టీజీవో భవన్‌లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టీజీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి రాజేష్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ మేన శ్రీను, రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు కోల రాజేష్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, టీజీవోస్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ట

మెట్టుగుట్టపై రుద్రహోమం

మడికొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని మెట్టుగుట్టపై రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో రుద్రాభిషేకం, రామాలయంలో విశేష అర్చనలు జరిపారు. అనంతరం లోక కల్యాణం కోసం దేవస్థానం ప్రాంగణంలో రుద్రహోమం చేశారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, ఎం జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏకశిల పాఠశాలల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

హసన్‌పర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంబర్తి ఏకశిల టెక్నో స్కూల్‌లో ఏకశిల గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా జేడీ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రుల కలలు, అవకాశాలు, ఆశలు, ఆశయాలకు నిలయాలు ఏకశిల విద్యా సంస్థలని కొనియాడారు. ప్రతి విద్యార్థి మూడు లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు తనను చూసి గర్వపడే స్థాయికి ఎదగాలని, తాను చదువుకున్న పాఠశాలకే ముఖ్య అతిథిగా రావాలని, తమ సంతకం ఆటో గ్రాఫ్‌గా మారాలన్నారు. తాము ఎంచుకున్న గమ్యాన్ని చేరుకునేవరకు అలసత్వాన్ని ప్రదర్శించరాదని తెలిపారు. అనంతరం పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన, సీబీఎస్ఈలో 475 పైగా సాధించిన విద్యార్థులకు ఏకశిల జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజా తిరుపతి రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, విద్యా సంస్థల హెచ్‌ఎంలు చిదురాల దినేష్ రెడ్డి, బేతి శైలజారెడ్డి, ముచ్చ స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిందే

▸▸ టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

వడ్డెపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిందేనని టీయూడబ్ల్యూజే(హెచ్-143)రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే(హెచ్-143) హనుమకొండ జిల్లా కమిటీ మొదటి కార్యవర్గ సమావేశం బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డెస్క్ జర్నలిస్టులను గుర్తించి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అక్రిడిటేషన్లు ఇప్పిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందని, ఒకవేళ అదే జరిగితే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తడక రాజనారాయణ మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక సాయం అందించి జర్నలిస్టులను ఆదుకున్న ఘనత మన యూనియన్‌కే దక్కిందన్నారు. యూనియన్ బలోపేతమైతే ప్రెస్‌క్లబ్‌లనుసులభంగా గెలుచుకోవచ్చని, అందుకు హనుమకొండ జిల్లా కమిటీ కృషి చేయాలని కోరారు. హనుమకొండ నగరంతో పాటు మండలాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధనే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరిపై పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన పిటిషన్‌ను ప్రెస్‌క్లబ్ కమిటీ వెనక్కి తీసుకొని వారి సభ్యత్వాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్, కోశాధికారి పొగాకుల ప్రభాకర్ గౌడ్, యూనియన్ అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు బూరం ప్రశాంత్, తాళ్లపల్లి వేణుగోపాల్, వీడియో జర్నలిస్టు ప్రధానకార్యదర్శి సుంచు రామరాజు, ఫొటో జర్నలిస్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొట్టె వెంకన్న, ప్రధాన కార్యదర్శి సంపెట సుధాకర్, యూనియన్ జిల్లా నాయకులు దుంపల పవన్, ఆరెల్లి కిరణ్, చింతల సత్యనారాయణ, దేవేందర్, గోకారపు శ్యామ్‌కుమార్, మైదం సుధాకర్, సిరిమల్లె సదానందం తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధాను సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ది ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ సహకరంతో 'అడ్వాన్సెంట్ ఇన్ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషిన్ లెర్నింగ్ అనే అంశంపై ఆన్‌లైన్ కార్యశాల ప్రారంభ సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జగన్మోహన్ రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్రంలోని స్టాట్స్, కాలిక్యులేటర్, ప్రాబబ్లిటీలు ప్రధాన భూమిక వహిస్తాయని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అధ్యాపకులు కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యశాలలో ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ మంచాల సదానందం, డాక్టర్ కె.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే బీసీలకు హక్కులు

▸▸ కులాలకతీతంగా యుద్ధభేరి సభకు రావాలి

▸▸ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండా ప్రకాష్, నాయకులు

బాలసముద్రం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పోరాటంతోనే బీసీలకు హక్కులు లభిస్తాయని, కులాలకతీతంగా బీసీలంతా రాజకీయ యుద్ధభేరి సభకు కదలి రావాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పిలుపునిచ్చారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఫిబ్రవరి 2న నిర్వహించే బీసీల రాజకీయ యుద్ధభేరి సభకు ముదిరాజ్‌లందరిని కదిలించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ముదిరాజ్ మహా సభ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ప్రకాష్ హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 76ఏళ్లు గడిచినా ఇంకా బీసీలు తమ ప్రాతినిధ్యం, ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఉండడం విచారకరమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు అందరికి కమిషన్లు, మంత్రిత్వ శాఖలు ఉన్నాయని బీసీలకు మాత్రం లేవన్నారు. సమాజంలో 2, 3 శాతం ఉన్న ఉన్నత వర్గాలకు 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఎంతవరకు న్యాయమన్నారు. ఈబీసీ రిజర్వేషన్ల అమలుతో బీసీలే నష్టపోతున్నారన్నారు. బీసీల అభ్యున్నతికి పాల్పడే పార్టీలనే ఆదరించాలని బండా ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ యుద్ధ భేరి సభకు ముదిరాజ్‌లు, మత్స్య పారిశ్రామిక సహకార సభ్యులంతా పాల్గొంటారని ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో ముదిరాజ్ మహాసభనాయకులు పల్లెబోయిన అశోక్, బయ్య స్వామి, పులి రజినీకాంత్, జోరుక సదయ్య, తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయాల్లో రాణించాలి

● యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజయ్య యాదవ్

వడ్డెపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బీసీలు రాజకీయాల్లో రాణించాలని బీసీ ఉద్యమ రాష్ట్రనేత, అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నేతలు ఎల్లావుల కుమార్‌యాదవ్, బొంగు రాజు యాదవ్, బంక సంపత్ యాదవ్, బుట్టి శ్యామ్ యాదవ్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో యాదవులు 20 శాతానికి పైగా ఉన్నారని రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం ఒక శాతానికి మాత్రమే పరిమితమయ్యారన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభ యాదవులతోపాటు బీసీ కులస్థులు రాజకీయాలకతీతంగా తరలి రావాలని కోరారు. సభ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, అఖిల భారత యాదవ మహా సభ ఉమ్మడి జిల్లా నాయకులు దొంగల చెన్నమల్లు, గండ్రకోట రాకేష్, సిద్ధిరాజు యాదవ్, మేకల కేదారి యాదవ్, బోయిని భిక్షపతి, ప్రమోద్, మేరుగు బాబురావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అనితారెడ్డికి సన్మానం

హసన్‌పర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ భీమారంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డిని బెస్ట్ సోషల్ ఆక్టివిస్ట్‌గా లయన్స్ క్లబ్ హనుమకొండ ప్రతినిధులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ లయన్స్ మెంబర్ మనోహర్ రావు, క్లబ్ మెంబర్ రవీందర్‌రావు మాట్లాడుతూ అనితారెడ్డి ప్రజలకు వందల సంఖ్యలో అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యవంతులను చేశారన్నారు. అలాగే అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు, మహిళలకు 30 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు బెస్ట్ సోషల్ ఆక్టివిస్టుగా గుర్తించి సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డిలో వన మహోత్సవం

హసన్‌పర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్‌విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ హితానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మహేందర్, కోఆర్డినేటర్ ఆర్.శశికుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ ఈ.సుదర్శన్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, గోవర్ధన్, ఏవో వేణు గోపాలస్వామి పాల్గొన్నారు.

ఏబీవీపీ నేతృత్వంలో క్రీడాపోటీలు

కేయూ క్యాంపస్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఖేల్‌రత్న భారత్ క్రీడోత్సవాల్లో భాగంగా సోమవారం కేయూ క్రీడా మైదానంలో ఏబీవీపీ నేతృత్వంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచర్ల రాంబాబు హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు సెల్‌ఫోన్ చోడో.. మైదాన్ చలో నినాదంతో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులను క్రీడా మైదానాల బాట పట్టిస్తున్నట్లు తెలిపారు. యువతలో నిషా విముక్తియే ఏబీవీపీ లక్ష్యమన్నారు. నేతాజీ, వివేకానందల అడుగు జాడల్లో యువత నడువాలన్నారు. దేశం సైన్యంలో కీలకంగా ఉండే పంజాబ్ రాష్ట్రంలో యువత మత్తులో కొట్టుమిట్టడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, అధ్యక్షుడు సాయికుమార్, గట్టు ప్రశాంత్, అంబాల కిరణ్, సంయుక్త కార్యదర్శి చట్ల సతీశ్, పూజ, ఎలేంద్ర, సాయిశ్రీ, శివప్రసాద్, అభి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పరిశీలన

వరంగల్ మెడికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును భారత ప్రభుత్వ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ గాంధీ గ్రామ్ తమిళనాడు బృంద సభ్యులు సోమవారం పరిశీలించారు. హనుమకొండలోని ధర్మసాగర్, ఉనికిచర్ల, పోచమ్మకుంట పీహెచ్‌సీలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శరవణ కుమార్‌లు పీఎంఎస్ఎంవై, ఈ ఔషధి, టీబీ ఇతర ఆరోగ్య కార్యక్రమాలు ఏ విధంగా అమలు అవుతున్నారో తెలుసుకోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు. 102, 108 ఆర్‌బీఎస్‌కే సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకొని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల పనితీరును అడిగి తెలుసుకొని, మందులు, ఇతర వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ అరవింద్, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప్తి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ శత వసంతాల సభను జయప్రదం చేయాలి

▸▸ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



రాంపూర్‌లో సీపీఐ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భిక్షపతి

మడికొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని హరిత హోటల్‌లో ఈనెల 29న నిర్వహించనున్న సీపీఐ శత సంవత్సరాల ప్రారంభ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లోని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు హనుమంతరావు స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోత్ శంకర్‌నాయక్, బొట్టు భిక్షపతి, మల్లయ్య, ఐలయ్య, ఉపేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మడికొండ నుంచి డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

▸▸ బల్దియా ఎదుట మడికొండ గ్రామస్థుల నిరసన



బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ 46వ డివిజన్‌లోని మడికొండ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని స్థానిక ప్రజలు సోమవారం బల్దియా ఎదుట ఆందోళన చేశారు. ఫ్లెక్సీతో కమిషనర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వరంగల్ నగరంలో సేకరించిన మొత్తం చెత్తతో పాటు జంతు కళేభరాలు, మెడికల్ వేస్టేజ్‌ని సేకరించి మడికొండలో డంప్ చేయడం వల్ల ప్రజలు పలు జబ్బులు సోకి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రధానంగా మడికొండ చుట్టుపక్కల ప్రాంతంలోనికడిపికొండ, రాంపూర్, ఎలుకుర్తి, అయోధ్యపురం, రొట్టబండ, ఇందిరమ్మ కాలనీ, సోమిడి గ్రామాలలో సాయంత్రం అయ్యిందంటే పొగతో కమ్ముకుని ఒకరికి ఒకరు కనిపించని పరిస్థితి ఉందని అన్నారు. కొంత సమయానికి నిరసనకారులను బల్దియా అధికారులు వచ్చి శాంతింప జేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, వినోద్‌కుమార్, వెంకట్రావ్, రంగారావు, నవీన్, విజయ్‌కుమార్, శైలజ, సుమలతలు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వడ్డెపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ మండలం మామునూరు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పల్లపు సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంత ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్ నుంచి పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన సంచార జాతులకు చెందిన కుటుంబాలు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం దయనీయమన్నారు. ప్రమాదంలో గాయపడిన ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సంచార జాతుల సంఘం జిల్లా నాయకులు పి.రాజేందర్, మురళి, కస్తూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

కాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 2న వరంగల్‌లో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధం భేరి సభను విజయవంతం చేయాలని గౌడ జేఏసీ నాయకులు కోరారు. కాజీపేట మీడియా పాయింట్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో గీత కార్మిక సంఘం అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, ఉమ్మడి వరంగల్ జేఏసీ చైర్మన్ బొనగాని యాదగిరి గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్, గట్టు నరేశ్ గౌడ్, మార్క రవిగౌడ్ మాట్లాడారు. బీసీ యుద్ధ భేరి సభకు గౌడ సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో చింత నమేశ్ గౌడ్, పులి మోహన్, బూర నరేందర్, బొల్లికొండ యాదగిరి, వడ్లకొండ రమేశ్, తీగల భారత్, వి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డుల అందజేత

కాజీపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలో సోమవారం 100 మందికి మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి సోమవారం లేబర్ కార్డులు అందజేసి మాట్లాడారు. కార్మికుల కోసం మూడు రోజులుగా వారి వివరాలు నమోదు చేసుకుని లేబర్‌కార్డులు అందజేశామన్నారు. కార్మికులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మునిపల్లికి చెందిన 23 మంది క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలందించాలని ఎంజీఎం వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట ఆత్మకూరు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నేదునూరి సునీల్, రాంరెడ్డి, ఏరుకొండ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యాన్ని ఆదరించాలి

▸▸ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

వడ్డెపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలం నాటి ఆక్యుపంక్చర్ వైద్యాన్ని ప్రజలు ఆదరించాలని వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ - 303, ఎంజీఎఫ్ వరంగల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో తన్వీ నేచురోపతి వైద్యులు ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు మేయర్ గుండు సుధారాణి శిబిరాన్ని సందర్శించారు. ఆక్యుపంక్చర్ వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ వైద్యులు అనిల్‌కుమార్, తన్వీ నేచురోపతి క్లినిక్ వ్యవస్థాపకుడు డాక్టర్ కందగట్ల అన్వేష్, ఆక్యుపంక్చర్ థెరపిస్టులు రబ్బాని, దుర్గాప్రసాద్, సుమలత, జగదీశ్వరి, ప్రభాకర్, సీతామహలక్ష్మి, ఉమాపతి, అనూష, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తడక కుమారస్వామి, కూరాకుల భారతి, గాంధీ పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

కేయూ క్యాంపస్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలను నమ్ముకుని పని చేస్తున్న తమకు సరైన న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కేయూ కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల గేటు ఎదుట వర్సిటీ కోఆర్డినేషన్ కమిటీ నేతలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్నివర్సిటీల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారని, తమకు న్యాయం చేయాలని అన్నారు. తమకు పే స్కేల్‌ను అమలు చేస్తూ రెగ్యులరైజేషన్ చేపట్టాలని అన్నారు. గతంలో ప్రభుత్వం తమకు సరైన న్యాయం చేయలేదన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో తమంత పనిచేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాధు రాజేశ్, డాక్టర్ బి.సతీశ్, జూల సత్య, సీహెచ్.నాగేశ్వర్‌రావు, రఘువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, సూర్యనారాయణ, వెంకటగోపీనాథ్, రంజిత్, తూర్పాటి వెంకటేశ్, వీణ, సాహితీ, దీప్తి, స్వప్న వాణిశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మిక సమస్యలపై బీఎంఎస్ పోరాటం

కేయూ క్యాంపస్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మిక సమస్యలపై బీఎంఎస్ పోరాటం చేస్తోందని బీఎంఎస్ రాష్ట్ర సంఘటన మంత్రి జే.రామ్మోహన్‌జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జి-445 భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం యూనియన్ డైరీ-2025 ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైరీని ఆవిష్కరించారు. సమావేశంలో సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, అధ్యక్షుడు గొర్ల రవీందర్, రావుల రమణారెడ్డి, గాదె మహేందర్, ఎస్పీడీసీఎల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, వరదరాజు, కవికుమార్, నర్సింహులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చెట్టు నరికివేసినందుకు జరిమానా

వరంగల్ కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బల్దియా ఉద్యానవన శాఖ(హార్టికల్చర్) అధికారుల అనుమతి లేకుండా నగరంలో చెట్టును కొట్టినందుకు బల్దియా అధికారులు సీరియస్ అయ్యారు. హనుమకొండ 30వ డివిజన్ బాలసముద్రం సైకిల్ పార్క్‌లోని చెట్టును నరికినందుకు బల్దియా అధికారులు రూ.10 వేల జరిమానా విధించి రసీదును అందించారు. బల్దియా చీఫ్ హార్టికల్చర్ అధికారి పలాస రమేష్ తెలిపిన ప్రకారం.. బాలసముద్రం సైకిల్ పార్క్ ప్రాంతంలో మహేందర్ అనే వ్యక్తి నివాసం ఉంది. పార్క్‌లో చెట్టు కొమ్మలు మహేందర్ ఇంటి ముందుకు రావడంతో అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రత్యేక మిషన్ ద్వారా చెట్టును మొదటికి నరికి ట్రాక్టర్‌లో తరలించే ప్రయత్నం చేశాడు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో విషయాన్ని కమిషనర్‌కు వెల్లడించాం. కమిషనర్ ఆదేశాల మేరకు మహేందర్‌కు రూ.10వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో మరో దందా

▸▸ హత్యాయత్నం కేసును రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

▸▸ శిక్ష తప్పించుకున్న నిందితుడు



మాట్లాడుతున్న బాధితుడు

వరంగల్ మెడికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్రైవేట్ ఆస్పత్రుల దారుణాలు క్రమంగా పెరుగుతున్నాయి. నిందితులతో చేతులు కలిపి తమ ఆస్పత్రిలో చేరిన హత్యాయత్నం కేసు బాధితుడిని దారుణంగా మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. హనుమకొండ జిల్లా వంగపహాడ్ గ్రామానికి చెందిన ఎస్.ప్రశాంత్ కుమార్ 2022 జనవరి 20న రాత్రి 11 గంటలకు హత్యాయత్నానికి గురై అప్పటి మాక్స్‌కేర్‌కు చేరుకున్నారు. 2022 జనవరి 22న సర్జరీ నిర్వహించి, 2022 జనవరి 24 రాత్రి 9 గంటలకు డిశ్చార్జ్ చేశారు.హత్యాయత్నానికి గురై చికిత్స అందించిన రోగికి డిశ్చార్జ్ సమ్మరీ ఇచ్చి ఇంటికి పంపారు. ఆ తర్వాత నిందితులతో చేతులు కలిపి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గాయాలకు చికిత్స చేశామని ధృవీకరించారు. నిందితులు ఈ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించడం వల్ల శిక్ష నుంచి తప్పించుకున్నారు.

వాస్తవం గుర్తించే నాటికి కేసు కొట్టివేశారు..

వాస్తవం గుర్తించిన బాధితుడు ఈ విషయంపై హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖఅధికారికి ఫిర్యాదుచేశారు. అయినా పట్టించుకోకపోవడంతో సోమవారం ఉదయం ఏకశిల ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. నిందితులకు సహకరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారం

వెన్నకు బదులుగా...

పరాఠా, చపాతీ, బ్రెడ్... వీటికి వెన్నను జోడించి తినడం మన అలవాటు. అయితే వెన్నతో పెరిగే కొలెస్ట్రాల్ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే, వెన్నకు ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. అందుకోసం...

ఆలివ్ ఆయిల్

గుండె ఆరోగ్యాన్ని పెంచే ఆలివ్ నూనె వెన్నకు చక్కని ప్రత్యామ్నాయం. ప్రత్యేకించి వంటల్లో, బేకింగ్‌లో ఈ నూనెను నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా దొరికే ఆలివ్ నూనె గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ నూనెను సలాడ్స్, బేకింగ్ కోసం వాడుకోవచ్చు. వెన్నను ఉపయోగించి వండే వంటకాల కోసం ఒక కప్పు వెన్నకు బదులుగా 3/4 కప్పు ఆలివ్ నూనెను వాడుకోవచ్చు.

కొబ్బరినూనె

కొబ్బరి నూనె బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆకృతిలో వెన్నను అనుకరిస్తుంది. దీన్ని వెన్నలా వాడుకోవచ్చు. బ్రెడ్ మీద పూసుకుని తినొచ్చు. వెన్నతో సమాన పరిమాణాల్లో బేక్ చేసే వంటకాల్లో వాడుకోవచ్చు. అయితే కొబ్బరి సువాసన చెక్కుచెదరకుండా ఉండడం కోసం రిఫైన్ చేయని కొబ్బరినూనెను వాడుకోవాలి.



అవకాడొ

పోషకభరిత వెన్నకు అద్భుతమైన ప్రత్యామ్నాయం.. అవకాడొ. గుండెకు మేలు చేసే మోనోశాచురేటెడ్ కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు దీన్లో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వెన్నకు బదులుగా అవకాడొను గుజ్జును చేసి టోస్ట్‌ల మీద స్ప్రెడ్‌గా వాడుకోవచ్చు. అలాగే బ్రౌనీలు, మఫిన్ల తయారీలో కూడా వెన్నకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు.

నట్ బటర్స్


బాదం, వేరుశనగ, జీడిపప్పు బటర్స్ కూడా మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. ఇవి కూడా వెన్న లాంటి ఆకృతినే కలిగి ఉండి, రుచికరమైన, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. వీటిలోని విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పరిపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. కాబట్టి స్మూదీలు, బిస్కెట్ల బేకింగ్‌లలో నట్ బటర్స్ నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

ఆరోగ్యం ఆనందం

కొలెస్ట్రాల్‌ను ఇలా నియంత్రిద్దాం


మనం రోజును ఎలా మొదలుపెడుతున్నామనేదాని మీదే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కొన్ని అలవాట్లు మన రక్తంలోని కొలెస్ట్రాల్ మోతాదులను నియంత్రణలో ఉంచుతాయి. అవేంటో తెలుసుకుందాం!

- నిమ్మ రసంతో: రోజును గోరువెచ్చని నిమ్మరసంతో మొదలుపెట్టాలి. ఈ నటితో కొవ్వులు కరగడం మొదలుపెడతాయి. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు కలిగిన నిమ్మరసం చెడు కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గించి, గుండె రక్తనాళాల్లో అవరోధాలు ఏర్పడకుండా సహాయపడుతుంది. నిమ్మరసం తాగడం వల్ల రోజంతా శరీరంలో నీటి పరిమాణం తగ్గిపోకుండా ఉంటుంది.



- పీచు పదార్థం: ఉదయం తీసుకునే అల్పాహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఓట్స్, షియా విత్తనాలు, యాపిల్స్, అరటి పండ్లు, ఆహారంలోని కొలెస్ట్రాల్‌ను శరీరం శోషించుకోకుండా నిలువరిస్తాయి. ఈ అలవాటులో చెడు కొలెస్ట్రాల్ శోషణ తగ్గడంతో పాటు, ఎక్కువ సమయం పాటు ఆకలి వేయకుండా ఉంటుంది. ఫలితంగా బరువు కూడా అదుపులో ఉంటుంది.
- నట్స్: ఉదయం, గుప్పెడు బాదం, వాల్‌నట్స్ అవిసెగింజలను తీసుకోవడం ఆరోగ్యకరం. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు అత్యధిక సాంద్రతతో కూడిన లైపోప్రొటీన్ కొలెస్ట్రాల్‌ను మెరుగుపరుస్తాయి. అదే సమయంలో చెడు కొలెస్ట్రాల్‌ను కుంటుపరుస్తాయి. అయితే అధిక క్యాలరీలు కలిగి ఉండే ఈ నట్స్‌ను పరిమితంగానే తీసుకోవాలి.
- ఒత్తిడి కొలెస్ట్రాల్ మీద దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించే ధ్యానం, యోగా ఉదయాన్నే సాధన చేయాలి. కొన్ని నిమిషాల ధ్యానం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్పష్టతను సమకూరుస్తుంది. అలాగే శ్వాస వ్యాయామాలకు కూడా ఉదయాన్నే కేటాయించాలి.
- ఉదయం తీసుకునే అల్పాహారంలో మాంసకృత్తులు, పీచు ఎక్కువగా పిండి పదార్థాలు, కొవ్వులు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకూ తీపికి దూరంగా ఉండాలి. పరగడుపున, కాఫీ, టీలకు బదులుగా గోరువెచ్చని నీళ్లు తాగాలి.

(జనవరి - థైరాయిడ్ అవగాహనా మాసం)



మొండికేసే థైరాయిడ్ గ్రంథి మహిళల గర్భధారణకు అడ్డు పడడంతో పాటు, గర్భంలో పెరిగే బిడ్డ ఆరోగ్యాన్ని కూడా అతలాకుతలం చేస్తుంది. ఆ గ్రంథి పనితీరును గాడిలో పెట్టుకుంటూ, థైరాయిడ్ సమస్యలతో మెరుగైన జీవితాన్ని ఎలా కొనసాగించాలో వైద్యులు వివరిస్తున్నారు.

థైరాయిడ్‌తో తంటా ఎందుకు?

థైరాయిడ్‌ను ఒక భూతంగా పరిగణించవలసిన అవసరం లేదు. స్థూలకాయం, మధుమేహం మొదలైన జీవనశైలి రుగ్మతలతో పోల్చుకుంటే థైరాయిడ్ సమస్యను చికిత్సతో అదుపులో పెట్టుకోవడం అత్యంత సులభం. థైరాయిడ్ గ్రంథి అవసరానికి తగ్గట్టు పని చేయకపోయినా, లేదా అవసరానికి మించి పని చేసినా ఆ ప్రభావం శరీరం మీద పడుతుంది. కాబట్టి గ్రంథి పనితీరును పరీక్షలతో కనిపెట్టి, మందులతో హార్మోన్ స్రావాన్ని సమంగా ఉంచుకుంటే ఇతరత్రా ఆరోగ్య సమస్యలూ, ప్రధానంగా గర్భధారణ సమస్యలను అధిగమించవచ్చు. మునుపటితో పోల్చుకుంటే ప్రస్తుతం థైరాయిడ్ సమస్యలు పెరిగాయనే చెప్పవచ్చు. ఇందుకు జీవన, ఆహార శైలులతో పాటు ఒత్తిడి కూడా కారణమే! కుటుంబ చరిత్రలో థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు కూడా పిల్లలకు సంక్రమించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

లక్షణాలు సుస్పష్టం

థైరాయిడ్ సమస్య లక్షణాలు అమ్మాయిల్లో ఎంతో స్పష్టంగా కనిపిస్తాయి. అవేంటంటే...

- భావోద్వేగాలు అదుపు తప్పడం
- నెలసరి క్రమం తప్పడం
- నెలసరి స్రావం పెరగడం, తరగడం
- బరువు పెరగడం
- నిస్సత్తువ, అలసట ఆవరించడం
- దిగులు, విచారం
- చలి, వేడి... రెండిటినీ తట్టుకోలేకపోవడం
- శరీర వణుకు
- గుండె వేగం పెరగడం
- కండరాల నొప్పులు
- చర్మం పొడిబారిపోవడం

అధిక బరువుతో హైపోథైరాయిడ్

థైరాయిడ్ గ్రంథి సామర్థ్యం తగ్గిపోయి, హార్మోన్ స్రావం కుంటుపడే హైపోథైరాయిడ్ సమస్య ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. అధిక శరీర బరువే ఇందుకు ప్రధాన కారణం. అస్తవ్యస్థ ఆహారపుటలవాట్ల ఫలితంగా శరీర బరువు అదుపు తప్పినప్పుడు, థైరాయిడ్ గ్రంథి పనితీరు కూడా క్రమం తప్పుతుంది. కాబట్టి గర్భం దాల్చాలనుకున్నప్పుడు, గర్భం దాల్చిన తర్వాత, రక్తంలో హిమోగ్లోబిన్‌ను పరీక్షించినట్టే, థైరాయిడ్ గ్రంథి పనితీరును కూడా పరీక్షించవలసిన అవసరం ఉంటుంది. గర్భధారణ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకుని, సమస్యకు తగిన మందులు వాడుకోవాలి. హార్మోన్ స్రావం తగ్గిన వాళ్లు మాత్రల రూపంలో థైరాయిడ్ హార్మోన్‌ను తీసుకోవాలి. హార్మోన్ అవసరానికి మించి స్రవించే హైపర్‌థైరాయిడ్ సమస్య ఉన్నవాళ్లు గ్రంథి పనితీరును మందగించేలా చేసే మాత్రలు వాడుకోవాలి.

> **మాత్ర పరగడుపునే...**
>
> **గర్భిణులైనా, సాధారణ మహిళలైనా థైరాయిడ్ మాత్రలను పరగడుపునే వేసుకోవాలి. ఐరన్, అధిక రక్తపోటు, మధుమేహం మొదలైన మాత్రలు వాడుకుంటున్నవాళ్లు థైరాయిడ్ మాత్ర వేసుకున్న ఈ మాత్ర వేసుకున్న నాలుగు గంటల తర్వాత మాత్రమే వేసుకోవాలి. ఇలా మాత్రలకు ఎడం పాటించడం వల్ల థైరాయిడ్ మాత్రను శరీరం సంపూర్తిగా శోషించుకోగలుగుతుంది.**

శరీర సక్రమ జీవక్రియలకు కీలకం

మన శరీరంలోని అవయవాలన్నిటి పనితీరును నియం



త్రించడం థైరాయిడ్ హార్మోన్ ప్రధాన బాధ్యత. ఈ గ్రంథి నుంచి హార్మోన్ సరైన మోతాదులో విడుదలవుతున్నంత కాలం ఆయా అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. హార్మోన్ స్రావం తగ్గితే, అవయవాల సామర్థ్యాలు, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే సామర్థ్యాలు కూడా తగ్గుతాయి. కాబట్టే థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు బరువు పెరగడం, నిస్సత్తువ ఆవరించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. హైపర్ థైరాయిడిజంలో హార్మోన్స్ ఎక్కువగా విడుదలవుతాయి. దాంతో శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరిగి మిగతా అవయవాలన్నీ అవసరానికి మించి పని చేయడం మొదలుపెడతాయి. దాంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. చేతుల్లో వణుకు, కళ్లు పెద్దగా విప్పారడం, బరువు తగ్గిపోవడం, ఆందోళన లాంటి లక్షణాలు మొదలవుతాయి.

పిండం మెదడు ప్రభావితం

గర్భంలో పెరిగే బిడ్డ మెదడు ఎదుగుదలలో థైరాయిడ్ హార్మోన్ కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి గర్భం దాల్చిన తొలి త్రైమాసికంలోనే గర్భిణుల్లో థైరాయిడ్ గ్రంథి పనితీరును పరీక్షించాల్సి ఉంటుంది. గర్భిణుల్లో హైపో లేదా హైపర్ ఈ రెండు థైరాయిడ్ సమస్యల్లో ఏ ఒక్కటి ఉన్నా, గర్భంలో పెరిగే బిడ్డ మీద ప్రభావం పడి, ప్రసవం తర్వాత బిడ్డ పాలు తాగలేకపోవడం, బరువు పెరగడంలో ఇబ్బందులు ఎదురవడం, నిద్ర సమస్యలు, బిడ్డ శరీరంలోని మృదువైన ప్రదేశాలు గట్టిపడకపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి గర్భం దాల్చినప్పటి నుంచి మూడో నెల నిండేవరకూ ప్రతి నాలుగు నుంచి ఆరు వారాలకూ వైద్యుల పర్యవేక్షణలో థైరాయిడ్ పరీక్షలు చేయించుకుంటూ హార్మోన్ స్రావాన్ని కనిపెడుతూ ఉండాలి. అలాగే గర్భిణుల్లో మాయ నుంచి విడుదలయ్యే

> **క్యాబేజీ, కాలీఫ్లవర్ తినడం మానేయడం మంచిది. అలాగే అయొడిన్ కలిగి ఉన్న పదార్థాలు ఎక్కువగా తినాలి. పాలు, సముద్రాహారం, పాలు, పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవాలి.**

ప్లాసెంటల్ కొరియానిక్ హార్మోన్, థైరాయిడ్ హార్మోన్‌కు దగ్గరగా ఉంటుంది. దాంతో గర్భిణుల్లో థైరాయిడ్ హార్మోన్ మోతాదులు పెరిగినట్టు తప్పుగా నిర్ధారణ అవుతూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పరీక్షలతో హార్మోన్ మోతాదులను క్రమం తప్పకుండా అంచనా వేస్తూ, వైద్యుల సూచన మేరకు మాత్రలు వాడుకోవాలి. అలాగే నెలలు గడిచేకొద్దీ గర్భంలో పెరిగే బిడ్డ థైరాయిడ్ హార్మోన్ అవసరత కూడా పెరుగుతూ ఉంటుంది. తల్లి నుంచి పిండం తనకు సరిపడా థైరాయిడ్ హార్మోన్‌ను గ్రహిస్తూ ఉంటుంది. కాబట్టి గర్భిణిలో ఆ డిమాండ్‌కు సరిపడా హార్మోన్ తయారవుతూ ఉండాలి. కాబట్టిప్రతి నాలుగు వారాలకు రక్తపరీక్షతో ఈ హార్మోన్ మోతాదును గమనించుకుంటూ అవసరాన్ని బట్టి గర్భిణి సప్లిమెంట్స్ వాడుకోవాల్సి ఉంటుంది.

పరీక్షలు ఎప్పుడు?

శరీర పనితీరు, శక్తిని ఖర్చు చేసుకునే తత్వం, అధిక బరువు, ఒత్తిడి లోనయ్యే సందర్భాలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు... ఇలా వేర్వేరు కారణాల వల్ల శరీరంలో థైరాయిడ్ హార్మోన్ స్రావంలో హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చు. ఇలా ఈ గ్రంథి స్రావం అస్తవ్యస్థంగా మారినప్పుడు, దాన్ని గాడిలో పెట్టే చికిత్స తీసుకోక తప్పదు. ఒకసారి హైపో లేదా హైపర్ థైరాయిడిజం నిర్ధారణ అయిన వారు ప్రారంభంలో ప్రతి మూడు నెలలకూ, ఆ తర్వాత ప్రతి ఆరు నెలలకూ పరీక్ష చేయించుకుంటూ గ్రంథి పనితీరును గమనించుకుంటూ ఉండాలి.

అడ్డుకట్ట ఇలా...

థైరాయిడ్ గ్రంథి సక్రమ పనితీరు మనం తీసుకునే అయొడిన్ మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అయొడిన్ పుష్కలంగా దొరికే చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, అయొడిన్ కలిపిన ఉప్పు, నూనె తీసుకోవాలి.

డాక్టర్ సుభాషిణి
కన్సల్టెంట్ అబ్‌స్ట్రెటీషియన్,
ఫెర్నాండెజ్ హాస్పిటల్,
హైదరాబాద్



ధ్యానం.. ప్రశాంతతకు మార్గం

ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సహజం. ఫలితంగా చిరాకు, విసుగు, అనాసక్తత ఆవరించి జీవన నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి వీటిని వదిలించుకోవాలంటే మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలి. ఇందుకు అనువైన మార్గం 'ధ్యానం'!

ధ్యానం అనేది కదలికలతో కూడుకున్న వ్యాయామం, కార్యక్రమం, చర్య కాదు. మనసు పెట్టి చేయవలసిన క్లిష్టమైన పని అంతకన్నా కాదు. అదొక విశ్రాంత స్థితి. నిద్రను మించిన లోతైన నిద్రావస్థ స్థితి. ఈ స్థితిలో మనసు స్థిరంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడులు, ఆందోళనలు తొలిగి మనసు నిర్మలమవుతుంది. ఆ స్థితికి చేరుకోవడాన్నే 'ధ్యానం' అంటారు. ఆ స్థితికి చేరుకోవడం అంత తేలిక కాదు. మనసులో చెలరేగే ఆలోచనలను ఆపలేని నిస్సహాయులం మనం. ఆలోచనల సంకెళ్లు మన మనసును స్థిమితంగా ఉండనివ్వవు. కాబట్టి ధ్యాన స్థితికి చేరుకోవలంటే మనసులో చెలరేగే ఆలోచనలను బంధించే సహనం, సాధన అవసరం.

ధ్యాన స్థితికి ఎందుకు చేరుకోలేం?

ధ్యానం ప్రారంభించిన మొదట్లో ముందుకు వెళ్లలేకపోతున్న భావన కలగడం సహజం. ఇందుకు కారణం ధ్యానం మీద మనసు లగ్నం కాకపోవడమే! అయితే ధ్యానంలోకి చేరుకోవడానికంటే ముందు రెండు అంశాలను అర్థం చేసుకోవాలి. మన మనసు రెండు పనులు చేస్తూ ఉంటుంది. మొదటిది 'గ్రహింపు', రెండవది 'ఆచరింపు'. ధ్యానంలో ఆచరింపు అనే అంశాన్ని నెమ్మదింపజేసి, గ్రహింపును ఉత్తేజితంగా ఉంచాలి. గాఢమైన నిద్రావస్థ ధ్యాన స్థితికి చేరుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

సన్నద్ధం: ధ్యానం చేయడం కంటే అందుకు సన్నద్ధమవడం కష్టం. అయితే ధ్యానానికి ముందు అందుకు మనసు, శరీరాలను సిద్ధం చేయడం వల్ల ధ్యానం తేలికవుతుంది అని నిపుణులు చెబుతారు.

ఊపిరి, శరీరాలను నెమ్మదించాలి: శ్వాస, మనసు, శరీరం అంతర్గతంగా ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. శరీరాన్ని విశ్రాంతంగా ఉంచి, శ్వాసను నెమ్మదింపజేస్తే, మనసూ నిశ్చలంగా మారుతుంది. ఈ స్థితిలో నాడీ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది. ఫలితంగా ఒత్తిడి తగ్గడం మొదలవుతుంది.

ధ్యానం తేలికగా: ధ్యాన ముద్రలో కూర్చుని 5 సార్లు ఊపిరి పీల్చి వదలాలి. ముక్కుతో గాలి లోపలికి పీల్చుకుని, నోటి ద్వారా బయటకు వదలాలి. ఊపిరి లోతుగా, దీర్ఘంగా కొనసాగాలి. ఊపిరి పీల్చుకునే



సమయంలో వర్తమానంతో కూడిన స్పృహ కలిగి ఉండాలి. ఊపిరి బయటకు వదిలేటప్పుడు కండరాలన్నిటినీ రిలాక్స్ చేయాలి. ఆ సమయంలోనే ఒత్తిడిలు, ఆందోళనలు బయటకు వెళ్లిపోతున్న భావన కలగాలి. ఇలా చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా నాలుక, దవడ, కంఠం, నుదుటి మీద మనసు పెట్టాలి.

సక్రమ పద్ధతి: ధ్యానానికి ముందు కొన్ని యోగాసనాలు వేసి శరీరాన్ని తేలికపరచవచ్చు. ధ్యానానికి ఉపకరించే ఆసనాలు... శేతుబంధాసనం, ధనురాసనం, బాలాసనం, అధోముఖ శవాసనం, అర్థ మత్స్యేంద్రాసనం, ఉత్తనాసనం, శుప్త మత్స్యేంద్రాసనం, పద్మాసనం, శవాసనం. ఈ ఆసనాలు వేసే సమయంలో ఊపిరి పీల్చుకున్నదానికంటే ఎక్కువ సమయంపాటు బయటకు వదలాలి అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నెమ్మదిగా సాగాలి.

మనసు ఆనందంగా: బాధను మరిచి, ఆనందాన్ని సొంతం చేసుకోవడమే మన మెదడు ప్రధాన ధ్యేయం. ధ్యానం చేసే సమయంలో కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాలి. అంతా సవ్యంగానే ఉందనే భావన మనసులో నింపుకుంటే ధ్యానంలోకి పయనం సాధ్యపడుతుంది. అందుకోసం మీ జీవితంలో జరిగిన మంచి విషయాలను మననం చేసుకోవాలి. అంతా మంచే జరుగుతుందన్న సంతుష్టకరమైన భావన మనసులో నింపుకోవాలి. ధ్యానం కోసం నిశ్శబ్దమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి.

కోరిక బలంగా: ధ్యానం ఎందుకు చేయదలచుకున్నారో, ఎలాంటి ఫలితం కోరుకుంటున్నారో జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ధ్యానానికి ముందు ఇలాంటి లోతైన ఆలోచన ధ్యానబలాన్ని పెంచుతుంది.

ఉన్నది ఉన్నట్టు స్వీకరించాలి: ప్రారంభంలో మనసులో ఆలోచనలు చెలరేగి ధ్యానానికి భంగం కలగవచ్చు. ఆ సమయంలో మిమ్మల్ని మీరు విమర్శించుకోకుండా ఆ ఆలోచనలను అంగీకరించి, వాటిని దూరం చేసుకోవడం మీద పట్టు సాధించాలి. ఉన్నది ఉన్నట్టు స్వీకరించి మెరుగైన ధ్యానం కోసం ఆలోచనల మీద పట్టు సాధించాలి.

ఏకాగ్రతను అభినందించాలి: ఏదైనా వస్తువును ఉపయోగిస్తే మనసు లగ్నమవడం తేలికవుతుంది. అలా చేయడం పొరపాటు కాదు. మనసు కేంద్రీకృతమయ్యేవరకూ ఏ వస్తువు మీదైనా మనసు లగ్నం చేయవచ్చు. అయితే ఆ సమయంలో మనసులో చోటుచేసుకునే నెమ్మదితనాన్ని గమనించాలి. ఏకాగ్రత కోసం మనసుకు శిక్షణ ఇచ్చే సమయంలోనే ఆనందాన్ని గ్రహించేలా కూడా మనసు శిక్షణ పొందుతుంది. కాబట్టి ధ్యానంలో పట్టు సాధించడం కోసం ఏదైనా వస్తువును ఉపయోగించు కోవచ్చు. అయితే అది వెలుగు విరజిమ్మేలా ఉండాలి.

మీకు తెలుసా?

రోజూ కొబ్బరినూనె తీసుకొంటే...

కీటో డైట్‌లో కొబ్బరినూనె ప్రధాన పాత్ర పోషిస్తుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఈ డైట్‌ను అనుసరించలేని వాళ్లు కొబ్బరినూనెతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే ప్రతి రోజూ ఒక టీస్పూను కొబ్బరినూనె తీసుకోవచ్చు. కొబ్బరి నూనె ఎందుకంటే...

- కొబ్బరినూనెలో మీడియం చైన్ ట్రైగ్లిసరైడ్స్ ఉంటాయి. వీటిలో శక్తి వేగంగా ఖర్చవడంతో పాటు, కొవ్వు కూడా త్వరితంగా కరుగుతుంది
- పేగుల్లోని హానికారక బ్యాక్టీరియాను సంహరించి, పోషక శోషణను పెంచి, పేగుల ఆరోగ్యాన్ని పెంచే శక్తి కొబ్బరినూనెకు ఉంటుంది
- చర్మం తేమతో, మెరుపులీనుతూ ఉండడానికి అవసరమైన కొవ్వులు కొబ్బరి నూనెలో ఉంటాయి.



- కొబ్బరినూనెలోని మీడియం చైన్ ట్రైగ్లిసరైడ్స్ మెదడు చురుకుదనాన్ని పెంచుతాయి. దాంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో యాంటీబ్యాక్టీరియాల్ గుణాలు కలిగిన లారిక్ యాసిడ్ ఇన్‌ఫెక్షన్లతో పోరాడుతుంది.
- ఆకలిని తగ్గించి, కడుపు నిండిన భావనకు లోను చేసి, అవసరానికి మించిన ఆహారం జోలికి వెళ్లకుండా నియంత్రిస్తుంది. ఫలితంగా అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకోకుండా ఉంటాయి.

పోషకం

మెగ్నీషియం మతలబులు

ఇటీవలి కాలంలో మెగ్నీషియం లోపం సర్వత్రా పెరిగింది. ఈ పోషకం ఎన్నో కీలకమైన జీవ క్రియలకు సహాయపడుతూ ఉంటుంది. కండర సామర్థ్యం, అధిక రక్తపోటు, నిద్రల్లో కీలక భూమిక పోషించే మెగ్నీషియం లోపాన్ని ఎలా భర్తీ చేసుకోవచ్చో తెలుసుకుందాం!

- క్యాల్షియం, జింక్, క్యాల్షియంలతో కలిపి తీసుకుంటే మెగ్నీషియం శోషణ తగ్గి, దాని సామర్థ్యం తగ్గుతుంది. కాబట్టి మెగ్నీషియంను ఈ సప్లిమెంట్లతో కలిపి తీసుకోకూడదు
- పుల్లని పండ్లలో సిట్రిక్ యాసిడ్‌తో కలిసిన మెగ్నీషియం ఉంటుంది. కాబట్టి మెగ్నీషియం లోపాన్ని భర్తీ చేసుకోవడం కోసం పుల్లని పండ్లను తినొచ్చు.
- ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది.
- నట్స్, సీడ్స్, పొట్టుతీయని ధాన్యాలు, చేపల్లో కూడా ఈ పోషకం ఎక్కువగా ఉంటుంది
- జీడిపప్పు, బాదం, గుమ్మడికాయ విత్తనాలు, పీనట్ బటర్ బీన్స్, సోయా బీన్స్, సోయా పాలతో కూడా మెగ్నీషియంను సరిపడా పొందవచ్చు.
- మెగ్నీషియం ల్యాక్సేటివ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి మోతాదు పెరిగితే విరోచనాలు వేధిస్తాయి. కాబట్టి వైద్యుల సూచన మేరకు సప్లిమెంట్లు కూడా వాడుకోవచ్చు



తుమ్మిడిహెట్టి వద్ద.. నీటి లభ్యత ఉన్నా లేనట్లుగా ప్రచారం

- 65 ఏళ్ల లెక్కలు చూస్తే ఏటా 255 టీఎంసీల లభ్యత
- బీఆర్ఎస్ నేత వి.ప్రకాశ్ తప్పుడు లెక్కలు చెప్పారు
- మీడియాతో విద్యుత్తు జేఏసీ నేత రఘు వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అవకతవకతలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విద్యుత్తు జేఏసీ నేత కంచర్ల రఘు సోమవారం క్రాస్ ఎగ్జావిఎనేషన్‌కు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద 65 శాతం డిపెండబులిటీ మేరకు (వందేళ్లలో 65 ఏళ్లలో కచ్చితంగా వచ్చే వరద ఆధారంగా) ఏటా 255 టీఎంసీలు, 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా 165 టీఎంసీల నీటి లభ్యత ఉందన్నారు. అబద్ధాలు ప్రచారం చేసి, బ్యారేజీ ప్రదేశాన్ని మార్చి మేడిగడ్డ వద్ద నిర్మాణం చేపట్టారని ఆక్షేపించారు. 165 టీఎంసీల లభ్యత ఉందంటూ కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) 2015 మార్చి 4న లేఖ ఇచ్చిన సంగతిని గుర్తుచేశారు. తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే.. 19 మీటర్లు ఎత్తిపోయడం ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు చేరేవని, ఏటా విద్యుత్తు ఖర్చు రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్లు మాత్రమే అయ్యేదని వివరించారు. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల 6 రెట్లు ఎక్కువగా 123 మీటర్ల ఎత్తుకు పంపింగ్‌తో విద్యుత్ ఖర్చులు 6 రెట్లు పెరిగి రూ.వేల కోట్ల భారం పడుతోందని రఘు పేర్కొన్నారు. నాలుగేళ్లలో ఏటా 50 టీఎంసీలను కూడా పంపింగ్ చేయలేదని తప్పుబట్టారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత విషయంలో కమిషన్‌ను తప్పుదోవ పట్టించానంటూ తనపై బీఆర్ఎస్ నేత, నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ చేసిన ఆరోపణలను రఘు తోసిపుచ్చారు. మేడిగడ్డ-ఎల్లంపల్లి మధ్య ఆయకట్టు లేకపోవడంతో ప్రత్యేక ప్రయోజనం లేకుండా పోయిందని, వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్దనే కడితే.. తక్కువ ఖర్చుతో నీరివ్వొచ్చని, ఆదిలాబాద్ జిల్లాలో సైతం 2 లక్షల ఎకరాలకు నీరిచ్చే వీలుండేదని రఘు వివరించారు. కేవలం 15 టీఎంసీల కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు పెట్టి, కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులు చేపట్టారని రఘు విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణ స్థలాలు సరైనవి కావని సీడబ్ల్యూసీ ఆధారాలతో సహా నివేదించిందని రఘు తెలిపారు. అఫిడవిట్‌లోని సమాచారాన్ని, డాక్యుమెంట్లను సాక్ష్యాలుగా రికార్డులోకి తీసుకుంటామని రఘుకు కమిషన్ తెలియజేసింది.


మాట్లాడుతున్న విద్యుత్తు జేఏసీ నేత రఘు

జీవో 46పై నెలరోజుల్లో వివరణ ఇవ్వండి

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాల్లో స్థానిక- స్థానికేతర అంశాలకు సంబంధించిన జీవో 46పై నెలరోజుల్లో వివరణ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి చేపట్టిన నియామకాల్లో జీవో నంబర్ 46ను మినహాయించాలని కోరుతూ కొందరు అభ్యర్థులు తొలుత హైకోర్టును ఆశ్రయించగా అక్కడ నిరాశ ఎదురయింది. హైకోర్టు తీర్పుపై అక్టోబర్ 19న మాటూరి శ్రీకాంత్‌తోపాటు బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి సహా మరికొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు అఫిడవిట్ దాఖలు చేయలేదని చెప్పారు. ధర్మాసనం నెలరోజుల్లో వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. అనంతరం బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి సుప్రీంకోర్టు బయట మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జీవో 46ను రద్దు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఆ విషయాన్ని మరిచిపోయారని విమర్శించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్నకు బెయిల్

పది నెలల తర్వాత సుప్రీం కోర్టులో ఊరట.. విచారణకు సహకరించాలని ఆదేశించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్రధారిగా అభియోగాలున్న మేకల తిరుపతన్నకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సుమారు 10 నెలల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం అతడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్నను గతంలో పోలీసులు అరెస్టు చేశారు. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అతడు హైకోర్టును ఆశ్రయించగా, నిరాశే ఎదురైంది. గతేడాది అక్టోబరు 20న హైకోర్టు తీర్పును తిరుపతన్న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, మోహిత్ రావు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. తొలుత సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ... తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉన్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలైనందున, జైలులో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. తిరుపతన్న ఎస్ఐబీలో కీలకంగా వ్యవహరించారని, అర్బన్ నక్సల్స్, తీవ్రవాద నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ... నిందితుడిని ఎంతకాలం జైలులో ఉంచారన్న అంశంతోపాటు కేసు తీవ్రతను దృష్టిలోకి తీసుకోవాలని కోరారు. ఈ కేసులో ఇప్పటికే కీలక నిందితులు దేశం విడిచి పారిపోయారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడమే కాదని, ఉద్దేశ పూర్వకంగా ఆధారాలను చెరిపివేశారని తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఐజీ ప్రభాకర్ రావు నేతృత్వంలో ఇదంతా జరిగిందని, ఆయన దేశం విడిచి పారిపోయారని గుర్తుచేశారు. ప్రభాకర్ రావు మార్గదర్శకంలో 18 మందితో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపును తయారు చేసి ఫోన్ ట్యాపింగ్ ఎలా చేయాలి? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయాలనే విషయంపై తిరుపతన్న ఆదేశాలు ఇచ్చేవారని తెలిపారు. రాజకీయ నేతలతోపాటు కొందరు న్యాయమూర్తుల ఫోన్లు సైతం ట్యాప్ చేశారని ధర్మాసనానికి వివరించారు. 2023 డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే ప్రభుత్వం మారుతుందని తెలిసి ఆధారాలను ధ్వంసం చేశారని చెప్పారు. ప్రస్తుతం గూగుల్ సర్వర్ నుంచి సమాచారం తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కేసులో తిరుపతన్న పాత్రపై మరింత సమగ్ర దర్యాప్తు అవసరమని, దీనికి మరో నాలుగు నెలల సమయం పడుతుందని స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఇప్పటికే కీలక నిందితులు దేశం విడిచి పారిపోయారని, పాస్‌పోర్టు సరెండర్ చేయాలని ఆదేశించాలని సిద్ధార్థ్ లూథ్రా కోరగా, ఇతర షరతులన్నీ ట్రయల్ కోర్టు మార్గనిర్దేశనం చేస్తుందని ధర్మాసనం వెల్లడించింది. తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేసిన తర్వాత న్యాయవాది మోహిత్ రావు మీడియాతో మాట్లాడారు. "తిరుపతన్నకు చెందిన మొబైల్, కంప్యూటర్లు అన్నీ పోలీసులు ఇప్పటికే సీజ్ చేశారు. ఇందులో సాక్షులు పోలీసు అధికారులు, న్యాయమూర్తులే ఉన్నారు. సస్పెన్షన్‌కు గురైన తిరుపతన్న వాళ్లను ప్రభావితం చేయడం ఎంతవరకు సాధ్యమన్నారు.


తిరుపతన్న (ఫైల్)

చందన్ మిశ్ర, రేపాక స్వాతిలను కోర్టుల్లో ప్రవేశపెట్టిన పోలీసులు

- హైకోర్టు ఉత్తర్వుల అమలు

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగద్గిరిగుట్ట శ్రీనివాస కాలనీలో నిర్బంధించిన మావోయిస్టు చందన్‌మిశ్రా, ఆయన భార్య రేపాక స్వాతిలను తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టారు. ఈ విషయాన్ని సోమవారం పోలీసులు హైకోర్టుకు నివేదించారు. చందన్ మిశ్రాను ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు పోలీసులు అరెస్టు చేయగా, ఆయనను రంపచోడవరం మేజిస్ట్రేటు కోర్టులో ప్రవేశపెట్టారు. చందన్‌మిశ్రా భార్య స్వాతిని కూకట్‌పల్లి కోర్టులో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. పోలీసులు చందన్‌మిశ్రాను, ఆయన భార్యను అక్రమంగా నిర్బంధించి తీసుకెళ్లారని, ఈనెల 25న రిటైర్డ్ ప్రొఫెసర్, పౌరహక్కుల కమిటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావుల ధర్మాసనం.. నిర్బంధించిన వారిని సోమవారం ఉదయం 10.30 గంటలలోపు సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టాలని డీజీపీకి ఆదేశాలు జారీచేసింది. ఏయే కేసుల్లో ఎందుకు అరెస్ట్ చేశారనే వివరాలతో ఏపీ పోలీసుల నుంచి నివేదిక తీసుకోవాలని సూచించింది. చందన్ సోదరుడు క్రాంతికి భద్రత కల్పించాలని పేర్కొంది. ఏపీ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. తెలంగాణ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిందితుడిని ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించింది. అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

మంటల్లో కాలిపోయిన బోట్ ఘటన..

హుస్సేన్‌సాగర్‌లో యువకుడి గల్లంతు

- గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు
- గల్లంతైన యువకుడు ఇంజనీరింగ్ విద్యార్థి

రాంగోపాల్‌పేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భారతమాత ఫౌండేషన్ ఆదివారం రాత్రి మహాహారతి పేరిట నిర్వహించిన కార్యక్రమంలో బాణసంచా కాలుస్తున్న సమయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో అజయ్ అనే బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. అజయ్ జాడ కోసం గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటన జరిగిన ప్రాంతంలో గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు వెతికినా ఫలితం లేకపోయింది. సచివాలయ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాహారతి కార్యక్రమంలో బాణాసంచా కాల్చడానికి ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మణికంఠ కాంట్రాక్టు తీసుకున్నాడు. అతడికి బాణసంచా సరఫరా చేసిన వ్యక్తి.. తనకు రావాల్సిన డబ్బులకోసం మణికంఠవద్దకు వెళ్లమని చేర్యాల్ గీతాంజలి కాలేజ్‌లో బీటెక్ చదువుకుంటున్న సాయిచంద్, గణపతికి చెప్పాడు. అదే కాలేజీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న అజయ్‌ను వారు తమకూడా హుస్సేన్‌సాగర్ వద్ద ఉన్న మణికంఠ వద్దకు తీసుకెళ్లారు. హుస్సేన్‌సాగర్‌లో ఓ బోటులో ఉండి బాణసంచా కాలుస్తున్న మణికంఠ... సాయిచంద్, గణపతి, అజయ్‌లను తనవద్దకు రావాలని చెప్పి మరో బోటును పంపాడు. మణికంఠ వద్ద వారు డబ్బులు తీసుకుంటున్న సమయంలోనే నిప్పురవ్వలు వచ్చి సాయిచంద్, గణపతి, అజయ్ ఉన్న బోటులో పడ్డాయి. ఆ బోటులో కూడా బాణసంచా ఉండడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఆ బోటులో ఉన్నవారందరూ హుస్సేన్‌సాగర్‌లో దూకేశారు. వారికి లైఫ్‌జాకెట్లు కూడా లేవు. వీరిలో అజయ్ మాత్రం గల్లంతయ్యాడు. అజయ్ తండ్రి జానకిరాములు నాగారంలో ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, గవర్నర్, కేంద్ర మంత్రి పాల్గొన్న కార్యక్రమంలో అనుమతులు లేకుండా బాణసంచా కాల్చడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


అజయ్ (ఫైల్)

దురదృష్టకరం: భారతమాత ఫౌండేషన్

హైదరాబాద్, జనవరి27(ఆంధ్రజ్యోతి): మహాహారతి క్రాకర్ షోలో ప్రమాదం దురదృష్టకరమని భారతమాత ఫౌండేషన్ తెలిపింది. ప్రమాదంలో గాయపడినవారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందిస్తున్నామని, బాధితులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఫౌండేషన్ కార్యాలయ కార్యదర్శి వికాస్ కుమార్ తెలిపారు.



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు.. రైతుల దాడిలో చిరిగిన చొక్కాతో మార్కెట్ చైర్మన్ భర్త మల్లేష్

అచ్చంపేటలో పల్లి రైతు ఆగ్రహం

- మార్కెట్ కార్యదర్శి, చైర్‌పర్సన్ భర్తపై దాడి
- మార్కెట్ కార్యాలయంలో సామగ్రి ధ్వంసం
- గిట్టుబాటు ధర కల్పించాలంటూ రాస్తారోకో
- కల్వకుర్తిలోనూ ఆందోళనకు దిగిన రైతులు

అచ్చంపేట, హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి పండించిన పంటకు తక్కువ ధర ప్రకటించడంపై వేరుశనగ రైతులు మండిపడ్డారు. కమీషన్‌దారులు, అధికారులు ఒక్కటయ్యారని ఆరోపిస్తూ అచ్చంపేట మార్కెట్ కార్యాలయంపై సోమవారం దాడికి పాల్పడ్డారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త మల్లేశ్, కార్యదర్శిపై చేయి చేసుకున్నారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మార్కెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠంగా రూ.4,010 ధర పలికింది. దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన రైతులు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోకి దూసుకువచ్చి మార్కెట్ కార్యదర్శి నర్సింహ, సూపర్‌వైజర్ జహంగీర్‌తో వాగ్వాదానికి దిగారు. అక్కడే కూర్చున మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత భర్త మల్లేశ్ కలుగజేసుకునే యత్నం చేయగా.. ఆయనపై చేయి చేసుకుని, చొక్కాను చింపేశారు. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై తమను ముంచుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో వ్యాపారులు కొనుగోళ్లను నిలిపివేశారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో రైతులు రాస్తారోకో చేపట్టారు. చివరకు ఎస్సై రమేష్ రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. కాగా, కల్వకుర్తిలోనూ పల్లి రైతులు ఆందోళనకు దిగారు. కమీషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ రాస్తారోకో చేపట్టారు.మద్దతు ధర వచ్చేలా చూస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజుకుమార్ యాదవ్, కమిటీ సభ్యులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతుల ముసుగులో మార్కెట్ కార్యదర్శి, చైర్మన్‌లపై దాడి చేయడం, కార్యాలయం ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి అన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

యుద్ధానికి సిద్ధం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ఏ.ఎం. రత్నం, ఎ.దయాకర్ రావు నిర్మాతలు. మార్చి 28న విడుదలవుతోంది. ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం సోమవారం పోస్టర్‌ని రిలీజ్ చేసింది. రాజుల కాలం నాటి దుస్తుల్లో ఉన్న బాబీ డియోల్ కత్తి పట్టుకొని యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు పోస్టర్‌లో కనిపించారు. ఈ సినిమాలో అనుపమ్‌ఖేర్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాలోని 'మాట వినాలి' అనే పాటను విడుదల చేయగా అది ప్రేక్షకాదరణను పొందింది. పవన్ కల్యాణ్ ఆ పాటను స్వయంగా పాడారు.

సంక్రాంతికి వచ్చాం.. కొట్టాం!


వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌ను భీమవరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ పాడారు. హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లతో కలసి ఆడారు. 'సంక్రాంతికి వచ్చాం.. కొట్టాం. ఆ ఘనత మీ అందరిదే. అలాగే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన అనిల్‌కు థాంక్స్. మీ ప్రేమాభిమానాలు ఇలాగే ఉంటే మళ్లీ సంక్రాంతికి వస్తాం. మరో బ్లాక్ బస్టర్ హిట్ ఇస్తాం' అన్నారాయన. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సినిమా పెద్ద హిట్ అయితే చాలు అనుకున్నాను. ఈ చిత్రాన్ని మీరు ఎక్కడికో తీసుకెళ్లారు' అని అన్నారు. పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు నిర్మాత శిరీష్ కృతజ్ఞతలు తెలిపారు.

రాయలసీమ అంటే ఏమిటో చూపిస్తాం



అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాచరికం'. ఈశ్వర్ నిర్మాత. ఈనెల 31న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నెగెటివ్ పాత్రలో నటించాను. సురేశ్, ఈశ్వర్ అద్భుతంగా తీశారు' అని అన్నారు. హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ "రాచరికం' టైటిల్లోనే ఓ రాయాల్టీ ఉంటుంది. రాయలసీమ అంటే ఏమిటో ఈ సినిమా చూపిస్తుంది' అని అన్నారు.



సెట్‌లో సన్మానం


ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారం పొందిన నందమూరి బాలకృష్ణ సోమవారం 'అఖండ 2 తాండవం' చిత్రంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఆయన్ని ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు.

లూసిఫర్ మళ్లీ వస్తున్నాడు



మలయాళ నటుడు మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'. 2019లో విడుదలై సూపర్‌హిట్ సాధించిన 'లూసిఫర్'కు ఇది కొనసాగింపు. స్టీఫెన్ గట్టుపల్లిగా మొదటిభాగంలో అలరించిన మోహన్‌లాల్, రెండో భాగం 'ఎల్ 2 ఎంపురాన్'లో గ్యాంగ్‌స్టర్ అబ్రహం ఖురేషిగా కనిపించనుండడంతో ఈ సినిమా కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 27న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. మలయాళ ఇండస్ట్రీలో మూడు స్తంభాలైనటువంటి మమ్ముట్టి, మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ టీజర్ విడుదల కార్యక్రమంలో తళుక్కుమనడం విశేషం. 2 నిమిషాల 23 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్‌లో మోహన్‌లాల్ పాత్రలోని విభిన్న రకాల షేడ్స్ గురించి ఎలివేషన్ ఇచ్చే విధానం ఆకట్టుకునేలా ఉంది. అత్యున్నత సాంకేతిక విలువలతో కూడిన విజువల్స్, బీజీఎమ్, సంభాషణలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఈ చిత్రంలో టొవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

గ్రామీణ నేపథ్యంలో...



మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో ఓ చిత్రంలో నటిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బాలకృష్ణ, సి.రామశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు 'బద్మాషలు' అనే టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ ఎంటర్టైనర్ ప్రతీ ఒక్కరినీ కచ్చితంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్:గజ్జల రక్షిత్‌కుమార్, సినిమాటోగ్రాఫర్ : వినీత్ పబ్బతి, సంగీతం: తేజ కూనూరు.

మా 'నీలమ్మ'కు పద్మ అవార్డ్ రావడం ఆనందంగా ఉంది

- నటుడు నారాయణరావు



కళారంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా బెంగాల్‌కు చెందిన నృత్య కళాకారిణి మమతా శంకర్‌కు కేంద్రప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డ్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే మమత కేవలం నృత్యకళాకారిణి మాత్రమే కాదు కొన్ని చిత్రాల్లో నటించారనీ, అందులోనూ తెలుగులో మృణాల్ సేన్ రూపొందించిన 'ఒక ఊరి కథ'(1977) చిత్రంలో మమత హీరోయిన్‌గా నటించారనీ చాలా కొద్దిమందికే తెలిసిన విషయం. మృణాల్ సేన్ దర్శకత్వంలో 1976లో వచ్చిన 'మృగయ' అనే బెంగాలీ చిత్రం ద్వారా మమతా శంకర్ తెరంగేంట్రం చేశారు. ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి హీరోగా నటించారు. ఆవిడ నటించిన రెండో సినిమా 'ఒక ఊరి కథ'. ఆ చిత్ర కథానాయకుడు, సీనియర్ నటుడు నారాయణరావు మమతా శంకర్‌కు పద్మ పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'మా హీరోయిన్ (నీలమ్మ) మమతా శంకర్‌కు పద్మశ్రీ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉంది. వృత్తి పట్ల అంకితభావం ఉన్న కళాకారిణి ఆమె. చాలా కలుపుగోలు మనిషి. చాలా మంచి డ్యాన్సర్ కూడా. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలో షూటింగ్ చేశాం.



ఇందులో బక్క చిక్కిన రైతు పాత్ర నాది. నా భార్య నీలమ్మగా మమత, తండ్రిగా కన్నడ నటుడు వాసుదేవరావు నటించారు. పని చేయడానికి బద్ధకిస్తూ దొంగతనాలకు అలవాటు పడిన మా ఇద్దరినీ మంచి దారిలో పెట్టడానికి ప్రయత్నించే పాత్రను మమత పోషించారు. మృణాల్ సేన్ సినిమాలన్నీ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాకు మమత డబ్బింగ్ చెప్పాలని ప్రయత్నించింది కానీ మాండలికం సరిగ్గా పలకలేకపోవడంతో ఫటాఫట్ జయలక్ష్మీతో డబ్బింగ్ చెప్పించాం. ఆరు లక్షల రూపాయల బడ్జెట్‌తో తయారైన 'ఒక ఊరి కథ' చిత్రానికి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి' అని నారాయణారావు చెప్పారు'. కమర్షియల్ చిత్రాల్లో కాకుండా ఎక్కువగా వాస్తవిక సినిమాల్లోనే నటించి, ఆ తర్వాత నృత్యానికే తన జీవితాన్ని అంకితం చేసిన 70 ఏళ్ల మమత ప్రస్తుతం కోల్‌కతాలో తన కుమారుడి దగ్గర ఉంటున్నారు.

బిజినెస్

కెనరా బ్యాంక్ లాభం రూ.4,104 కోట్లు



కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికాని (క్యూ3)కి గాను బ్యాంక్ నికర లాభం స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన 12.25 శాతం వృద్ధితో రూ.4,104 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.3,656 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం పెరగటం సహా మొండి బకాయిలు తక్కువ స్థాయిలో ఉండటం కలిసి వచ్చిందని బ్యాంక్ పేర్కొంది. క్యూ3లో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) 4.39 శాతం నుంచి 3.34 శాతానికి. నికర ఎన్‌పీఏలు 1.32 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్లు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు తెలిపారు. దీంతో స్థూల ఎన్‌పీఏలను 3.5 శాతానికి చేర్చాలన్న లక్ష్యాన్ని తాము చేరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి కూడా 91.26 శాతంగా ఉందని తెలిపారు. డిసెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 2.85 శాతం తగ్గుదలతో రూ.9,149 కోట్లుగా నమోదైంది.

గ్లోబల్ వ్యాపారం రూ.24 లక్షల కోట్లకు: డిసెంబరు ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 9.3 శాతం వృద్ధితో రూ.24.19 లక్షల కోట్లకు చేరుకుంది. గ్లోబల్ డిపాజిట్లు 8.44 శాతం వృద్ధి చెంది రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా అడ్వాన్సులు రూ.10.49 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు దేశీయ డిపాజిట్లు రూ.12.57 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా క్యాపిటల్ అడిక్వసీ రేషియో 16.44 శాతంగా ఉంది. డిసెంబరు త్రైమాసికంలో ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చిన రుణాలు 44.33 శాతం, వ్యవసాయ రుణాలు 21.04 శాతంగా ఉన్నట్లు కెనరా బ్యాంక్ పేర్కొంది.

డీప్ లాస్!



స్టాక్ మార్కెట్ భారీ పతనం

రూ.9.28 లక్షల కోట్ల సంపద క్షీణత ● సెన్సెక్స్ 824 పాయింట్లు డౌన్

7 నెలలకు పైగా కనిష్ఠానికి సూచీ ● 23,000 దిగువకి నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాన్ని చవిచూశాయి. ఐటీ, టెలికాం, యుటిలిటీస్, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లలో అమ్మకాలు పెరగడంతో సెన్సెక్స్ ఒక దశలో 923 పాయింట్లు క్షీణించింది. చివరికి సూచీ 824.29 పాయింట్ల (1.08 శాతం) నష్టంతో 7 నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 75,366.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.05 పాయింట్లు (1.14 శాతం) కోల్పోయి 22,829.15 వద్దకు జారుకుంది. సూచీ 23,000 దిగువకి పడిపోవడం గత ఏడాది జూన్ 6 తర్వాత ఇదే తొలిసారి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 3.51 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.68 శాతం పతనమయ్యాయి.

ఈ నెలలో రూ.32 లక్షల కోట్లు గల్లంతు

అమ్మకాల సునామీలో రూ.9.28 లక్షల కోట్ల మార్కెట్ సంపద గల్లంతైంది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.410.31 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. గత వారాంతం సెషన్‌లోనూ రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. అంటే, రెండో రోజుల్లోనే దాదాపు రూ.15 లక్షల కోట్ల సంపద తరిగిపోయింది. కాగా ఈ జనవరిలో ఇప్పటివరకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.32 లక్షల కోట్ల మేర తగ్గింది. మార్కెట్ పతనానికి కారణాలు..

అమెరికా మార్కెట్లకు చైనా డీప్‌సీక్ షాక్

ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమినీ వంటి జనరేటివ్ ఏఐ టూల్స్‌కు పోటీగా చైనా ఏఐ రీసెర్చ్ ల్యాబ్ డీప్‌సీక్ తాజాగా ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్ 'డీప్‌సీక్-ఆర్1'ను విడుదల చేసింది. డీప్‌సీక్ కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో అమెరికన్ టెక్ కంపెనీల ఆధిపత్యానికి తెరదించవచ్చన్న ఆందోళనలతో ఎన్‌విడియాతో పాటు మిగతా టెక్ కంపెనీల షేర్లు ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో కుప్పకూలాయి. యూఎస్ మార్కెట్ సూచీల్లో డోజోన్స్ ఒక దశలో 400 పాయింట్లకు పైగా పడిపోగా.. నాస్‌డాక్ ఫ్యూచర్స్ 4 శాతానికి పైగా క్షీణించింది. అంతర్జాతీయంగా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లపై ఇది ప్రతికూల ప్రభావం చూపింది.

ట్రంప్ వాణిజ్య విధానాలతో అనిశ్చితి

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలతో పాటు వాణిజ్య విధానాలతో అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది.

ఫెడ్ రిజర్వ్ సమీక్ష నేపథ్యంలో అప్రమత్తత

ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ తొలిసారిగా వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ఈ నెల 29న ప్రకటించనుంది. ఇప్పటికే ప్రామాణిక వడ్డీ రేట్లను 1 శాతం తగ్గించిన ఫెడ్.. ఈసారి యథాతథ స్థితినే కొనసాగించవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. మార్చి సమీక్షలో తగ్గించే అవకాశాలకూ ట్రంప్ వాణిజ్య విధానాలు అడ్డంకిగా మారవచ్చన్న ఆందోళనల కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తమై అమ్మకాలు పెంచారు. మరో వైపు భారత మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల తరలింపు కొనసాగుతూనే ఉంది. ఇది దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను మరింతగా కుంగదీసింది.

యూబీఐ లాభంలో 28% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.4,604 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.3,590 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.29,137 కోట్ల నుంచి రూ.31,375 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం కూడా రూ.25,163 కోట్ల నుంచి రూ.26,958 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ పేర్కొంది. మరోవైపు బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.8 శాతం నుంచి 3.8 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.08 శాతం నుంచి 0.8 శాతానికి దిగొచ్చాయి. ఈ కాలంలో బ్యాంక్ ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 93.42 శాతంగా ఉండగా క్యాపిటల్ అడిక్వసీ రేషియో 15.03 శాతం నుంచి 16.7 శాతానికి పెరిగింది

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,250 ▼	75,400 ▼	1,04,000 ▼
విజయవాడ	83,000 ▲	77,500 ▼	92,500 ▼
విశాఖపట్నం	80,270 ▼	73,580 ▼	90,900 ▼
రాజమండ్రి	82,250 ▼	75,400 ▼	93,900 ▼
ప్రొద్దుటూరు	82,000 ▲	75,840 ▼	92,500 ▼
ముంబై	80,397	73,644	90,274



సిటీ యూనియన్ బ్యాంక్‌కు 7 టెక్నాలజీ అవార్డులు

హైదరాబాద్: సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ).. ఐబీఏ బ్యాంకింగ్ టెక్నాలజీలో ఏడు అవార్డులను గెలుచుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన 20వ వార్షిక టెక్నాలజీ కాన్ఫరెన్స్, ఎక్స్‌పో-2024లో బ్యాంక్ ఏడు విభాగాల్లో ఈ అవార్డులను దక్కించుకుంది. ఐబీఏ నుంచి సీయూబీ వరుసగా ఏడు విభాగాల్లో ఈ అవార్డులను అందుకోవటం ఇది రెండో ఏడాది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ టీ రవి శంకర్ చేతుల మీదుగా సిటీ యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్, బ్యాంక్ టెక్నికల్ టీమ్ ఈ అవార్డులను అందుకున్నారు. డిజిటల్ సేల్స్, పేమెంట్స్ అండ్ ఎంగేజ్‌మెంట్, ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్, ఫిన్‌టెక్ అండ్ డిజిటల్ పేమెంట్ ఇండెక్స్ (డీపీఐ) అడాప్షన్, ఫైనాన్షియల్ ఇంక్లూజన్, ఏఐ అండ్ ఎంఎల్ వినియోగించటం, టెక్నాలజీ టాలెంట్, అత్యుత్తమ టెక్నాలజీ బ్యాంక్ విభాగాల్లో సీయూబీ ఈ అవార్డులను గెలుచుకుంది.

రూ.2,758 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు

ముంబై: దేశంలో డిజిటల్ లావాదేవీలు శరవేగంతో పెరుగుతున్నాయి. 2013లో రూ.772 లక్షల కోట్ల విలువైన 222 కోట్ల డిజిటల్ లావాదేవీలు మన దేశంలో నమోదయ్యాయి. 2024 నాటికి డిజిటల్ లావాదేవీల విలువ రూ.2,758 లక్షల కోట్లకు, లావాదేవీలు 94 రెట్లు పెరిగి 20,787 కోట్లకు చేరాయి. సోమవారం విడుదలైన భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నివేదిక ఈ విషయం తెలిపింది. గత ఐదేళ్లలో దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్యా 5.53 కోట్ల నుంచి రెట్టింపై 10.80 కోట్లకు చేరగా, డెబిట్ కార్డులు మాత్రం పెద్ద మార్పేమీ లేకుండా 80.53 కోట్ల నుంచి 99.09 కోట్లకు చేరాయి.

డిజిటల్ మోసాలపై జర జాగ్రత్త: దేశ బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ మోసాలను అడ్డుకునేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ఎండీ, సీఈఓలను ఆయన కోరారు. అలాగే తమకు సేవలందించే థర్డ్ పార్టీ సేవలపైనా బ్యాంకులు ఒక కన్నేయాలని కోరారు.

జహీరాబాద్ ప్లాంట్‌లో హాట్సన్ ఆగ్రో ఉత్పత్తి పెంపు

కొత్తగా చాక్లెట్లు, ఫ్రూట్ జ్యూస్‌ల తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చెన్నై కేంద్రంగా పనిచేసే హాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ జహీరాబాద్ సమీపంలోని గోవిందపల్లి వద్ద ఉన్న తన ఐస్‌క్రీమ్ ప్లాంట్‌లో కొత్తగా చాక్లెట్లు, ఫ్రూట్ జ్యూస్ ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తుల పోర్టుఫోలియోను విస్తరించే వ్యూహంలో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కంపెనీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సెంథిల్ చెప్పారు. కాగా ఐస్‌క్రీమ్ ప్లాంట్‌లో ఇటీవలి వరకు లక్ష కిలోలు ఉన్న రోజువారీ ఐస్‌క్రీమ్ ఉత్పత్తిని 1.27 లక్షల కిలోలకు పెంచినట్టు ఆయన తెలిపారు. అరుణ్ ఐస్‌క్రీమ్స్ పేరుతో కంపెనీ ఐస్‌క్రీమ్స్‌ను విక్రయిస్తోంది. గోవిందపల్లి ప్లాంటును కంపెనీ రెండు లక్షల కిలోల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసింది. ఏప్రిల్-మే నెలల్లో ఏర్పడే వేసవి గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని పెంచినట్లు సెంథిల్ తెలిపారు. జహీరాబాద్ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఐస్‌క్రీమ్‌ను కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలకు సరఫరా చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం హాట్సన్ ఆగ్రో టర్నోవర్ రూ.8,600 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. అందులో సగానికి పైగా పాలు, పెరుగు ద్వారా లభించనుంది. ఐస్‌క్రీమ్ ద్వారా 2023-24లో కంపెనీ రూ.1,100 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	485
చిత్తూరు	543	విశాఖపట్నం	495
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	126
వరంగల్	115	గుంటూరు	120
కరీంనగర్	115	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	104
కర్నూలు	115	నెల్లూరు	109
విశాఖపట్నం	117		
గోదావరి	126	అనంతపురం	109

బుచ్‌కు బైబై..!

సెబీ కొత్త చీఫ్ కోసం అన్వేషణ ప్రారంభం

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కు కొత్త సారథిని నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్వేషణ ప్రారంభించింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సోమవారం ప్రకటన జారీ చేసింది. ఎందుకంటే, సెబీ ప్రస్తుత చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మూడేళ్ల పదవీకాలం వచ్చే నెల 28తో ముగియనుంది. బుచ్‌పై పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆమె పదవీకాలాన్ని పొడిగించేందుకు కేంద్రం సుముఖంగా లేదనడానికి తాజా ప్రకటనే సంకేతమని చెప్పవచ్చు. 2022 మార్చి 2న సెబీ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఐదేళ్ల పాటు (2017 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు) సెబీ బోర్డు సభ్యురాలిగానూ బాధ్యతలు నిర్వహించారు. ఈ మూడేళ్లలో బుచ్‌పై పలు ఆరోపణలు వచ్చాయి. అదానీ గ్రూప్ నిధుల అక్రమ మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో మాధవి పురి బుచ్‌తో పాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు గోప్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ గత ఆగస్టులో ఆరోపించింది. అయితే, బుచ్ ఆ ఆరోపణలన్నింటినీ ఖండించారు.

స్పోర్ట్స్

'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' బుమ్రా

● అత్యుత్తమ వన్డే ప్లేయర్‌గా మంధాన



దుబాయ్: భారత పేసుగన్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఐసీసీ పురుషుల 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. గతేడాది అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన బుమ్రా ఆడిన 13 మ్యాచ్‌ల్లో 14.92 సగటుతో 71 వికెట్లు పడగొట్టాడు. 2024 భారత జట్టు విజయాల్లో బుమ్రాదే కీలక పాత్ర. 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం ఇంగ్లండ్ ప్లేయర్లు బ్రూక్, రూట్, కమిందు మెండిస్ (శ్రీలంక) పోటీపడినా.. వారందరినీ వెనక్కు నెట్టి బుమ్రా అవార్డును సొంతం చేసుకొన్నాడు. 2018లో విరాట్ కోహ్లీ తర్వాత ఈ అవార్డుకు ఎంపికైన భారత ఆటగాడిగా నిలిచాడు.



వన్డేల్లో స్మృతి: మహిళల అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో పరుగుల వరదపారించిన భారత డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళల 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును దక్కించుకొంది. లారా వొల్వార్ట్ (దక్షిణాఫ్రికా), టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్), హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్) కూడా అవార్డు కోసం పోటీపడ్డారు. అయితే, గతేడాది 13 ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 747 పరుగులు సాధించిన మంధాన ఈ అవార్డును సొంతం చేసుకొంది. 2018, 2022లో మంధాన 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచింది.

రంజీ బరిలో కోహ్లీ

భద్రతా ఏర్పాట్లు పటిష్టం

న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత విరాట్ కోహ్లీ రంజీ ట్రోఫీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 30 నుంచి ఇక్కడి అరుణ్ జైట్లీ స్టేడియంలో రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌లో విరాట్ ఆడనున్నాడు. ఈమేరకు సోమవారం ప్రకటించిన ఢిల్లీ జట్టులో కోహ్లీ పేరు కూడా ఉంది. ప్రాక్టీస్‌తోపాటు మ్యాచ్ సందర్భంగా కూడా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టనున్నట్టు ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) కార్యదర్శి అశోక్ శర్మ తెలిపాడు. మామూలుగా రంజీ మ్యాచ్‌లకు స్టేడియంలో ఒకటే స్టాండులో అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తారు. కానీ విరాట్ ఆడుతుండడంతో మూడు స్టాండ్స్‌లో ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించాడు. ఇదిలావుండగా హరియాణాతో జరిగే మ్యాచ్‌లో కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్ ఆడనున్నాడు. హైదరాబాద్ తరఫున పేసర్ సిరాజ్, సౌరాష్ట్ర తరఫున జడేజా ఆడడానికి సమ్మతి తెలిపారు. అయితే, బీసీసీఐ అవార్డుల కార్యక్రమం కారణంగా రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదు.



డకెట్

పిచ్

రాజ్‌కోట్ వికెట్‌పై బ్యాటర్లదే హవా. ఇక్కడ జరిగిన ఐదు టీ20ల్లో తొలి ఇన్నింగ్స్ సగటు 189. అలాగే తమ చివరి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 228/5 స్కోరు సాధించింది. అంతేకాకుండా ఈనెలారంభంలో భారత మహిళల జట్టు రెండు వన్డేల్లో ఐర్లాండ్‌పై 370, 435 పరుగులతో బెంబేలెత్తించింది. దీంతో ఇరు జట్ల నుంచి పరుగుల వరద ఖాయమే.

రాజ్‌కోటలో పాగా ఎవరిదో?

నేడు మూడో టీ20

సిరీస్‌పై భారత్ దృష్టి ● ఇంగ్లండ్‌కు చావోరేవో

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



సూర్యకుమార్

రాజ్‌కోట్: భారత స్పిన్నర్లకు.. ఇంగ్లండ్ పేసర్లకు మధ్య పోరులా సాగుతున్న ఐదు టీ20ల సిరీస్ కీలక దశకు చేరుకుంది. మంగళవారం రాజ్‌కోట్‌లో ఇరు జట్ల మధ్య మూడో మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే 2-0తో ఆధిక్యంలో ఉన్న టీమిండియాకు ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ దక్కుతుంది. అటు పర్యాటక ఇంగ్లండ్ మాత్రం తీవ్ర ఒత్తిడిలో ఉంది. వరుసగా రెండు మ్యాచ్‌ల ఓటమి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసినట్టయ్యింది. చెన్నైలో వారికి గెలుపు అవకాశం వచ్చినా తిలక్ ధాటికి చేజారింది. ఇక సిరీస్‌లో సజీవంగా ఉండాలంటే నేటి మ్యాచ్‌లో వారికి విజయం తప్ప మరో దారి లేదు.

సూర్య ఫామ్‌పై ఆందోళన: గతేడాది సూర్యకుమార్ టీ20 జట్టు పగ్గాలు చేపట్టాక భారత్ దూసుకెళ్తోంది. కానీ అతడి ఫామ్ మాత్రం ఆందోళనకరంగా మారింది. చివరి 10 ఇన్నింగ్స్‌లో ఒకే అర్ధసెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లోనూ అతడు ఈడెన్‌లో డకౌట్ కాగా, రెండో మ్యాచ్‌లో 12 పరుగులే చేశాడు. అలాగే శాంసన్ షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో తడబడుతున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ ఉన్న కాసేపు ధాటిగా ఆడుతున్నాడు. తిలక్ మాత్రం అద్వితీయ ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. జురెల్ స్థానంలో శివమ్ దూబే, రమణ్‌దీప్‌లలో ఒకరికి చోటు లభించవచ్చు. అలాగే మధ్య ఓవర్లలో లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్‌ను ఎదుర్కొనేందుకు దూబేను బరిలోకి దింపవచ్చు. ఏకైక స్పెషలిస్ట్ పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి చెన్నైలో పరుగులు సమర్పించుకున్నారు. పేస్‌ను బలోపేతం చేయాలనుకుంటే బిష్ణోయ్ స్థానంలో షమిని తీసుకోవచ్చు. మరోవైపు స్థానిక పిచ్ బౌలర్లకు సవాల్‌గా మారనుంది. కాబట్టి టాపార్డర్ వేగంగా ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తే ప్రత్యర్థి ముందు భారీ ఛేదనను ఉంచేందుకు చాన్స్ ఉంటుంది.

బ్యాటింగ్ బలహీనంగా..: చెన్నై మ్యాచ్ బరిలోకి దిగిన జట్టులో ఇంగ్లండ్ ఎలాంటి మార్పులూ చేయలేదు. అదే జట్టుతో రాజ్‌కోట్‌లో ఆడనుంది. ఆ జట్టు టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా పెద్దగా ఆకట్టుకోవడం లేదు. కెప్టెన్ బట్లర్ ఒంటరి పోరాటం సాగిస్తున్నాడు. ఐపీఎల్‌లో భయపెట్టిన ఫిల్ సాల్ట్‌తో పాటు మరో ఓపెనర్ డకెట్ ప్రభావం చూపడం లేదు. బ్రూక్, లివింగ్‌స్టోన్ కూడా తేలిపోతున్నారు. తన తొలి టీ20లో జేమీ స్మిత్ ఆకట్టుకున్నా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కార్స్ భారీ షాట్లతో కాసేపు భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టగలిగాడు. అలాగే ఇంగ్లండ్.. ఈ మ్యాచ్‌లోనూ పేసర్లపైనే భారం వేయనుంది. కానీ ఆర్చర్ మాత్రం చెన్నైలో ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. స్పిన్నర్ రషీద్ మాత్రమే భారత బ్యాటర్లను కట్టడి చేయగలుగుతున్నాడు.

తుది జట్లు

భారత్ (అంచనా): శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్, జురెల్/దూబే/రమణ్‌దీప్, సుందర్, అక్షర్, బిష్ణోయ్/షమి, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

దేశీయ ఒలింపిక్స్‌కు వేళాయె

నేటి నుంచి ఉత్తరాఖండ్‌లో జాతీయ క్రీడలు | **తెలంగాణ నుంచి 212, ఆంధ్ర నుంచి 165 మంది అథ్లెట్లు** | **పోటీలకు దూరంగా స్టార్ క్రీడాకారులు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచంలోనే అతి పెద్ద జాతీయ క్రీడా పండుగకు ఉత్తరాఖండ్ వేదికైంది. హిమగిరుల పాదల చెంత ఉత్తరాఖండ్ కొండ ప్రాంతాల నడుమ 38వ జాతీయ క్రీడలను అట్టహాసంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచే కొన్ని క్రీడాంశాల్లో పోటీలు మొదలవగా, మంగళవారం డెహ్రాడూన్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా జాతీయ క్రీడలను ప్రారంభించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పది వేల మందికి పైగా అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో పోటీ పడనున్నారు. 18 రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు డెహ్రాడూన్ ప్రధాన వేదిక కాగా, మరో ఆరు నగరాలు ఇతర వేదికలు. దేశీయ ఒలింపిక్స్‌గా పిలుచుకునే ఈ క్రీడలు వచ్చే నెల 14వ తేదీ వరకు జరగనున్నాయి.

స్టార్లు లేక వెలవెల: ఒలింపియన్లు నీరజ్ చోప్రా, పీవీ సింధు, మనుభాకర్, నిఖత్ జరీన్, ఇషా సింగ్, ఆర్చరీ వరల్డ్ చాంపియన్ జ్యోతి సురేఖ వంటి స్టార్లు వివిధ కారణాలతో క్రీడలకు దూరమవడంతో స్టార్లు లేని వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. ఇక.. బాక్సింగ్‌లో లవ్లీనా, అథ్లెటిక్స్‌లో యర్రాజీ జ్యోతి, జ్యోతికశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. తెలంగాణ నుంచి బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్, ఆర్చర్ చికితరావు, ఆంధ్రప్రదేశ్ నుంచి షూటర్ మద్దినేని ఉమామహేష్, వెయిట్‌లిఫ్టర్ పల్లవి రాష్ట్ర పతాకధారులుగా వ్యవహరించనున్నారు.



జ్యోతి

క్రీడాకారుల పాలిట శాపంగా శాట్, శాప్!

ఈ క్రీడల్లో తెలంగాణ నుంచి 212 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 165 మంది తలపడుతున్నారు. అయితే, రెండు రాష్ట్రాల్లోనూ శాట్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ), శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అలక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. సరైన సన్నద్ధత లేకుండా క్రీడాకారులు ఉత్తరాఖండ్‌కు బయలుదేరారు. తెలంగాణలో ఆఖరి నిమిషం వరకు క్రీడలకు బడ్జెట్ కేటాయించకపోవడంతో క్రీడాకారులకు కిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. కిట్ బ్యాగులపై భారత ఒలింపిక్ సంఘం లోగోను కూడా శాట్ సరిగ్గా ముద్రించలేకపోయింది. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్కటే ఒలింపిక్ సంఘం ఉన్నా శాప్ బాధ్యతారాహిత్యంతో ఇప్పటికి సగం మంది క్రీడాకారులకు కిట్లు అందలేదు. ఏపీ ఒలింపిక్ సంఘం సొంత నిధులతో 115 మంది క్రీడాకారులకు కిట్లు అందించింది. శాప్‌లోని ఓ అధికారి ఒంటెద్దు పోకడలతో కిట్లు లేకుండానే పలువురు క్రీడాకారులు ఉత్తరాఖండ్ పయనమ

34 ఏళ్ల తర్వాత..

పాక్ గడ్డపై విండీస్ విజయం



ముల్తాన్: పాకిస్థాన్‌తో మూడు రోజుల్లో ముగిసిన రెండో టెస్టులో వెస్టిండీస్ 120 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే రెండు టెస్టుల ఈ సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 1990, నవంబరులో విండీస్ జట్టు పాక్‌లో చివరిసారి టెస్టు నెగ్గింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన లెఫ్టామ్ స్పిన్నర్ జోమెల్ వారికన్ ఈ సారి 5 వికెట్లతో దెబ్బతీశాడు. 254 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 76/4తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 133 రన్స్‌కే కుప్పకూలింది. బాబర్ (31), రిజ్వాన్ (25) మాత్రమే రాణించారు. సింక్లెయిర్‌కు 3, మోటీకి 2 వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా రెండు టెస్టుల సిరీస్‌లో స్పిన్నర్లకే 69 వికెట్లు లభించడం ఇదే తొలిసారి. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 163, పాక్ 154 పరుగులు, విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 రన్స్ సాధించాయి.

సెమీఫైనల్లో ఇంగ్లండ్

అండర్-19 మహిళల వరల్డ్ కప్

కుచింగ్ (మలేసియా): ఇంగ్లండ్ జట్టు అండర్-19 మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరింది. సోమవారం జరిగిన గ్రూప్-2 సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6 వికెట్లతో న్యూజిలాండ్‌ను ఓడించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. 90 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 11.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కాగా..ఇప్పటికే సెమీస్ చేరిన భారత జట్టు మంగళవారం జరిగే గ్రూప్-1 సూపర్ సిక్స్ రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది.



భారత జీఎం వైశాలికి షేక్‌హ్యాండ్ ఇవ్వనన్నాడు

తర్వాత వివరణ ఇచ్చుకున్న ఉజ్బెక్ ఆటగాడు

విజ్క్ ఆన్ జీ: ఇక్కడ జరుగుతున్న టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ నోడిర్బెక్ యాకుబోయెవ్ ప్రవర్తించిన తీరు విమర్శలకు దారితీసింది. ఎల్లెడెలా విమర్శలు వెల్లువెత్తడంతో తర్వాత అతడు క్షమాపణ చెప్పాడు. ఇంతకీ ఏమైందంటే..నోడిర్బెక్‌తో చాలెంజర్స్ నాలుగో రౌండ్‌కు ముందు అతడితో వైశాలి కరచాలనం చేయబోయింది. కానీ ఉజ్బెక్ ఆటగాడు అందుకు నిరాకరించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో..యాకుబోయెవ్ తీరుపై చెస్ అభిమానులు, నెటిజన్లు మండిపడ్డారు. దాంతో తన ప్రవర్తనపై 23 ఏళ్ల నోడిర్బెక్ వివరణ ఇచ్చాడు. 'వైశాలి, ఆమె సోదరుడిపట్ల నాకెంతో గౌరవం ఉంది. మతపరమైన ఆచారాల కారణంగా ఇతర స్త్రీలను తాకను. అయితే నా ప్రవర్తనతో వైశాలి నొచ్చుకున్నట్టయితే క్షమించాలి' అని నోడిర్బెక్ కోరాడు.

నేటి నుంచి నాగోబా మహా జాతర

» 30న పెద్ద దేవతకు పూజలు.. 31న నాగోబా దర్బార్



ఇంద్రవెల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మహా జాతరకు అంతా సిద్ధమైంది. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం రాత్రి 11గంటలకు మహాపూజల నిర్వహణతో జాతర ప్రారంభం కానుంది. ఈనెల 30వ తేదీన ఆలయం వెనుక ఉన్న పెద్ద దేవతకు పూజలు నిర్వహించే కార్యక్రమం ఉంటుంది. 31న మంత్రులు, జిల్లా అధికారుల సమక్షంలో దర్బార్ నిర్వహించి గిరిజనుల సమస్యలను తెలుసుకుంటారు. ఫిబ్రవరి 1న భేతల్ పూజలు, మండ గాజిలి పూజలు చేయడంతో నాగోబా జాతర అధికారికంగా ముగుస్తుంది. జాతరకు వచ్చే భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు వర్సిటీలను ప్రోత్సహించేలా ఉన్నాయ్

యూజీసీ మార్గదర్శకాలపై ఉన్నత విద్యా మండలి నివేదిక

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన కొత్త మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి చెప్పారు. ఈ మార్గదర్శకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విధానం ప్రైవేట్ వర్సిటీలను ప్రోత్సహించేలా ఉందన్నారు. వీసీలుగా ఉన్నతాధికారులను నియమించే విధంగా ఈ చర్యలు ఉన్నాయని స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో వీసీల నియామకం, ప్రొఫెసర్ల నియామకాల్లో పలు మార్పులను తీసుకొస్తూ యూజీసీ కొత్త మార్గదర్శకాల ముసాయిదాను రూపొందించిన విషయం తెలిసిందే. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి ఈ అంశంపై స్పందించారు. యూజీసీ ప్రతిపాదించిన మార్గదర్శకాలపై అధ్యయనానికి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ గుర్తించిన అంశాల ఆధారంగా ప్రభుత్వానికి ప్రత్యేక నివేదికను సమర్పించామని ఆయన చెప్పారు. ఈ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు నివేదికలోనూ పేర్కొన్నామన్నారు. ఈ మార్గదర్శకాలు అమల్లోకి వస్తే.. రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీలు దెబ్బతింటాయన్నారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఫిబ్రవరి 15లోపు రాష్ట్రంలోని అన్ని వర్సిటీల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు బాలకిష్టారెడ్డి చెప్పారు. వర్సిటీ నోడల్, సెక్టోరియల్ అధికారులతో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ వర్సిటీలు ఈ డేటాబేస్‌లోకి రావాలని సూచించారు. దేశంలోని అన్ని వర్సిటీలు ఈ డేటాబేస్‌లోకి వస్తున్నాయని చెప్పారు.

'ఎత్తిపోతల' విద్యుత్ డిమాండ్ 2237 మెగావాట్లు

» ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు వెల్లడించిన నీటిపారుదలశాఖ

హైదరాబాద్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరం(2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ దాకా)లో రాష్ట్రవ్యాప్తంగా గోదావరి, కృష్ణా బేసిన్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాల విద్యుత్ డిమాండ్ 2237.92 మెగావాట్లుగా ఉంటుందని నీటిపారుదల శాఖ లెక్కకట్టింది. వీటి వినియోగం కోసం 1611.30 మిలియన్ యూనిట్ల కరెంట్ అవసరమని తెలిపింది. కృష్ణా బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల వద్ద 50 పంపులు, గోదావరి బేసిన్‌లో 265 పంపులు వినియోగంలో ఉన్నాయని గుర్తించింది. మరో 145 పంపుల పనులు జరుగుతున్నాయని తెలిపింది. ఈమేరకు తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు 2025-26 సంవత్సరం డిమాండ్, వినియోగం నెలల వారీగా ఏ విధంగా ఉంటుందనే దానిపై సమాచారం ఇస్తూ లేఖలు రాసింది. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు 1611 మిలియన్ యూనిట్లు అవసరమని గుర్తు చేసింది.

డూప్లికేట్ గాంధీల వైఫల్యాలను ఎండగట్టాలి

» ఈ నెల 31న గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

» అపరిచితుడిలా.. సీఎం రేవంత్ మాటలు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టి 13 నెలలైనా హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అశోక్‌నగర్‌లో తెలంగాణ యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మొహం చాటేశారని విమర్శించారు. ఒరిజినల్ గాంధీ.. మహాత్మా గాంధీ అని.. ఆయన స్ఫూర్తిగా డూప్లికేట్ గాంధీలు ఇచ్చిన దొంగ హామీలు, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ అవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. 2 లక్షల ఉద్యోగాలిస్తామని రాహుల్ హామీ ఇచ్చి 400 రోజులు గడిచిన సందర్భంగా ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గాంధీ విగ్రహాలకు నివాళులర్పించి, వినతిపత్రాలు ఇవ్వాలని విద్యార్థి విభాగానికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చామని చెప్పుకొంటున్న ఉద్యోగాలన్నీ గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లవేనని చెప్పారు. రాష్ట్రంలో 12 వేలకుపైగా గ్రామ పంచాయతీలుంటే కేవలం 600గ్రామాల్లోనే పథకాల అమలు చేస్తామంటూ.. స్థానిక సంస్థల్లో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మానసిక స్థితిపై అనుమానాలు వస్తున్నాయని.. 15నిమిషాల్లోనే మాట మార్చి.. అపరిచితుడు సినిమాలో మాదిరిగా ప్రవర్తిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌కు దమ్ముంటే ప్రభుత్వం వచ్చాయంటున్న పెట్టుబడులు ఎప్పటిలోగా వస్తాయో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ పెట్టుబడులన్నీ వాస్తవ రూపం దాల్చితే తామే సీఎంకు సన్మానం చేస్తామని చెప్పారు.

స్వయంగా సెల్‌ఫోన్ వాడుతున్న కేసీఆర్!

» మనవడి వద్ద ఫోన్ వాడకం నేర్చుకున్న మాజీ సీఎం



హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు "ఎవరితో మాట్లాడాలి.. ఫోన్ కలిపి ఇవ్వు.. మాట్లాడతా.." అంటూ కుటుంబ సభ్యులు, తన వద్దకు వచ్చిన వారిని, వెంట ఉండేవారిని అడిగిన మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పుడు స్వయంగా సెల్‌ఫోన్ వాడుతున్నారు! పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగినప్పుడు కూడా సొంతంగా ఫోన్ వాడని ఆయన ఇప్పుడు ఫోన్ ఆపరేట్ చేయడం నేర్చుకున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, కవితతోపాటు తాను ఎప్పుడంటే అప్పుడు ఫోన్‌లో మాట్లాడాల్సిన ముఖ్యులు, సన్నిహితుల ఫోన్ నంబర్లను, పేర్లను సైతం అందులో సేవ్ చేసుకొంటున్నట్లు తెలుస్తోంది. మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షు ఆయనకు ఫోన్ వాడడం నేర్పించినట్లు సమాచారం.

నల్లగొండలో నేడు బీఆర్‌ఎస్ మహాధర్నా

నల్లగొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్లో రైతు మహాధర్నా నిర్వహించనున్నారు. ఈమేరకు నల్లగొండ గడియారం చౌరస్తాలో సోమవారం ఏర్పాట్లు పూర్తిచేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు మహాధర్నాను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారు.

ఆ బొగ్గుగనులు సింగరేణికే ఇవ్వాలి: కవిత

తెలంగాణ పరిధిలోని గోదావరి లోయలో ఉన్న బొగ్గు గనులన్నీ సింగరేణి సంస్థకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్రప్రభుత్వాన్ని సోమవారం ఎక్స్ వేదికగా ఆమె కోరారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి బొగ్గుగని కార్మికులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

గద్దర్‌కు 'పద్మ' అవార్డు.. పక్కా ఇయ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్ చేసింది గద్దర్‌గారి మీద. అనేకమందిని పోలీసులను ఎన్‌కౌంటర్ పేరుతో మర్డర్ జేసిండు. అటువంటి వ్యక్తి పేరును ఏ విధంగా పంపుతారు?" అని గట్టిగా ప్రశ్నించారు. నక్సల్ భావజాలమున్న నాయకులు బీజేపీలో ఉన్నారని, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారని.. ఎంపీ ఈటల రాజేందర్‌నుద్దేశించి కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యపైనా సంజయ్ స్పందించారు. "ఈటల రాజేందర్‌కు వామపక్ష భావజాలం ఉండవచ్చు.. కానీ ఆయన నక్సలైట్ కాదు" అని స్పష్టం చేశారు. నక్సలైట్లు కాంగ్రెస్, టీడీపీ నాయకులను కూడా హత్యచేసిన సంగతి మరచిపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే గద్దర్ అవార్డులను తమ పార్టీవారు తీసుకోబోరని సంజయ్ ప్రకటించారు. ఏపీకి 5 పద్మ పురస్కారాలు వచ్చాయి కదా? అని విలేకరులు ప్రశ్నించబోగా.. "పోయినసారి తెలంగాణకు పొట్టు పొట్టు వచ్చినయ్. అప్పుడేమన్నారు వారప్పుడు?" అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం, ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అనే ఆలోచన ఎప్పుడూ ఉండదని.. ఈ రాష్ట్రానికి ఇవ్వాలి, ఆ రాష్ట్రానికి ఇవ్వద్దని ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.



ఆ పేర్లు పెట్టాల్సిందే..

కేంద్ర పథకాల పేర్ల మార్పునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్రం నుంచి నిధులు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా పథకాల పేర్లే మార్చేస్తోందని.. అలా మార్చితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి సంక్షేమ పథకాల పేర్లను మార్చే ప్రయత్నం చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే వాటిని నేరుగా లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని కేంద్రం సీరియస్‌గా పరిశీలిస్తోందని.. ఆ పరిస్థితి కొనితెచ్చుకోవద్దని.. రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. "మీ నిధులతో అమలు చేసే సంక్షేమ పథకాలకు ఇందిరా గాంధీ పేరు పెట్టుకుంటారో, ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం వంటివారి పేర్లు పెట్టుకుంటారో పెట్టుకోండి.. మాకేం అభ్యంతరం లేదు. కానీ, కేంద్ర సంక్షేమ పథకాలకు పేర్లు మారుస్తామంటే ఊరుకోం" అని హెచ్చరించారు. "రేషన్‌కార్డులు, ఉచిత బియ్యం కేంద్రం ఇస్తుంటే మీ ఫోటో పెట్టుకుంటారా? ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్‌యోజన అని రేషన్‌కార్డుపై ఉంటే.. ఇందిరమ్మ ఇళ్లపై పీఎం ఆవాస్ యోజన అని పెడితే ఇబ్బంది ఏంటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి పేరు రావొద్దన్నదే కాంగ్రెస్ ఆలోచన అని మండిపడ్డారు. రిపబ్లిక్ డే నాడు నాలుగు పథకాలపై ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయిందని విమర్శించారు. "అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని మీరు చేసిన ప్రకటన వాస్తవం కాదా? మరి ఒక మండలంలో ఒక గ్రామంలోనే అర్హులున్నరా? ఒకటే గ్రామంలో రైతు భరోసాకు అర్హులున్నరా? మిగతా గ్రామాల ప్రజలు ఓట్లేయలేదా? ఇదేమైనా పైలట్ ప్రాజెక్టా?" అని నిలదీశారు. రేషన్ కార్డుల జారీ, రైతుభరోసా అమలులో రాష్ట్ర ప్రభుత్వం దారుణ మోసం చేసిందని దుయ్యబట్టారు. వర్సిటీలపై కేంద్రం పెత్తనం చేస్తోందంటూ సీఎం రేవంత్ చేసిన ఆరోపణపైనా ఆయన స్పందించారు. ప్రజలకు ఏది న్యాయమో, దేశానికి ఏది అవసరమో అదే చేస్తామని.. దానిని ఇంకొకరు విమర్శిస్తే పట్టించుకోబోమని తేల్చిచెప్పారు.

గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు

భావజాలం గుర్తుకు రాలేదా?

» బీజేపీ నేతలకే అవార్డులివ్వాలని రాజ్యాంగంలో ఉందా?

» బండి సంజయ్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్

» బీజేపీకి వంతపాడే వారికే పద్మ అవార్డులా? : చామల

» లెఫ్టిస్టు ఈటలను ఎలా చేర్చుకున్నారు?: అన్వేష్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): "ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు బీజేపీ నేతలకు ఆయన భావజాలం గుర్తుకు రాలేదా?" అని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. "ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతలకే అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో ఉందా?" అని నిలదీశారు. నక్సలైట్లతో కలిసి బీజేపీ కార్యకర్తలను చంపించిన గద్దర్‌కు పద్మ పురస్కారం ఎలా ఇస్తామంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికే అవార్డులు ఇస్తామన్నట్లుగా ఉన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సూత్రాలపై ప్రధాని మోదీకి నమ్మకం ఉంటే ఆయన్ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. "కరసేవకులపై కాల్పులు జరిపించిన నేతలకు అవార్డులు ఇచ్చినప్పుడు బీజేపీ భావజాలం ఎటుపోయింది? లెఫ్టిస్టు భావజాలం ఉన్న నేతలు ఇప్పుడు బీజేపీలో లేరా? 'నక్సలిజం నా అజెండా' అని చెప్పిన ఈటలను పార్టీలో చేర్చుకుని ఎంపీ పదవి ఇవ్వలేదా? నక్సలైట్లే దేశ భక్తులన్న ఎన్టీఆర్‌తో పొత్తు పెట్టుకోలేదా? గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎంత మంది బీజేపీ భావజాలం ఉన్న వారు ఆ పార్టీ టిక్కెట్టుపై పోటీ చేశారు?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. బీజేపీ నేతలు సిద్ధాంతానికి, భావజాలానికి ఎప్పుడో తిలోదకాలు ఇచ్చేశారని ఎద్దేవా చేశారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా.. బీజేపీకి జైకొట్టే వారికి, వంత పాడే వారికే పద్మా అవార్డులు ఇస్తారా అని ప్రశ్నించారు. "బండి సంజయ్ కేంద్ర మంత్రా.. లేక కార్పొరేటరా? పరేడ్ గ్రౌండ్లో ప్రధాని మోదీ సభకు గద్దర్ వచ్చిన సంగతి ఆయన మరిచారా?" అని ఆశ్చర్యం వెలిబుచ్చారు. గద్దర్‌పైన చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాను లెఫ్టిస్టునని చెప్పుకునే ఈటలను కమలనాథులు బీజేపీలో చేర్చుకుని రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇవ్వబోతున్నారని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రశ్నించారు.

పక్కదోవ పట్టించేందుకే..

కాంగ్రెస్ పథకాలు ప్రజల్లోకి వెళితే తెలంగాణలో ఏ ఇతర పార్టీకీ పుట్టగతులుండవని.. అందుకే, ప్రజలను పక్కదోవపట్టించేందుకు బండి ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. గద్దర్ సహా తెలంగాణ కవులు, కళాకారులను కించపరిచేలా మాట్లాడిన బండి సంజయ్.. క్షమాపణ చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. కాషాయ కండువా కప్పుకున్నోళ్లకే పద్మ అవార్డులంటున్న బండి సంజయ్‌కి కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులిస్తే వచ్చేది కేవలం 10 శాతం మాత్రమేనని.. పూర్తి నిధులు ఇచ్చి నచ్చిన పేరు పెట్టుకోవాలని బండి సంజయ్‌కి టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి సూచించారు. గద్దర్ చనిపోయినప్పుడు ఆయన్ను పొగుడుతూ మోదీ లేఖ రాశారని గుర్తు చేశారు. ఇక.. ప్రధాని మోదీయే గద్దర్ గొప్పతనం గురించి పొగిడారని టీపీసీసీ నేత ఇందిరాశోభన్ గుర్తుచేశారు. కేంద్ర మంత్రుల చెప్పులు మోసిన బండి సంజయ్‌కి మేధస్సు, మెదడు లేవన్నారు. తెలంగాణను అవమానించిన బండి సంజయ్‌ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా.. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సరికావని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గద్దర్‌లాగే ఈటల రాజేందర్ కూడా వామపక్ష భావజాలం ఉంచి వచ్చిన నాయకుడేనని, ఆయన మాత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి అర్హుడా అని ప్రశ్నించారు.

మధ్యాహ్న భోజన ధరలను 50% పెంచాలి!

» ఇంటర్ విద్యార్థులకూ భోజనం పెట్టాలి

» గురుకులాలు, హాస్టళ్లలో శుభ్రత పెంచాలి

» రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ నివేదిక



విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరలను 50 శాతం పెంచాలని రాష్ట్ర విద్యా కమిషన్ సర్కారుకు సిఫారసు చేసింది. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించింది. ఈ రెండు నిర్ణయాలను అమలు చేస్తే ప్రభుత్వంపై ఏడాదికి రూ.191కోట్ల అదనపు భారం పడుతుందని పేర్కొంది. ఈ మేరకు విద్యా కమిషన్ ప్రభుత్వానికి ప్రత్యేక నివేదికను సమర్పించింది. ఇటీవల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆహారం కలుషితమై దురదృష్టకరమైన ఘటనలు జరిగిన నేపథ్యంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు విశ్వేశ్వరరావు, వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లు, కేజీబీవీలు, అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి వివిధ వర్గాలతో విస్తృతంగా చర్చలు జరిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఆహార నాణ్యత, భద్రత, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యంలో లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను రూపొందించారు. 'మధ్యాహ్న భోజన పథకం- ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆహార నాణ్యత, భద్రతపై సిఫారసులు' శీర్షికతో సోమవారం నివేదికను సీఎస్ శాంతికుమారికి అందజేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పెంచడానికి పలు అంశాలను ప్రస్తావించారు. మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న స్వయం సహాయక సంఘాలకు వారం వారం చెల్లింపులు చేయాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని గురుకులాలు, హాస్టళ్లకు అవసరమైన వస్తువులు, సరుకులను ఒకే గొడుగు కింద కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ విద్యా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) ద్వారా సరుకులను కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. వంటశాల, వస్తువులు నిల్వ చేసే గదులను శుభ్రంగా ఉంచాలని, భోజన నాణ్యత కోసం ఏం చేయాలనేదానిపై ప్రామాణికాలను ఖరారు చేయాలన్నారు. ఈ విషయంలో వంట మనుషులకు, టీచర్లకు శిక్షణ ఇవ్వాలని నివేదికలో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రయోజనాలను కాపాడండి

» ఏపీ బనకచర్ల ప్రాజెక్టు పూర్తయితే నీటి కోటాలో నష్టం

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్ లేఖ



హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాజెక్టుల అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో ప్రాజెక్టుల నిర్మాణం జాప్యమవుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేంద్రం వద్ద రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు అనుమతికి నోచుకోవడం లేదని.. దీనిపై దృష్టి సారించాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి హరీశ్ లేఖ రాశారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు చొరవ చూపాలని అందులో కోరారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడం వల్ల తెలంగాణ సాగునీటి ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. అనుమతుల్లేకుండానే ఏపీ ఈ ప్రాజెక్టును తలపెట్టిందని గుర్తు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు నిధుల కోసం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారన్నారు. 'తెలంగాణ సర్కారు పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రం పట్టించుకోవడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రణాళికల అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉండడం శోచనీయం. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతి 6 నెలలుగా పెండింగ్‌లో ఉంది. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ జారీపై కేంద్రం జోక్యం అవసరం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు వచ్చేలా దృష్టిపెట్టాలి' అని హరీశ్ పేర్కొన్నారు. కాగా, పథకాల అమలులో ఎన్నిసార్లు మాట మార్చుతారని.. ఎన్నిసార్లు ప్రజలను మోసం చేస్తారని సీఎం రేవంత్‌ను 'ఎక్స్' వేదికగా నిలదీశారు. ఇంకా 20 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేయనే లేదని ఆరోపించారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని వానకాలం ఎగవేశారన్నారు. ఇప్పుడు మళ్లీ మార్చి 31 వరకు అంటున్నారని మండిపడ్డారు.

పాలమూరును నిర్లక్ష్యం చేసింది బీఆర్‌ఎస్సే: మధుసూదన్‌రెడ్డి

పాలమూరు జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని దేవరకద్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరంపైన ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి చేసిన కేసీఆర్.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును మాత్రం గాలికొదిలేశారని విమర్శించారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్లో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. పాలమూరు జిల్లాపై హరీశ్‌రావు వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 2017లో కోయిల్‌సాగర్‌కు వచ్చి 50 వేల ఎకరాలకు అదనంగా నీళ్లు ఇస్తామని చెప్పి.. ఒక్క ఎకరాకూ ఇవ్వలేదన్నారు. 'దమ్ముంటే హరీశ్ తడిబట్టలతో కురుమూర్తి ఆలయానికి రావాలి. నేను.. మా పార్టీ ఎమ్మెల్యేలు రావడానికి సిద్ధమే' అంటూ సవాల్ విసిరారు.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో..

రోజువారీ విచారణ



(మొదటిపేజీ తరువాయి)

విచారణకు అంతరాయం కలిగిస్తున్నారని, ప్రభావితం చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా ఆయనకు మినహాయింపునిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ కూడా సవాల్ చేయలేదని గుర్తు చేశారు. పదేళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విని, ఎటువంటి నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు న్యాయాధికారులు బదిలీ అయ్యారని గుర్తుచేశారు. కనీసం ఒక్క డిశ్చార్జ్ పిటిషన్‌పైనా తుది నిర్ణయం రాలేదన్నారు. కేసుల బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని.. తామిప్పుడు కేసు విచారణ త్వరగా చేపట్టాలని, పర్యవేక్షణ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని శ్రీనివాసన్ తెలిపారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పైనే ఉన్నారని, సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా ట్రయల్‌లో జాప్యం జరుగుతోందని మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జగన్ అక్రమాస్తుల కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేసినట్లు దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది వివరించారు. జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. కేసుల విచారణను హైకోర్టు పర్యవేక్షిస్తోందని, ట్రయల్ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇది రాజకీయపరమైన పిటిషన్ అని తెలిపారు. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ హైకోర్టు జగన్ అక్రమాస్తుల కేసును పర్యవేక్షిస్తున్నందున కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ కేసులకు కూడా వర్తిస్తుందని స్పష్టంచేసింది. ట్రయల్ కోర్టు రోజువారీ విచారణ చేపట్టాలని, హైకోర్టు కూడా పర్యవేక్షించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది. అలాగే హైకోర్టు పర్యవేక్షణ నేపథ్యంలో జగన్ బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై ప్రత్యేకంగా విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని పేర్కొంది. అందుకే పిటిషన్‌ను డిస్మిస్ చేయాలా.. ఉపసంహరించుకుంటారా అని రఘురామ తరఫు సీనియర్ న్యాయవాదిని ప్రశ్నించింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు శ్రీనివాసన్ తెలపగా.. ధర్మాసనం అంగీకరించింది. గతంలో జగన్ అక్రమాస్తుల కేసులను జస్టిస్ అభయ్‌ఎస్‌ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించగా.. అనూహ్యంగా గత విచారణ నుంచి ఆ కేసులు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి బదిలీ అయిన విషయం విదితమే.

సమీకృత గురుకులాలకు పచ్చజెండా

» కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లో నిర్మించేందుకు టెండర్లు

» 1 నుంచి 18 దాకా దాఖలుకు చాన్స్

» ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు

బ్లాక్..	విస్తీర్ణం (చదరపు అడుగులు)
అకడమిక్	1,57,860
హాస్టల్, వార్డెన్ల నివాస గదులు కలిపి	2,46,695
భోజనం హాల్	38,628
స్టాఫ్ క్వార్టర్లు	12,105
మొత్తం విస్తీర్ణం	4,55,772

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల విషయంలో కీలక అడుగు పడింది. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సమీకృత గురుకులాలను నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండు విడతల్లో కలిపి 54 చోట్ల నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేసింది. వీటిలో తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిర, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో వీటిని నిర్మించేందుకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు టెండర్లను స్వీకరించనున్నట్లు టెండర్ నోటీస్‌లో పేర్కొంది. సాంకేతిక బిడ్‌లను ఫిబ్రవరి 21న, ధరల బిడ్‌లను ఫిబ్రవరి 28న తెరవనున్నట్టు తెలిపింది. అయితే మొత్తం సమీకృత గురుకుల భవనం రూ.135 కోట్లు ఖర్చుకానుండగా.. ఫర్నిచర్, ఇంటీరియర్‌కు రూ.15 కోట్లు అవుతుందని అధికారులు అంచనాల్లో పేర్కొన్నారు. మరో 45-50 కోట్ల వరకు వివిధ రకాల ట్యాక్స్‌లు, జీఎస్టీకే ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఒక్కో గురుకులాన్ని రూ.200 కోట్లతో.. 20-25 ఎకరాల్లో 4,55,772 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. అయితే ఇప్పటివరకు మంజూరైన ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలకు లభ్యమయ్యే స్థలాన్ని బట్టి నిర్మాణాలు ఉండ నున్నాయి. సాధ్యమైనంత త్వరగా వీటి నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

బ్లాకుల వారీ నిర్మాణాలు..

సమీకృత గురుకులాల నమూనా ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకులాలన్నీ కలిపి 2,560మంది విద్యార్థులు కూర్చునేలా క్లాస్ రూమ్‌లను ఏర్పాటుచేయనున్నారు. హాస్టల్‌లో పిల్లలకు సౌకర్యంగా ఉండేలా 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రెండు బెడ్లతో కూడిన (ఒకదానిపై ఒకటి ఉండేలా) పడకలను, ఇక 9నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఒక్కోబెడ్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఒక్కోదానిలో 1,280మందికి సరిపడే బెడ్స్ అందుబాటులో ఉంచనున్నారు. అక్కడ పనిచేసే సిబ్బందికి కూడా సౌకర్యాలను కల్పించనున్నారు. ఇందులోభాగంగా ఒక్కో స్కూల్ ప్రిన్సిపల్‌కు ఒకటి చొప్పున 4నివాస సముదాయాలను నిర్మించనున్నారు. టీచింగ్‌స్టాఫ్ కోసం 24 క్వార్టర్లు, మెయింటెనెన్స్ స్టాఫ్ కోసం 8 క్వార్టర్లు, వార్డెన్ల కోసం (డార్మిటరీ విభాగం) 26 నివాస గదులను ఏర్పాటుచేయనున్నారు.

వర్గీకరణను అడ్డుకుంటోంది వివేక్ వెంకటస్వామే..

» 7న 'లక్ష డప్పులు వెయ్యి గొంతుల'తో సత్తా చాటుతాం: మందకృష్ణ మాదిగ



బర్కత్‌పుర/ పంజాగుట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకుంటోంది వివేక్ వెంకటస్వామితో పాటు మరి కొందరు మాల నాయకులేనని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి మాట మారుస్తున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే నిర్వహించిన మీట్ ది ప్రెస్‌మీట్‌లో అనంతరం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, శ్రీ విద్యాశక్తిపీఠం, వైదిక బ్రాహ్మణ సంఘం, ఆల్ ఇండియా బ్రాహ్మణ సంఘం, కురుమ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సదస్సులో మందకృష్ణ మాట్లాడారు. వర్గీకరణకు తాము అనుకూలమని సీఎం రేవంత్ హామీ ఇచ్చి 4 నెలలైందని, అయినా ఇప్పటివరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. ఈ విషయంలో ఇక ఆగేది లేదని తేల్చి చెప్పారు. ఫిబ్రవరి 7న 'లక్ష డప్పులు వెయ్యి గొంతుల'తో మాదిగల సత్తా చాటబోతున్నట్లు చెప్పారు. మాదిగ దండోరా ఏ కులానికో, మతానికో పరిమితం కాదన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణ, వైశ్యులు రాజకీయ వివక్షకు గురవుతున్నారని, యాదవ-కురుమ సామాజిక వర్గాల మధ్య కూడా అన్యాయం జరుగుతోందని తెలిపారు. తెలుగు నేలపై మాదిగల పోరాటాలకు గుర్తింపుగా కేంద్రప్రభుత్వం తనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చిందని, దీనిని వేరే విధంగా చూడవద్దని కోరారు. తనకు పద్మశ్రీ వచ్చిన తర్వాత సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో పరమార్థం ఏమిటో అంతుచిక్కట్లేదని అన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఇంధన పరివర్తన కేంద్రం

» టెరి, బీఈఈ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు

» కేంద్ర మంత్రి ఖట్టర్, సీఎం సమక్షంలో ఒప్పందం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంధన పరిశోధన సంస్థ (టెరి), ఇంధన పొదుపు సంస్థ (బీఈఈ)లతో సంయుక్త భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ప్రపంచ శ్రేణి ఇంధన పరివర్తన కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్-సీఓఈ) ఏర్పాటు కానుంది. సంప్రదాయ (థర్మల్) ఇంధన వనరులకు బదులుగా 2070 నాటికి కాలుష్య రహిత ఇంధనాల వినియోగం దిశగా అడుగులు వేసి, 'నెట్ జీరో' (కర్బన ఉద్గారాలు లేని) స్థాయికి పరివర్తన (ట్రాన్సిషన్) చెందాలని దేశం పెట్టుకున్న లక్ష్య సాధనలో సీఓఈ కీలక పాత్ర పోషించనుంది. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కాగా.. ఆ భేటీలో పరస్పర అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేసుకొని, పరస్పరం పత్రాలు మార్చుకున్నారు. బీఈఈ, టెరిల ఉన్నతాధికారులు సోమవారం ఆన్‌లైన్ ద్వారా తెలంగాణ రెడ్కో వీసీ, ఎండీ వి.అనీల, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారుడు ఎ.చంద్రశేఖర్ రెడ్డితో సమావేశమై సీఓఈ ఏర్పాటుపై చర్చించారు. తెలంగాణ జెన్‌కో సీఓఈ ఏర్పాటుకు అవసరమైన పరిశోధన వ్యవహారాలు, ఇంధన ఉత్పత్తి/సరఫరా/పంపిణీలో సామర్థ్యం పెంపుదల, నష్టాల తగ్గింపుతో పాటు ఇతర సాంకేతిక సహాయాన్ని అందిస్తుందని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీఓఈకి అవసరమైన నిధులను బీఈఈ కేటాయిస్తుందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

2026 ఏషియా క్రీడలకు రండి

» మంత్రి శ్రీధర్ బాబుకు జపాన్ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జపాన్‌లో జరగనున్న 20వ ఏషియా క్రీడలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును జపాన్ ప్రభుత్వం ఆహ్వానించింది. నగర పర్యటనకు వచ్చిన జపాన్‌లోని ఐచీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన బృందం సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైంది. ఏషియా క్రీడలు జపాన్‌లోని తమ రాష్ట్రంలో జరుగుతున్నాయని ఐచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహిటో కొండో తెలిపారు. ఐచీ రాష్ట్రంలోని గిబ్లీ యానిమేషన్ ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందని, దానిని సందర్శించాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జపాన్‌లోని ఐచీ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కేటీఆర్‌కు ఆవేశమెక్కువ.. ఆలోచన తక్కువ

» మా రేవంత్.. చింతమడక సీఎం కాదు: మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'సీఎం రేవంత్ రెడ్డి కొత్త పథకాలను ఒక్క గ్రామానికే పరిమితం చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భ్రమపడుతున్నారని, ఆయనకు ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క విమర్శించారు. పథకాలు రాని గ్రామాలు రణరంగంగా మారుతాయని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పథకాలతో గ్రామాల్లో పండగ వాతావరణం కన్పిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేకపోతున్నారని విమర్శించారు. ఒక గ్రామంలో పథకాల అమలును లాంచనంగా మొదలు పెట్టి.... ఇతర గ్రామాలకు విస్తరిస్తారన్న ఇంగితజ్ఞానం లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమే కేటీఆర్ పని అని మండిపడ్డారు. బీఆర్ఎస్ లాగా ఎన్నికల లబ్ధి కోసం తాము పథకాలు అమలు చేయడం లేదన్నారు.

మంత్రితో ముఖాముఖి పునఃప్రారంభం

» రేపు దరఖాస్తులు స్వీకరించనున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమం బుధవారం పునఃప్రారంభం కానుంది. నెల రోజులకు పైగా విరామం తర్వాత జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొననున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు ఆయన స్వీకరించనున్నారు. వాస్తవానికి టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన రోజే.. ప్రతి బుధ, శుక్రవారాల్లో గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే మొదట్లో సజావుగానే ఇది నడిచినా.. వివిధ కారణాలు చూపుతూ తర్వాత మంత్రులు కార్యక్రమానికి హాజరు కాలేదు. డిసెంబర్ తొలి వారంలో చివరిసారిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు, సంక్రాంతి నేపథ్యంలోనే మంత్రితో ముఖాముఖి జరగలేదని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

సరస్వతి పుష్కరాలకు రూ. 25 కోట్లు

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో జరగనున్న సరస్వతి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. మే 15 నుంచి 26 వరకు సరస్వతి నదీ పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరఘాట్ల నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, పార్కింగ్, రోడ్ల తాత్కాలిక మరమ్మత్తులు ఇతర ఏర్పాట్ల నిమిత్తం ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సరస్వతి పుష్కరాల నిర్వహణకు రూ. 25 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

» 5న సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడి: జేఏసీ

పంజాగుట్ట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తమ సొంత డబ్బులు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. తమ బిల్లు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు నర్సింహ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు తమ పెండింగ్ బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం కనుక వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఫిబ్రవరి 5న సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



భారత్ పర్వ్‌లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ శకటం

» 31 వరకు ఎర్రకోట ప్రాంగణంలో సందర్శనకు అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత్ పర్వ్‌లో తెలంగాణ శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ శకటంతోపాటు రాష్ట్ర టూరిజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును రెసిడెంట్ కమిషనర్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ప్రారంభించి మాట్లాడారు. రుద్రమ స్ఫూర్తితో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సంపూర్ణ సామరస్యంతో పాలన అందిస్తోందన్నారు. ఈ నెల31 వరకు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ శకటాన్ని ప్రతిఒక్కరూ చూడాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజనుల గుస్సాడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

టకీ టకీ భరోసా

(మొదటిపేజీ తరువాయి)



తెలిసిందే. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు శ్రీకారం చుట్టిన రేవంత్ సర్కారు.. వీటి ద్వారా తొలిరోజు మొత్తం 6,15,677 మంది అర్హులకు లబ్ధి చేకూర్చింది. ఆయా గ్రామాల్లోని రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కార్డులు జారీ చేశారు. ఇల్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. 26న బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం ఉదయం నుంచి ఈ నిధులు రైతుల ఖాతాల్లోకి చేరాయి.

భూమిలేని రైతు కూలీలకు రూ.6 వేలు..

తొలిసారిగా ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మొదటి విడతకుగాను రూ.10.91 కోట్లను విడుదల చేసింది. తొలి రోజు 18,180 మంది వ్యవసాయ కూలీల ఖాతాల్లో ఒక్కో కుటుంబానికి రూ.6 వేల చొప్పున ఈ నగదును జమ చేశారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. కాగా, గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన వారి నిరీక్షణ ఫలించింది. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల జారీని ప్రభుత్వం ప్రారంభించింది. వీటితోపాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేశారు. తొలి రోజు మొత్తం 15,414 కొత్త కార్డులు ఇచ్చారు. వీటి ద్వారా 51,912 మందికి లబ్ధి చేకూరనుంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అదనపు సభ్యుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేశారు. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేయనున్నారు. ఇక ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా 72 వేల మందికి తొలి రోజు ఇంటి పత్రాలను అందజేశారు.

ఇండ్ల దరఖాస్తుల పరిశీలన వారంలో పూర్తి..

ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తుల పూర్తిస్థాయి పరిశీలన ప్రక్రియ మరో వారంలో పూర్తి కానుంది. ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది. 2023 డిసెంబరులో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామీణ ప్రాంతాల్లో 69,83,895 దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 10,70,659 దరఖాస్తులు కలిపి మొత్తం 80,54,554 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటివరకు 7.77లక్షల దరఖాస్తుల పరిశీలన జరగ్గా.. మిగిలినవాటిని పరిశీలిస్తున్నారు. పథకం ప్రారంభానికి ముందుగానే దరఖాస్తుదారుల పరిశీలనతో పాటు, సర్వే చేసిన వాటిలో అర్హులు, అనర్హులను కూడా తేల్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం మొదటిదశలో క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాలను సేకరించాలని, రెండో దశలో వాటిని 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌లో ఉంచి క్షుణ్ణంగా పరిశీలించి పథకానికి అర్హులో, కాదో తేల్చాలని నిర్ణయించింది. కాగా, ఈ నెల 26న ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించడానికి ముందు.. మొదటి విడత అర్హులుగా తేల్చినవారి జాబితాలను ప్రకటించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ గ్రామసభల్లోనే మరోసారి పథకానికి దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దాంతో పూర్తిస్థాయి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిలిచిపోయింది.

40 లక్షల దరఖాస్తుల పరిశీలన..

మండలానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు ప్రారంభమైన నేపథ్యంలో.. మళ్లీ ఇప్పుడు పూర్తిస్థాయి పరిశీలనపై అధికారులు దృష్టి సారించారు. పథకం కోసం వచ్చిన మొత్తం 80.50 లక్షల దరఖాస్తుల్లో ఇప్పటివరకు సుమారు 40 లక్షల వరకు పూర్తిస్థాయి పరిశీలన జరిగింది. ఇందులో 21.30 లక్షల మందికి ఇళ్ల స్థలాలుండగా.. మరో 18.70 లక్షల మందికి ఇళ్ల స్థలాలు లేవని తేలినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఆర్‌సీసీ ఇండ్లలో ఉంటున్నట్టు వచ్చిన దరఖాస్తులను అధికారులు పక్కనబెట్టారు. మొదటి ప్రాధాన్యం కింద ఎంచుకున్న కేటగిరీల వారికి ఇళ్లను కేటాయించిన తరువాత ఆర్‌సీసీ ఇండ్లలో ఉంటున్న వారిలోనూ నిజమైన అర్హులకు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిసింది. పూర్తిస్థాయి పరిశీలనలో వచ్చిన వివరాల ప్రకారం 28-30 శాతం రేకుల షెడ్లు, 25 శాతం గుడిసెలు, పూరిళ్లు, మిగిలిన వారు జీఐ షీట్లు, టార్పాలిన్ పట్టాలు కప్పుకొన్న ఇళ్లు, టైల్డ్ రూఫ్ ఇళ్లలో ఉంటున్నట్లు తేలింది. ఇక తాజాగా నిర్వహించిన గ్రామసభల్లోనూ ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు లక్షల్లో వచ్చాయి. వీటి పరిశీలనకు అవసరమైన సూచనలను త్వరలో విడుదల చేయనున్నారు. పరిశీలన పూర్తయ్యాక అర్హులుగా తేలిన వారికి పథకం అందనుంది.

హామీలను అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి.. సోమవారం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిందని తెలిపారు. మొదటి విడతగా ప్రతి మండలానికి ఒక్కో గ్రామం చొప్పున 9,48,333 ఎకరాలకు పెట్టుబడి సాయం అందించినట్లు పేర్కొన్నారు. వీటికి సంబంధించి 4,41,911 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.569 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాల వారీగా వివరాలను మంత్రి సోమవారం విడుదలచేశారు. కాగా, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన రైతుల ఆందోళన ఘటనపై అచ్చంపేట ఎమ్మెల్యేతో పాటు అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని అన్నారు.

తొలిరోజు రైతు భరోసా కింద జమ అయిన నగదు జిల్లాలవారీగా..

జిల్లా	ఎకరాలు	రూ. కోట్లలో
ఆదిలాబాద్	24150	14.49
కొత్తగూడెం	65117	39.07
హన్మకొండ	23833	14.3
జగిత్యాల	25817	15.49
జనగాం	26517	15.91
భూపాలపల్లి	14450	8.67
గద్వాల	20783	12.47
కామారెడ్డి	13917	8.35
కరీంనగర్	26600	15.96
ఖమ్మం	47367	28.42
ఆసిఫాబాద్	14367	8.62
మహబూబాబాద్	30233	18.14
మహబూబ్‌నగర్	28783	17.27
మంచిర్యాల	14533	8.72
మెదక్	23433	14.06
మేడ్చల్	5233	3.14
ములుగు	13767	8.26
నాగర్ కర్నూలు	38417	23.05
నల్లగొండ	78217	46.93
నారాయణపేట	23117	13.87
నిర్మల్	17600	10.56
నిజామాబాద్	30950	18.57
పెద్దపల్లి	16900	10.14
రాజన్న సిరిసిల్ల	20433	12.26
రంగారెడ్డి	33867	20.32
సంగారెడ్డి	40250	24.15
సిద్దిపేట	61267	36.76
సూర్యాపేట	63067	37.84
వికారాబాద్	18633	11.18
వనపర్తి	20417	12.25
వరంగల్	21383	12.83
భువనగిరి	44917	26.95
మొత్తం	948333	569 కోట్లు

ఇది గాంధీ.. గాడ్సే పరివార్‌ల మధ్య యుద్ధం

» రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుదాం

» ఇండోర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): " ఇది ఎన్నికల ర్యాలీ కాదు. గాంధీ, గాడ్సే పరివార్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం. గాడ్సే పరివార్ వైపు నుంచి మోదీ.. గాంధీ పరివార్ వైపు నుంచి రాహుల్‌గాంధీ పోరాడుతున్నారు. గాంధీ పరివార్‌కు చెందిన మనమంతా రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలుద్దాం. రాజ్యాంగ పరిరక్షణకు కలిసి కట్టుగా పోరాడదాం" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సోమవారం ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూ, జై భీమ్.. జై సంవిధాన్ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ యుద్ధం రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడేవారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవారికి మధ్య జరుగుతోందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీతో కలిసి మనం ఈ పోరాటం చేస్తున్నామన్నారు. మోదీ.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ రాజ్యాంగాన్ని మార్చేదుకు ప్రయత్నిస్తూనే ఉన్నారని రేవంత్ విమర్శించారు. ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన రాహుల్ గాంధీ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నారని చెప్పారు. హిందుస్థాన్‌ను దోచుకోవడానికి గజనీ మహమ్మద్ ప్రయత్నించినట్లుగా.. రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ.. ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆనాడు దేశాన్ని రక్షించుకునేందుకు బ్రిటిషర్లను మహాత్మాగాంధీ ఎదుర్కొన్నట్లుగా.. భారతీయ జనతా పార్టీ పేరుతో చెలామణీ అవుతున్న బ్రిటిష్ జనతా పార్టీని రాహుల్ గాంధీ ఎదుర్కొని నిలబడ్డారని అన్నారు. అందుకే రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించట్లేదని చెప్పారు. ఈ యుద్ధంలో అందరమూ రాహుల్‌గాంధీతో కలిసి నడుద్దామని, రాజ్యాంగ పరిరక్షణకు కలిసి కట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని రేవంత్ పేర్కొన్నారు

మూడు 'ఎమ్మెల్సీ'లనూ గెలుచుకుంటాం

» రాజకీయాలను ఈ ఎన్నికలు మలుపు తిప్పుతాయి

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా



హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పబోతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకుని బీజేపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని.. దానికి ఈ ఎన్నికలు కీలకమవుతాయని తెలిపారు. అభ్యర్థులను ప్రకటించడంలో ప్రత్యర్థుల కంటే ముందు ఉన్నామని, ప్రచారం కూడా అదే రీతిన కొనసాగుతోందని చెప్పారు. ఓటరు నమోదు కోసం పని చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రతీ 50 ఓటర్లకు ఒక కార్యకర్తకు బాధ్యత ఇవ్వాలన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షణకు సంబంధించి సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఒక్కో జిల్లాకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించారు.

పింఛన్ కోసం 80 ఏళ్ల వృద్ధురాలి ఎదురుచూపు

జాతీయ జెండాకు విన్నవించుకున్న వైనం



గరిడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధురాలి వయసు 80 ఏళ్లు. భర్త కన్ను మూశాడు. ఆమెను చూసుకునేందుకు పిల్లలు లేరు. సర్కారు ఇచ్చే పింఛన్‌కు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తనకు పించన్ ఇప్పించాలని కోరుతూ ఆ వృద్ధురాలు జాతీయ జెండాకు విన్నవించుకున్న చిత్రం సోషల్‌మీడియా ద్వారా సోమవారం వెలుగుచూసింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన లక్కమల్ల ఆరోగ్యమ్మ భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం ఆరోగ్యమ్మ కాలు విరగడంతో నడవలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో స్థానిక పాఠశాల వద్ద గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎగురవేసిన జాతీయ జెండా వద్దే ఆమె వేచి ఉంది. తనకు పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంది. పెద్దలు, ఉపాధ్యాయులు ఆ వృద్ధురాలికి నచ్చజెప్పి ఇంటికి పంపారు. ఈ విషయమై ఎంపీడీవో సరోజ వివరణ కోరగా పింఛన్ మంజూరు ప్రభుత్వ పరిధిలో నిదని, ఆమె మరోసారి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ వేడి!

(మొదటిపేజీ తరువాయి)

పదవీ కాలమూ ఆ రోజుతోనే పూర్తి కానుంది. వీటిలో నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుకు జరిగే ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఉత్తర తెలంగాణ పట్టభద్రుల తీర్పు... ప్రభుత్వ పనితీరుకు గీటురాయిలా ప్రతిబింబిస్తుందని అంచనా వేస్తోంది. కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ప్రస్తుతం జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడం, ఖర్చుతో కూడుకున్నది కావడంతో జీవన్‌రెడ్డికి బదులుగా వేరొకరిని ఎంపిక చేయాలన్న ఆలోచనలో తెలంగాణ కాంగ్రెస్ ఉంది. జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా పంపాలన్న చర్చ నడుస్తోంది. జీవన్‌రెడ్డి పోటీలో ఉండట్లేదన్న వార్తలు రావడంతో ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అమిగోస్ విద్యాసంస్థల అధినేత మస్కు రమణారెడ్డి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, మాజీ డీఎస్పీ గంగాధర్, పార్టీ నేతలు వెల్చాల రాజేందర్, ప్రసన్న హరికృష్ణ తదితరులు ఈ సీటు కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. మస్కు రమణారెడ్డి ఇప్పటికే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహను కలిసి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే నర్సింహారెడ్డి, గంగాధర్ వంటి నేతలు సైతం టికెట్ కోసం యత్నిస్తున్నారు. అయితే, ఈ సీటుకు సిటింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డినే మళ్లీ బరిలో దింపాలని అధిష్ఠానం సూచిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ నెల 15 కల్లా ఈ సీటుపై నిర్ణయం జరగాల్సి ఉన్నా.. అధిష్ఠానం సూచనతో వాయిదా పడింది. ఇక, రెండు టీచర్ ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి మిత్రపక్షానికి కేటాయించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేసుకుంటున్న టీపీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి.. ఆ సీటును తనకు కేటాయించాల్సిందిగా పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నారు.

ఎమ్మెల్యే కోటాకు భారీగా ఆశావహులు!

ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల్లో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మజ్లిస్ ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్‌ల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. అయితే సభలో బీఆర్ఎస్‌కు ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి ఒక సీటు కచ్చితంగా ఆ పార్టీ దక్కించుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లలో మజ్లిస్ సిటింగ్ సీటును ఆ పార్టీకే వదిలేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తే.. కాంగ్రెస్‌కు మూడు సీట్లు దక్కనున్నాయి. ఈ మూడు సీట్లకు కాంగ్రెస్ ఆశావహుల సంఖ్య భారీగానే ఉంది. జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా చేసే అంశం ఒకవైపు పరిశీలనలో ఉండగా.. కమ్మ కోటాలో పార్టీ సీనియర్ నేత కుసుమ్‌కుమార్ పేరునూ పరిశీలిస్తున్నారు. అలాగే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, పార్టీ నేతలు హరివర్ధన్ రెడ్డి, సామా రామ్మోహన్‌రెడ్డి తదితరులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మరో సీటును ఎస్టీ బంజారా లేదంటే ఎస్సీ మాదిగకు కేటాయించే అవకాశం ఉంది. ఎస్సీ మాదిగ కోటాలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ప్రయత్నిస్తున్నారు. మూడో సీటును మైనార్టీలకు కేటాయించనున్నట్లు చెబుతున్నారు. ఈ సీటుకు వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం రేవంత్‌కు సన్నిహితుడైన ఫహీం ఖురేషి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ తదితరులు పోటీ పడుతున్నారు. బీసీ కోటా కింద పార్టీ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్ యాదవ్, సునీతారావు తదితరులు టికెట్ ఆశిస్తున్నారు.

ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుకు రూ. 3 వేలు డిమాండ్!

2500 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వార్డు ఆఫీసర్

» ఖమ్మం జిల్లాలో ఘటన

» మెదక్ జిల్లాలో 20 వేలు తీసుకుంటూ దొరికిపోయిన ఏఈ



వార్డు ఆఫీసర్ వినోద్

సత్తుపల్లి రూరల్/మనోహరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డు మంజూరు కోసం లంచం తీసుకుంటూ మునిసిపల్ వార్డు ఆఫీసర్ ఏసీబీకి దొరికిపోయిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మునిసిపాలిటీలో జరిగింది. మునిసిపాలిటీ వార్డు ఆఫీసర్ రూ.2500 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఘటన వివరాలిలా ఉన్నాయి.. సత్తుపల్లి మునిసిపాలిటీలో 18వ వార్డుకు చెందిన ఓ మహిళ ప్రజాపాలన గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకుంది. 23న గ్రామసభ ముగియగా ఈ పథకాల లబ్ధిదారుల జాబితాలో ఆమె పేరు రావాలంటే రూ.3 వేలు లంచం ఇవ్వాలని వార్డు ఆఫీసర్ నల్లంటి వినోద్ 24న డిమాండ్ చేశాడు. ఆ మహిళ తొలి విడతగా రూ.2,500 ఇచ్చేందుకు అంగీకరించి, ఏసీబీ అధికారులను సంప్రదించింది. సోమవారం సత్తుపల్లి పాత సెంటర్‌లోని డీసీబీ బ్యాంక్ పక్కన వార్డు ఆఫీసర్‌కు రూ.2500 లంచం ఇస్తుండగా ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. నిందితుడ్ని వరంగల్ సెషన్స్ కోర్టులో హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఓ ఏఈ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో చోటుచేసుకుంది. మండలంలోని ఓ పరిశ్రమకు 3 ఫేజ్ విద్యుత్తు సరఫరా కోసం ఏఈ కృష్ణ రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. పరిశ్రమ యజమానులు రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నెల 17న రూ.10 వేలు ఏఈకి ఇచ్చారు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మిగిలిన రూ.20 వేలను సోమవారం ఏఈ కాళ్లకల్ విద్యుత్తు శాఖ కార్యాలయంలో తీసుకుంటుండగా, మెదక్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

పాలనపై నేరుగా ప్రజలనే అడుగుదాం

» శాఖలవారీగా ప్రజల్లో సంతృప్తిపై సర్వే

» ఏఐ వినియోగానికి అధిక ప్రాధాన్యం

» ఆర్టీజీఎస్ సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. పీపుల్ ఫస్ట్ అనే నినాదంతో ఈ ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఐవీఆర్ఎస్ విధానంలో ఫోన్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని రియల్‌టైమ్ గవర్నెన్స్ అధికారులు సేకరించారు. ఈ సర్వే వివరాలను వెలగపూడి సచివాలయంలో సోమవారం సీఎం సమీక్షించారు. గుడి, బడి, అన్నక్యాంటీన్లు, హోటల్. మాల్స్, నాలుగు రోడ్ల కూడలి...ఇలా జనం ఒక చోట కలిసే ప్రతిచోటా కూటమి ప్రభుత్వ పాలనపై ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని ఆదేశించారు. జననమరణ ధ్రువపత్రాలు, విద్యార్హతా పత్రాలను వాట్సప్ విధానంలో జారీ చేయడాన్ని ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఏఐ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పథకాల అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాన్ని సేకరించాలని స్పష్టంచేశారు. పాలనపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రామాణికంగా తీసుకుంటామని, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా శాఖల పనితీరును మెరుగుపరుచుకుంటామని వెల్లడించారు.

మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవం

» 31న సీఎం రేవంత్‌రెడ్డి రాక

» పూర్వ విద్యార్థులు తరలిరావాలి: ప్రొఫెసర్ జి. హరగోపాల్



షాద్‌నగర్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 31న రాబోతున్నారని అఖిల భారత విద్యా హక్కు వేదిక అధ్యక్షవర్గ సభ్యుడు, ప్రొఫెసర్ జి.హరగోపాల్ తెలిపారు. షాద్‌నగర్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో మొగిలిగిద్ద పాఠశాల పూర్వ విద్యార్థులతో కలిసి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాల వార్షికోత్సవాన్ని పండగలా నిర్వహిద్దామన్నారు. మాజీ ముఖ్యమంత్రులు దివంగత బూర్గుల రామకృష్ణారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డితో పాటు తనవంటి వారు ఎందరో మొగిలిగిద్ద పాఠశాలలో చదివి గొప్ప స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబసభ్యులతో కలిసి తరలిరావాలని పిలుపునిచ్చారు. పాఠశాలను అభివృద్ధి చేయాలని సీఎంను కోరామని, దీంతో కలెక్టర్‌ను గ్రామానికి పంపించి ప్రతిపాదనలు తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, ప్రొఫెసర్ వనమాల, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచానికి సవాల్‌గా ఉగ్రవాదం

» అలహాబాద్ సెంట్రల్ వర్సిటీ మాజీ వీసీ హర్షే

» పోలీసింగ్‌లో వ్యాస్‌ది ప్రత్యేక ముద్ర: డీజీపీ జితేందర్

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం ప్రపంచ దేశాలకు పెను సవాల్‌గా మారిందని అలహాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్(వీసీ) రాజెన్ హర్షే అన్నారు. అన్ని రాష్ట్రాలు, దేశాలు సమన్వయంతో పని చేస్తేనే ఉగ్రవాదాన్ని అంతం చేయడం సాధ్యమవుతుందని చెప్పారు. మాజీ ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ 26వ స్మారక ఉపన్యాసం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 'ప్రపంచీకరణ-ఉగ్రవాదం' అనే అంశంపై హర్షే మాట్లాడారు. 9/11 దాడుల తర్వాత ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమస్యగా గుర్తించాయని చెప్పారు. పోలీసింగ్‌లో మార్పు కోసం వ్యాస్ ఎన్నో సంస్కరణలు చేపట్టారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థలో కేఎస్ వ్యాస్ పలు సంస్కరణలు చేశారని, అవి ఇప్పటికీ సమర్థంగా కొనసాగుతున్నాయని డీజీపీ జితేందర్ అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాంతి భద్రతల పరిరక్షణకు కొత్తగా పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు, మావోయిస్టుల కట్టడికి గ్రేహౌండ్స్ విభాగం ఏర్పాటులో వ్యాస్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

'పరీక్షా పే చర్చ'లో తెలంగాణ విద్యార్థి సాయితేజ



సిరిసిల్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పరీక్షల కాలంలో విద్యార్థుల్లో ఉండే సందేహాలు, భయాలను తొలగించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులతో నిర్వహించే 'ప్రధానమంత్రి పరీక్షా పే చర్చ'లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థి పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కోనారావుపేట మండలం సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అలువాల సాయితేజ పాల్గొన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురై అన్నం తినక, భయాందోళనలకు గురవుతున్నారని, దీనికి పరిష్కారం ఏమిటని ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీని సాయితేజ అడిగారు. అందుకు ఆయన 'పరీక్షల సమయంలో తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా ఉండాలి. ఆ సమయంలో పిల్లలు ఉలా ఉంటున్నారో గమనించాలి. దానికి అనుగుణంగా పిల్లలను ప్రోత్సహించి ధైర్యాన్ని ఇవ్వాలి' అని బదులిచ్చారు.

పట్టణ కూలీలకూ 'భరోసా' అమలు చేయాలి

» హైకోర్టులో పిటిషన్.. ప్రభుత్వాన్ని కోరాలన్న ధర్మాసనం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి భూమి లేని రైతు కూలీలను ఆదుకునేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అన్ని మున్సిపాలిటీల్లో సైతం అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం బాపన్‌పల్లికి చెందని జి.శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ ఈ పథకానికి సంబంధించిన జీవో పంచాయతీరాజ్ శాఖ జారీచేసిందని, అది మున్సిపాలిటీలకు వర్తించబోదని తెలిపింది. అందువల్ల మొదట ప్రభుత్వానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి అందజేయాలని సూచించింది. కేసులోని ఇతర విషయాల్లోకి వెళ్లకుండా విచారణను ముగిస్తున్నట్టు పేర్కొంది.

రియల్ ఎస్టేట్ సిబ్బందిపై దాడి కేసు కొట్టేయండి

» హైకోర్టులో ఎంపీ ఈటల క్వాష్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ కంపెనీ సిబ్బందిపై దాడి చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈటల తరఫున న్యాయవాది లింగం దివాకర్‌రావు వాదిస్తూ... ప్లాట్ల కబ్జాలను అడ్డుకుని బాధితులకు న్యాయం చేయడానికి రియల్ ఎస్టేట్ సంస్థ యజమానిని ప్రశ్నించారే తప్ప ఎలాంటి నేరానికి పాల్పడలేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ సంస్థ ఏజెంట్లకు, బాధితులకు మధ్య జరిగిన సమావేశంలో తోపులాట చోటుచేసుకుందే తప్ప ఎలాంటి దాడి చేయలేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఫిర్యాదుదారు, రియల్‌ఎస్టేట్ సంస్థ ఉద్యోగి అయిన గ్యార ఉపేందర్‌కు నోటీసులు జారీచేసింది. వైఖరి తెలియజేయాలని పోలీసులు సూచించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది.

న్యాయవాదుల కోటాలో జడ్జిల భర్తీ పూర్తి చేయండి

» బార్ అసోసియేషన్ వినతి

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):న్యాయవాదుల కోటాలో హైకోర్టు జడ్జీల పదవుల నియామకాలను పూర్తి చేయాలని హైకోర్టు బార్ అసోసియేషన్.. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌కు విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం హైకోర్టులో ఖాళీగా ఉన్న 12 న్యాయమూర్తుల పదవుల్లో న్యాయవాదుల కోటాలో దాదాపు 10 ఖాళీలు ఉన్నాయని తెలిపింది. 2023లో నలుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు కొలీజియం పంపించినప్పటికీ వాటిపై ఎలాంటి సమాచారం లేదని గుర్తించింది. న్యాయాధికారుల కోటాలో నలుగురు జడ్జీలను నియమించినా లాయర్ల కోటాపై నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రస్తావించారు.

ఏడాదిన్నరలో 80 ఆపరేషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిని ఏర్పాటు చేశాడు. ఆస్పత్రి విజయవంతం కాకపోవడంతో దాన్ని అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అతనికి విశాఖపట్నానికి చెందిన లక్ష్మణ్ పరిచయం అయ్యాడు. 'ఆస్పత్రిని ఎలాగూ మూసివేస్తున్నారు కాబట్టి.. ఆపరేషన్ థియేటర్ మాత్రం వాడుకొని కిడ్నీ ఆపరేషన్లు చేసుకుంటాం. ఒక్కో ఆపరేషన్‌కు రూ.2.50 లక్షలు చెల్లిస్తాం' అని లక్ష్మణ్ ఆఫర్ ఇవ్వగా.. అవినాష్ ఒప్పుకొన్నాడు. అయితే ఆపరేషన్లు చేసే డాక్టర్, రోగి, దాత ఎవరు? ఈ దందా మొత్తాన్ని నడిపించే వ్యక్తి ఎవరు? అనేది మాత్రం తెలియదు. ఏ సమాచారం కావాలన్నా.. వాట్సాప్ కాల్‌లోనే మాట్లాడేవారు. అందులోనూ సూత్రధారుల ఫోన్ నంబర్లు కనిపించవు. కానీ, ఆపరేషన్ పూర్తయిన తర్వాత ఎవరి వాటా వారికి వెళ్తుందని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

రూ.48 కోట్లు దండుకున్నారు..

జనని ఆస్పత్రిలో 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు 54 అక్రమ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతి ఆపరేషన్‌కు రూ.2.50 లక్షల చొప్పున అవినాష్‌కు రూ.1.35 కోట్లు ముట్టినట్లు తేల్చారు. 2024 జూన్‌లో జనని ఆస్పత్రిని మూసివేశారు. ఆ తర్వాత దగ్గరలోని అరుణ ఆస్పత్రిలో ఆరు ఆపరేషన్లు చేసినట్లు గుర్తించారు. అనంతరం అలకనంద ఆస్పత్రిలో ఈ దందాను కొనసాగించారు. తన కమీషన్ కింద రూ.లక్ష పెట్టుకున్న అవినాష్. అలకనంద ఆస్పత్రి ఎండీ సుమంత్‌కు ఒక్కో ఆపరేషన్‌కు రూ.1.50 లక్షలు చెల్లించేలా మాట్లాడుకున్నాడు. గత జూలై నుంచి ఇప్పటి వరకు 20 ఆపరేషన్‌లు చేశారు. ఇన్ని శస్త్రచికిత్సలు చేసినప్పటికీ అవినాష్‌కు, సుమంత్‌కు దందా సూత్రధారులు ఎవరనేది తెలియదు. ఒక్కో ఆపరేషన్‌కు రూ.60 లక్షలు వసూలు చేసిన నిందితులు రూ.48 కోట్లు కొల్లగొట్టినట్లు గుర్తించారు. కిడ్నీ దాత, గ్రహీతను ఎంపిక చేయడం, ఆపరేషన్ ఏర్పాట్లను ప్రధాన సూత్రధారి పవన్ అలియాస్ లియోన్ చూసుకుంటాడు. అన్నీ వాట్సాప్‌లోనే సెటిల్ చేసేవాడు. ఆపరేషన్‌కు అంతా సిద్ధమవగానే డాక్టర్ రాజశేఖర్ హైదరాబాద్ వస్తారు. నేరుగా ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేసేస్తారు. ఈ ప్రక్రియను ఆరు గంటల్లో పూర్తి చేసి వెళ్లిపోతారని విచారణలో తేలినట్లు సమాచారం. నెల్లూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ చెన్నైలో స్థిరపడ్డారు. ఆయనకు వీలుపడకపోతే, కశ్మీర్ నుంచి షోహిబ్‌ను పిలిపించి ఆపరేషన్ చేయించేవారని విచారణలో గుర్తించారు.

నగరంలో ఎక్కడెక్కడ చేశారు..?

డాక్టర్ రాజశేఖర్‌ను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కిడ్నీ రాకెట్ ప్రధాన సూత్రధారి పవన్‌ను విచారిస్తున్నట్లు తెలిసింది. కాల్‌డేటా, వాట్సాప్ చాట్, ఇతర డేటాపై దృష్టి సారించినట్లు సమాచారం. జనని, అరుణ, అలకనంద ఆస్పత్రులతో పాటు నగరంలో ఇంకా ఎక్కడెక్కడ కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశారు? హైదరాబాద్‌తో పాటు ఇంకా ఏయే రాష్ట్రాల్లో ఈ దందా నిర్వహించారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ దందాను హైదరాబాద్ కంటే ముందు ఆంధ్రప్రదేశ్‌లో చేశారా? అనే కోణంలోనూ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ సమ్మె సైరన్!

» కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

» 21 డిమాండ్లతో జేఏసీ సమ్మె నోటీసు

» బస్ భవన్ ముందు నాయకుల ధర్నా



బస్ భవన్ ముందు ధర్నాలో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్ సిటీ/రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ.. యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చింది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సెలవులో ఉండడంతో ఈడీ మునిశేఖర్‌కు 21 డిమాండ్లతో సోమవారం జేఏసీ నేతలు సమ్మె నోటీసులు అందజేశారు. వీటిపై ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం రెండు రోజుల్లో స్పందించాలని.. లేకపోతే సమ్మెకు వెళ్తామని చెప్పారు. సమ్మెకు మద్దతివ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరతామన్నారు. నోటీసులు ఇచ్చిన అనంతరం టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ.మౌలానా మాట్లాడుతూ.. ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో వీలి నం చేయాలని డిమాండ్ చేశారు. 2021 ఏప్రిల్ నుం చి ఆర్టీసీ కార్మికులకు చేయాల్సిన జీతభత్యాల సవరణ ఇంతవరకు చేయలేదన్నారు. పనిభారం, ఒత్తిడితో డ్రైవర్లు విధుల్లోనే గుండెపోటుతో చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్లు, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులను అద్దె వాహనాలుగా తీసుకొస్తున్నారని, ఈ బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లు ప్రైవేట్ వ్యక్తులని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులకు కిలోమీటరుకు రూ.58 చెల్లించడంతో కొన్ని రూట్లలో ఆర్టీసీ నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు.

పదేళ్లుగా నియామకాల్లేక పనిభారం

పదేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంతో ఉద్యోగులు, కార్మికులపై పనిభారం పెరిగిందని జేఏసీ నేతలు చెప్పారు. సుమారు 16 వేల మంది ఉద్యోగులు రిటైరైన తర్వాత ఆ పని భారం సర్వీసులో ఉన్న ఉద్యోగులపై పడి , అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ దశలవారీగా ఉద్యమాలు చేస్తూ ఈ విషయాలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రిటైరైన ఉద్యోగులకు సెప్టెంబరు 2024 నుంచి గ్రాట్యుటీ చెల్లించలేదని, ఐదేళ్లుగా కార్మికులకు యూనిఫాం ఇవ్వలేదని చెప్పారు. రిటైరైన ఉద్యోగుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ 9 నెలలుగా ఆగిపోయిందన్నారు. ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన రూ.1200 కోట్లను యాజమాన్యం పీఎఫ్ సంస్థలో జమ చేయలేదని ఆరోపించారు. బస్‌భవన్ వద్దకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమ్మె నోటీసులు, ధర్నా సందర్భంగా చిక్కడపల్లి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్మికుల పలు డిమాండ్లు..

- ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.
- ఆర్థికపరమైన అంశాలను అమలు చేస్తూ ప్రస్తుత సౌకర్యాలను కొనసాగిస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలి.
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి, రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3 శాతం నిధులు కేటాయించాలి.
- మహాలక్ష్మి పథకంలో భాగంగా జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్ కార్డులివ్వాలి.
- అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీచేసి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి.

ఒక వ్యక్తి ఒక పదవిలో మూడుసార్లకు మించి ఉండొద్దు

» ఇది నా వ్యక్తిగత అభిప్రాయం: ఏపీ మంత్రి లోకేశ్

» ఈసారి టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉండొద్దనుకుంటున్నా

» వైసీపీని వీడినా.. అక్రమార్కులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక



విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి ఒక పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదనేది తన వ్యక్తిగత అభిప్రాయమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్రామస్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకూ పార్టీలో ఈమేరకు మార్పు రావాలని అభిప్రాయపడ్డ ఆయన.. ఈ దఫా తాను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండకూడదని భావిస్తున్నట్టు తెలిపారు. 'సాక్షి' పత్రికపై దాఖలు చేసిన పరువునష్టం కేసులో సోమవారం ఇక్కడి కోర్టుకు హాజరైన అనంతరం లోకేశ్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఒక్కొక్కరూ రాజీనామా చేస్తున్నారని.. అయితే చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తులను వదిలిపెట్టబోమని ఆయన స్పష్టంచేశారు. గత ప్రభుత్వంలో అక్రమాలు చేసిన నాయకులపై దర్యాప్తు జరుగుతుందని, దోషులని తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తుపాకీ పెట్టి కాకినాడ పోర్టును అడ్డగోలుగా లాక్కున్నారని, రూపాయి వస్తువును ఆరు పైసలకే విజయసాయిరెడ్డి కొట్టేశారని లోకేశ్ ఆరోపించారు. విశాఖలో భూకబ్జాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 7నెలల్లో ఏపీకి రూ.6.33లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని.. వీటి వల్ల 4.1 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని లోకేశ్ గుర్తుచేశారు. దావోస్‌లో ఎప్పుడూ ఒప్పందాలు జరగవని.. అక్కడ చర్చలే జరుగుతాయని, ఆతర్వాత కంపెనీల ఆసక్తిమేరకు ఒప్పందాలు చేసుకుంటారన్నారు. "ఒప్పందం ఎందుకు.. ఏకంగా వర్కులోకి వెళ్తామని ఆర్సెలార్ మిట్టల్ చెప్పారు. ఇప్పటికే ఆర్సెలార్ ఉక్కుకు అన్ని అనుమతులూ ఇచ్చాం. త్వరలో భూమి కేటాయిస్తాం. గతంలో దావోస్‌లో జగన్‌ను కలిసేందుకు ఓ కంపెనీ ప్రయత్నిస్తే అందుకు నిరాకరించారు. నేను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఐటీ కంపెనీల ప్రతినిధులను కలిశాను. టాటా చైర్మన్ చంద్రశేఖర్‌ను కలిశాక విశాఖకు టీసీఎస్ వస్తోంది. 3నెలల్లో రాబోతోంది. వచ్చే రెండేళ్లలో భూములు సమకూర్చుకుని టీసీఎస్ సొంతంగా క్యాంపస్ ఏర్పాటుచేస్తుంది. ఐదేళ్లలో ఐటీలో విశాఖలో 5లక్షల మందికి ఉద్యోగాల కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నాం" అని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదనే మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. 'సొంత గనులు లేకపోవడంవల్ల కాదు.. కొందరు సీఈవోల వల్ల కర్మాగారం నష్టపోయింది. త్వరలో అక్కడి పాలనను సెట్‌చేస్తాం' అన్నారు.

ఊరిలో కరెంట్ పోయినా 1912కు ఫోన్ చేయొచ్చు

» టోల్‌ఫ్రీ నంబరు సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ

» సరఫరాపై పర్యవేక్షణకు నోడల్ అధికారులు

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంతకాలం గ్రేటర్ హైదరాబాద్‌కే పరిమితమైన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే సంప్రదించే టోల్‌ఫ్రీ నంబరు 1912 సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తూ దక్షిణ డిస్కమ్ ఎస్పీడీసీఎల్-హైదరాబాద్ నిర్ణయం తీసుకుంది. దాంతో ఇకపై గ్రామాల్లో కరెంట్ పోతే నేరుగా 1912 నంబరుకు ఫోన్ చేయవచ్చు. సరఫరాలో అంతరాయం కలిగినా, ఏదైనా విద్యుత్ అత్యవసర పరిస్థితి తలెత్తినా టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఒక ప్రకటనలో సూచించారు.వచ్చే వేసవి కాలంలో పెరిగే విద్యుత్ డిమాండుకు తగ్గట్టుగా వేసవి కాల కార్యాచరణ ప్రణాళిక కోసం, వివిధ జిల్లాల పరిధిలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పరిశీలించేందుకు గాను పలువురు అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. నాగర్‌కర్నూలు జిల్లాకు డాక్టర్ ఎన్.నర్సింహులు, సంగారెడ్డి జిల్లాకు నంద కుమార్, సిద్దిపేట జిల్లాకు సాయిబాబా, నల్గొండ జిల్లాకు బిక్షపతి, వికారాబాద్ జిల్లాకు ఆనంద్, గద్వాల జిల్లాకు కె.భాస్కర్, వనపర్తి జిల్లాకు రంగనాథ్‌రాయ్, నారాయణపేట జిల్లాకు ప్రభాకర్, హైదరాబాద్ జిల్లాకు చక్రపాణి, మహబూబ్‌నగర్ జిల్లాకు నర్సింహస్వామి, రంగారెడ్డి జిల్లాకు పాండ్య, మెదక్ జిల్లాకు బాలస్వామి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు కామేష్, యాదాద్రి జిల్లాకు ప్రతిమా షోమ్, సూర్యాపేట జిల్లాకు బి.రవిలను నోడల్ అధికారులుగా నియమించారు.

సుప్రీంలో వాన్‌పిక్ కేసు మే 6కి వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ అక్రమాస్తుల కేసుల్లో భాగమైన వాడరేవు-నిజాంపట్నం పోర్ట్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ (వాన్‌పిక్) భూముల కేసును సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా.. దానిని కోర్టు కొట్టివేసింది. దీనిపై ఆయన నిరుడు మే 30న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తదుపరి విచారణను న్యాయస్థానం మే 6వ తేదీకి వాయిదా వేసింది.

సెకండ్ షోకు పిల్లల్ని అనుమతించొద్దు

» 11 గంటల తర్వాత 16 ఏళ్ల లోపు వారిని రానివ్వొద్దు

» పుష్ప-2 తొక్కిసలాట నేపథ్యంలో హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాత్రి 11 గంటల తర్వాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమా థియేటర్లలోకి అనుమతించరాదని నిషేధం విధిస్తూ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక తల్లి మరణించడంతో పాటు ఒక చిన్నారి తీవ్ర గాయాల పాలైన నేపథ్యంలో ఇక చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేసింది. బెనిఫిట్, స్పెషల్ షోలకు అనుమతులివ్వడం, టికెట్ల రేట్ల పెంపుపై దాఖలైన పలు పిటిషన్‌లపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు విజయ్ గోపాల్, సుల్తానా బాషా, మామిడాల మహేశ్, పి.శ్రీనివాస్‌రెడ్డి వాదిస్తూ.. వేళ కాని వేళలో సినిమాలకు వెళ్లే మైనర్ల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర వ్యతిరేక ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. "రాత్రి 11 గంటల తర్వాత సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో 16 ఏళ్లలోపు పిల్లలను అనుమతించడం భావ్యం కాదని ఈ కోర్టు భావిస్తోంది. ఉదయం 11 గంటలకు ముందు రాత్రి 11 గంటల తర్వాత సినిమా థియేటర్లలోకి పిల్లల ప్రవేశాన్ని నియంత్రించే విధంగా అందరు స్టేక్ హోల్డర్లతో చర్చించి హోం శాఖ ముఖ్య కార్యదర్శి తగిన నిర్ణయం తీసుకోవాలి. నిర్ణయం తీసుకున్న తర్వాత థియేటర్లకు సంబంధిత వర్గాలకు రూల్స్ జారీ చేయాలి. సదరు ప్రక్రియ పూర్తయ్యే వరకు రాత్రి 11 గంటల తర్వాత సినిమా థియేటర్లలోకి 16 ఏళ్లలోపు పిల్లలను అనుమతించడంపై నిషేధం విధిస్తున్నాం" అని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.